VISALAANDHRA Phone No: 75301 ఉదయం ★ ★ ★ Regd No. 203

విశాలాంధ్ర

ల03837

సంపుటి 22 సంచిక 25 | విజయవాడ 10-4-72 సోమవారం | 6 పేజీలు 15 పై.

విశాలాంధ్ర

	ఏజంటుద్వారా/	పోస్టుద్వారా
నెలకు	రు. 4.70	5.00
3 నెలలకు	14.10	15.00
6 నెలలకు	28.20	30.00
సంవత్సరమునకు	56.40	60.00

దినపత్రిక 15 పైసలు
ఆదివారం సంచిక 20 పైసలు
చందా వివరాలు

రెండింతలైన సప్తమ నౌకాదళం

సైగాన్, ఏప్రిల్ 9

వియత్నాం అంతటా యుద్ధాన్ని విస్తరించేందుకై ఇండోచైనా వద్ద వున్న సప్తమ నౌకాదళంలోని యుద్ధ నౌకల సంఖ్యను గతవారం లోనే రెండింతలకు పైగా అమెరికా పెంచింది. అధికార వర్గాలు నేడీ విషయం వెల్లడించాయి.

అలీన విధానం కొనసాగింపు

ముజిబుర్ రహ్మాన్ పునరుద్ఘాటన

ఢాకా, ఏప్రిల్ 9

బంగ్లాదేశ్ ప్రభుత్వం అలీన విధానాన్ని అనుసరిస్తుందని ప్రధాన మంత్రి షేక్ ముజిబుర్‌రహ్మాన్ నేడు పునరుద్ఘాటించారు.

సహజీవనసూత్రంపట్ల బంగ్లాదేశ్ ప్రభుత్వానికి విశ్వాసం వున్నది. ప్రతి ఒక్కరితో మైత్రి మావిధానం అని ఆయన అన్నారు.

బంగ్లాదేశ్ స్టూడెంట్స్ యూనియన్ 20 వ వార్షిక సమావేశాన్ని ప్రారంభిస్తూ, బంగ్లాదేశ్ పోరాటం సందర్భంగా భారత్, సోవియట్ ప్రజలందించిన సహాయాన్ని ప్రస్తావించారు.

ఈ దేశాలతో స్నేహం కలకాలంవుంటుందని ముజిబ్ పేర్కొన్నారు.

పోషకులం స్వాపనకు ఎవ్వరు సహాయాన్ని, సహకారాన్ని అందించినా తీసుకోవటం జరుగుతుందన్నారు. సోషలిస్టు తరహా ఆర్థిక వ్యవస్థ ద్వారానే ప్రజాసంక్షేమం సాధ్యమని తాను దృఢంగా విశ్వసిస్తున్నానన్నారు.

చైనాపై విమర్శ

బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటం సందర్భంగా చైనా అనుసరించినవైఖరిని ముజిబ్ విమర్శించారు.

బంగ్లాదేశ్ పోరాటం సందర్భంగా చైనా ప్రభుత్వం బహిరంగంగా ఆక్రమిత ప్రభుత్వాన్ని బలపరిచిందని అన్నారు.

కమ్యూనిస్టుపార్టీ జాతీయ సమితి సమావేశం

ఏప్రిల్ 14 నుంచి 18 వరకు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ సమితి ఈ నెల 14 నుంచి 18 వరకు ఢిల్లీలో సమావేశమవుతుంది.

ఏప్రిల్ 8 నుంచి 10 వరకు కేంద్ర కార్యవర్గం సమావేశమవుతుంది.

విద్యుత్ షాక్‌వల్ల కార్మికుని మృతి

అగ్ని గుండాల గనుల్లో

వినుకొండ, ఏప్రిల్ 8

గుంటూరు జిల్లా వినుకొండ తాలూకాలోని అగ్ని గుండాల, రాగి, సీసం ప్రాజెక్టులోని నల్లకొండ గనిలో ఈనెల 6 వ తేదీన విద్యుత్‌షాక్‌వల్ల శ్రీ నంబూరి లక్ష్మయ్య అనే ఒక కార్మికుడు మరణించాడు.

మృతదేహాన్ని గని ఇంజనీరు ఇక్కడకు 4 మైళ్ళ దూరంలోనున్న బండ్లమోటు ఆసుపత్రికి తరలించారు.

గనులలో రక్షణ సౌకర్యాలు లేనందువల్ల కార్మికులు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.

శ్రీ లక్ష్మయ్య సంతాప సభను మైన్ యూనియన్ ఏర్పాటు చేసింది.

సింహళంలో అరెస్టయిన యువకుల విడుదల ప్రారంభం

కొలంబో, ఏప్రిల్ 8

గత సంవత్సరం సింహళంలో తిరుగుబాటులో పాల్గొని అరెస్టయిన దాదాపు 14 వేల మంది యువకులలో 6 వేల మందిని ప్రభుత్వం విడుదల చేయడం ప్రారంభించిందని అధికార ప్రతినిధి నేడిక్కడ తెలిపారు.

గురువారంనాడు సింహళంలో సాంప్రదాయకంగా జరిగే నూతన సంవత్సర ఉత్సవంనాటికి వారిలోని అత్యధికులు తమ గృహాలలో వుంటారు. ఈ యువకులంతా నిషేధించబడిన "జనతా విముక్తి పెరమున" నిర్వహించిన సైద్ధాంతిక తరగతులకు మాత్రమే హాజరయ్యారు, వారు వాస్తవంగా టెర్రరిస్టు కార్యకలాపాలలో పాల్గొనలేదని పరిశోధనలో వెల్లడయింది.

మిగతా వారందరిపై నూతన చట్టం మేరకు విచారణ జరుపుతారు.

రాజస్థాన్ అసెంబ్లీ వాయిదా

జైపూర్, ఏప్రిల్ 8

రాజస్థాన్ శాసనసభను నేడు వాయిదా వేశారు.

రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీలో తీవ్ర సంక్షోభం

విజయభాస్కరరెడ్డి, నారపరెడ్డి, వెంగళరెడ్డి, సిద్ధారెడ్డి, బాపినీడు, వెనిగళ్ళప్రభృతుల సస్పెన్షన్

రాజ్యసభఎన్నికల్లో పిరాయింపులదృష్ట్యా చర్యతీసుకున్నట్లు పి.సి.సి అధ్యక్షునిప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 9

ప్రముఖ కాంగ్రెసు నాయకులు పద్నాలుగు మందిని సస్పెండ్ చేస్తూ అడ్ హాక్ పి.సి.సి అధ్యక్షులు మహమ్మద్ ఇస్మాయిల్ యీ రోజు ప్రకటించటంతో రాష్ట్రంలో కాంగ్రెసుపార్టీ తీవ్రమైన నిర్మాణ సంబంధ సంక్షోభం వైపు పయనిస్తున్నది.

నిన్న జరిగిన రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలలో పార్టీ పరాజయాల అనంతరం యీ చర్య తీసుకున్నారు.

సస్పెండ్ చేయబడిన వారిలో యీ క్రింది వారు వున్నారు కె. విజయభాస్కరరెడ్డి (ఎ.పి.సి.సి ఉపాధ్యక్షులు, మాజీ ఆర్థిక మంత్రి) రొండా నారపరెడ్డి, కేలం సిద్ధారెడ్డి, వి. పురుషోత్తంరెడ్డి (అందరు మాజీ మంత్రులు) అల్లూరి బాపినీడు (పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌చైర్మన్) కాసువెంగళరెడ్డి (గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్) నరసింహారెడ్డి (మెదక్ జిల్లా పరిషత్ చైర్మన్ కె. ఆర్. రాజారెడ్డి (నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్) బి. శ్రీరాములు నాయుడు (శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్మన్) వెనిగళ్ళ సత్యనారాయణ (పార్లమెంటు సభ్యులు) వై. ఆదినారాయణరెడ్డి (మాజీ పార్లమెంటు సభ్యులు) యస్. వెంకటామిరెడ్డి (శాసనమండలి సభ్యులు) కె. రోశయ్య (శాసనమండలిసభ్యులు) సి. హెచ్. సత్యనారాయణరావు (శాసనసభ్యులు)

సస్పెండ్ చేయబడిన వారు రాష్ట్ర రాజకీయాలలో మాజీముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డికి సన్నిహితులు. డాక్టరు మర్రి చెన్నారెడ్డి సన్నిహిత సహచరుడైన శ్రీ యస్. వెంకటామిరెడ్డి పేరు కూడ సస్పెండ్ చేయబడిన వారిలో వుండటంపట్ల ప్రాముఖ్యత వున్నట్లు భావిస్తున్నారు.

వీరిపై సస్పెన్షన్ చర్య తీసుకోవటానికి ప్రధాన కారణం "వారు బహిరంగంగా పార్టీ క్రమశిక్షణను, పార్టీ విప్‌ను ఉల్లంఘించడం, ప్రోత్సహించడం, కాంగ్రెసు పార్టీ అధికార అభ్యర్థుల ఓటమికి దోహదం చేయడం"…

(మిగతా 2 వ పేజీలో)



అన్ని స్థాయిలలోనూ అవినీతిని రూపుమాపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాజ్యసభలో హోం శాఖ స్టేట్ మంత్రి శ్రీ రామ్ నివాస్ మీర్ధా హామీ!

— నేషనల్ హెరాల్డు సౌజన్యంతో

సోవియట్, ఇరాక్‌ల స్నేహ ఒప్పందం?

బీరుట్, (లెబనాన్) ఏప్రిల్ 9

సోవియట్ యూనియన్, ఇరాక్‌ల మధ్య స్నేహ సహకార ఒప్పందం త్వరలో జరిగే సూచనలు కన్పిస్తున్నాయని ఎ.పి. వార్తా సంస్థ తెలుపుతోంది.

ప్రస్తుతం ప్రధాని కొసిగిన్, ఇరాక్‌లో అధికారంలోవున్న విప్లవ మండలి ఉపాధ్యక్షులు సద్దామ్ హుస్సేన్ తక్రితీతో సంప్రదింపులు జరుపుతున్నారు.

గత ఫిబ్రవరిలో తక్రితీ మాస్కోలో జరిపిన చర్చల కొనసాగింపే ప్రస్తుత సంప్రదింపులని బాగ్దాద్ రేడియో తెలిపింది. మాస్కోలో చర్చల అనంతరం రెండు దేశాల "సంబంధాలను నూతన ఉన్నత స్థాయికి పెంచి వానిని నూతన ఒప్పందంగా రూపొందించాలని" భావిస్తున్నట్లు అప్పటి సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ఇరాక్‌లో రుమేలా నూనె కర్మాగారం వద్ద ఉత్పత్తి ప్రారంభించిన సందర్భంగా జరిగిన ఉత్సవాలకు కొసిగిన్‌హాజరయ్యారు. ప్రభుత్వ రంగంలో ఈ కర్మాగారాన్ని సోవియట్ సహకారంతో నిర్మించారు.

ఆసియా సమిష్టి భద్రతా వ్యవస్థకు దోహదం

ఇరాక్, సోవియట్‌ల మధ్య అనివార్యంగా జరుగనున్న ఒప్పందం ఆసియా సమిష్టి భద్రతా వ్యవస్థ ప్రతిపాదనకు మంచి ఊపు లభిస్తుందని మాస్కోలోని అభిజ్ఞ వర్గాలు తెలిపినట్లు పి. టి. ఐ. విలేకరి రాస్తున్నారు.

అమెరికా నౌకలకు తీవ్ర నష్టం

హాంగ్‌కాంగ్, ఏప్రిల్ 8

ఉత్తర వియత్నాం జలాలలో ఉన్న సప్తమ నౌకా దళానికి చెందిన నౌకలపై ఒడ్డునుండి ఉత్తరవియత్నాం సేనలు ఫిరంగులను పేల్చారు.

విసైన్యరహిత మండలానికి పైగా ఉన్న క్వాంగ్‌బిన్‌లో పౌర ప్రాంతాలపై కాల్పులు సాగిస్తున్నపుడు అమెరికా నౌకలపై యీ కాల్పులు సాగాయి. హనోయ్‌రేడియో యీ విషయం తెలిపింది.

గత గురు, శుక్రవారాల్లో తీరంపై దాడి జరిపిన మరో రెండు అమెరికా డిస్ట్రాయర్లకు ఉత్తర వియత్నాం సేనలు తీవ్రనష్టం కలిగించాయని వియత్నాం న్యూస్ ఏజన్సీ తెలిపింది.

శాసనసభ లోపల, వెలుపల ప్రజా సమస్యలపై పోరాటం

కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తుందని పత్రికా గోష్ఠిలో ప్రతిపక్ష నాయకులు శ్రీ వి. శ్రీకృష్ణ ఉద్ఘాటన

హైదరాబాదు, ఏప్రిల్ 9

ప్రజా సమస్యల పరిష్కారానికి భారత కమ్యూనిస్టుపార్టీ శాసన సభలోనూ, వెలుపలా పోరాటం నిర్వహిస్తుందని ప్రతిపక్ష నాయకులు శ్రీ శ్రీకృష్ణ నేడిక్కడ పత్రికా సమావేశంలో అన్నారు.

శాసనసభ వెలుపల తమ పార్టీ ప్రజా ఉద్యమాలు నడుపుతుందని ఆయన అన్నారు.

శాసనసభ ప్రథమ సమావేశంలో కమ్యూనిస్టుపక్షం నిర్వహించిన పాత్రను గురించి ప్రస్తావిస్తూ, కరువు పరిస్థితి, మంచినీటి ఎద్దడి, ధరల పెరుగుదల, వాణిజ్య పంటల ధరల అస్థిరత, నిరుద్యోగం, నాగార్జున సాగర్ కుడి కాలువకు సంబంధించి ఉద్యోగుల రిట్రెంచ్‌మెంట్, భూమి పన్ను బకాయిల నిర్బంధ వసూళ్ళు, విద్యుత్ కొరత, వగైరా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలను తమ పార్టీ సభ ముందుకు తెచ్చిందని ఆయన చెప్పారు.

కమ్యూనిస్టు శాసనసభ్యులు శ్రీ వంకా సత్యనారాయణ, శ్రీ బద్దం ఎల్లారెడ్డి కూడా పత్రికా సమావేశానికి హాజరయ్యారు.

ఎరువుల పంపకంలో జరిగిన కుంభకోణాన్ని కమ్యూనిస్టు పక్షం బహిర్గతం చేసిందని ఆయన అన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించే శక్తి ప్రస్తుత ప్రభుత్వానికిలేదని అసెంబ్లీ సమావేశం తిరుతెన్నులు రుజువు చేశాయని, దేశం ఎదుర్కొంటున్న సమస్యలను సభ ముందుకు తేవడంలో కమ్యూనిస్టు పక్షమూ, ఇతర ప్రతిపక్షాలు ఓటర్లపట్ల తమకున్న బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాయని శ్రీకృష్ణ చెప్పారు.

ప్రభుత్వం నుంచి ప్రజలకుగాను కొన్ని సౌకర్యాలు కలిగించడంలో తాము కృతకృత్యులయ్యామని ఆయన అన్నారు. ఈ క్రింది సౌకర్యాలు కలిగించామని ఆయన వివరించారు.

1. ఎం. బి. బి. ఎస్ విద్యార్థుల ఫీజుల తగ్గింపు.

2. ఎరువుల బస్తాల బరువు మేరకు డబ్బు వసూలు చేసేందుకు ఉత్తరువులు జారీ చేయించడం.

3. వివాదగ్రస్తమైన భూ పన్ను ద్వారా రక్షణ నిధి వసూళ్ళ ఆపుదలకు ఉత్తరువు.

4. ప్రణాళికేతర ఖర్చులో కోతపెట్టిన కారణంగా రిట్రెంచ్‌మెంటు వుండకూడదు.

5. విజయవాడ, మద్రాసు రైల్వేలైను విద్యుదీకరణ కేంద్ర కార్యాలయాన్ని విజయవాడలో స్థాపించేందుకు ఉత్తరువు.

పరిపాలనా వ్యవహారాల్లో జరుగుతున్న అనేక అవకతవకలను, అవినీతి కార్యకలాపాలను కమ్యూనిస్టు పక్షం బహిర్గతం చేసి తీవ్రంగా విమర్శించిందని శ్రీకృష్ణ తెలిపారు.

చలసాని వెంకటరత్నం హత్య, పెదవల్లి హరిజనుని హత్య, గుజ్జ గ్రామంలో పోలీసు కాల్పులు వగైరా విషయాలగూర్చి కూడా తమపక్షం శాసనసభ ముందుకు తెచ్చిందని ఆయన తెలిపారు.

పాలక పార్టీ చేస్తున్న వాగ్దానాలకు, ఆచరణకూ మధ్య ఉన్న అగాధాన్ని బహిర్గతం చేయగలుగుతున్నాం.

ఆహార ధాన్యాల టోకు వ్యాపారాన్ని జాతీయం చేయాలని కోరుతాం. బంజరు సత్వర పంపిణీకి రాష్ట్ర స్థాయిలో సలహాకమిటీలు ఏర్పాటుచేయాలని కోరుతూ రెండు అనధికార తీర్మానాలను శాసనసభ ముందుంచాము. వాటిపట్ల ప్రభుత్వం అనాసక్త వైఖరి నవలంబిస్తున్నట్లు స్పష్టపడిందని శ్రీ కృష్ణ చెప్పారు.

రాష్ట్ర వనరులు పెంచేందుకు కేంద్ర పథకాలను రాష్ట్రానికి పొందేందుకు అవసరమైన కొన్ని నిర్దిష్ట సూచనలను రాష్ట్రానికి తెలిపామని ఆయన అన్నారు

ప్రజా వ్యతిరేక చర్యలు

రాష్ట్రప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను చేపడుతున్నది. తత్ఫలితంగా పాలక పార్టీలో చీలికలు, భేదాభిప్రాయాలుతప్పవు, స్పష్టం కాక మానవు. కాంగ్రెస్ శాసన సభ్యుల ప్రవర్తనను బట్టి కాంగ్రెసు కార్యకర్తల్లో అసంతృప్తి వెల్లడవుతున్నట్లు కనబడుతున్నది. రాజ్యసభ ఎన్నికలబట్టి కాంగ్రెసులో అసంతృప్తి, ముఠాతత్వం ప్రబలిపోతున్నట్లు తెలుస్తున్నది అని శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ అన్నారు.

దేశవ్యాపిత ప్రజాఉద్యమం

భూసంస్కరణలు, పెరిగిపోతున్నధరలు నిరుద్యోగ సమస్యలపై దేశవ్యాపితంగా కమ్యూనిస్టు పార్టీ ప్రజాఉద్యమాలను నిర్వహిస్తుందని ఆయన ప్రకటించారు

భారత్—పాక్‌ల మధ్య శిఖరాగ్రస్థాయి చర్చలపై

శ్రీమతిగాంధీ ప్రతిపాదనకు భుట్టో అంగీకారం?

పెషావర్, ఏప్రిల్ 9

శాంతి చర్చలకు భారత ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి చేసిన ప్రతిపాదనను పాకిస్తాన్ అధ్యక్షులు భుట్టో అంగీకరించినట్లు విశ్వసనీయవర్గాలు తెలియచేశాయని రాయిటర్ వార్తాసంస్థ తెలుపుతున్నది.

ఇస్లామాబాద్‌కు యీవారం ప్రారంభంలో శ్రీమతి ఇందిరాగాంధి ఒక లేఖ రాస్తూ భారత పాకిస్తాన్‌లకు చెందిన ప్రతినిధుల సంప్రదింపులు జరిపి రెండుదేశాల నాయకులమధ్య శిఖరాగ్ర సమావేశానికి ఎజెండాను రూపొందించాలని సూచించారు.

శిఖరాగ్ర స్థాయిలోనే మొదట చర్చలు జరగటం మంచిదని భుట్టో భావిస్తున్నప్పటికి శ్రీమతి గాంధి ప్రతిపాదనను అంగీకరించారని యీ వర్గాలు చెప్పాయి. ప్రస్తుతం ఇక్కడ పర్యటిస్తున్న భుట్టో వెంట వారు కూడా పర్యటిస్తున్నారు.

పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీ, ప్రాంతీయ అసెంబ్లీల సమావేశాల అనంతరం మూడవ వారంలో ప్రాథమిక సమావేశం ఇస్లామాబాద్‌లో కాని న్యూఢిల్లీలో జరిగే అవకాశాలు ఎక్కువగా వున్నాయని యీ వర్గాలు చెప్పాయి.

సమావేశం మూడవ దేశంలో జరగకూడదనే అభిప్రాయంతో పాకిస్తాన్ వున్నదని వారు అన్నారు. యిదే అభిప్రాయంతో భారత్ కూడా వున్నది.

చర్చలలో పాల్గొనే పాకిస్తాన్ ప్రతినిధిని ఇప్పటివరకు ఎంపిక చేయనప్పటికి బహుశా విదేశాంగశాఖ కార్యదర్శి అజీజ్ అహ్మద్ ప్రతినిధి కావచ్చును.

ఎజెండాను రూపొందించే పూర్తి అధికారాలు ప్రతినిధికి వస్తుంది.

వియంతియానే వద్ద 2 బ్రిడ్జిల పేల్చివేత

వియంతియానే, ఏప్రిల్ 8

లావోస్ రాజధాని వియంతియానేకు ఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరాన హైవే 13 పై 2 వంతెనలను పాథెట్‌లావో దళాలు పేల్చివేశాయి.

గత రాత్రి ఈ రెండుదాడులు జరగడంతో ప్రాంతీయ ముఖ్య పట్టణం పాక్సేన్ రాజధాని వియంతియానేల మధ్య సంబంధాలు బంద్ అయ్యాయి.

వంతెనలవద్ద గస్తీ వున్న కీలుబొమ్మ ప్రభుత్వ దళాలలోని ఇద్దరు హతమయ్యారు.

ఇలా ఉండగా దగ్గరలోనే ఉన్న మరో చిన్న వంతెనను ఇంకొక పాథెట్‌లావో దళం పేల్చివేసింది. ఈ దాడిలో రెండు కీలుబొమ్మ సైనిక వాహనాలు, రేడియో కమ్యూనికేషన్ సెట్ దగ్ధమయ్యాయి.

అన్‌లాక్ చుట్టూ భీకర పోరాటం

సైగాన్, ఏప్రిల్ 8

రాజధాని సైగాన్ చేరువలో బిన్‌లాంగ్ ప్రాంతరాజధాని అన్‌లాక్‌ను స్వాధీనంచేసుకుంటున్న విముక్తి యోధులపై కీలుబొమ్మ సేనలు మిగిలిన చిట్టచివరి అధ్యక్ష భవన రక్షకదళం దాడిచేసింది.

వీరికి వత్తాసుగా అమెరికా బి-52 యుద్ధ విమానాలు తెరలు తెరలుగా అన్‌లాక్‌పై దాడిచేసి బాంబులు కురిపించాయి. పట్టణంలో చిక్కుకుపోయిన అమెరికా సైనికాధికార్లను తరలించడానికి ప్రయత్నించిన ఒక హెలికాప్టర్‌ను విముక్తి యోధులు తరిమికొట్టారు.

అన్‌లాక్‌కు అన్నిదిక్కులా భీకరపోరాటం చెలరేగింది. కీలుబొమ్మ దళాలపై విముక్తి యోధులువిడ తెరిపిలేకుండా కాల్పులుసాగిస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.

ఎంత నష్టమయినాసరే అన్‌లాక్‌ను స్వాధీనంలో ఉంచుకోవాలని కీలుబొమ్మ ప్రభుత్వ అధ్యక్షుడు థీయూ ఉత్తర్వుచేశారు

హైవే 13 అంతటా విముక్తి సేనలు

అన్‌లాక్ నుండి జిల్లా ముఖ్య పట్టణం చాన్‌తాన్ వరకూ హైవే 13 అంతటా విముక్తి సేనలున్నాయని చాన్‌తాన్ గారిజన్ కీలుబొమ్మ కమాండరు చెప్పారు.

"మాపై వారు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని ఔట్ పోస్టులను మేం వదులు కుంటున్నాం" అని ఆయనచెప్పారు.

వెనుకబడిన వర్గాల ఆర్థిక దుస్థితి

హైదరాబాద్, ఏప్రిల్ 9

స్వాతంత్ర్యం వచ్చాక, వెనుకబడిన వర్గాలు ఆర్థికరంగంలో ఆశించిన పురోగతి సాధించలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు నేడిక్కడ అన్నారు.

'సమాజ సంక్షేమం'పై జరిగిన గోష్ఠిలో ప్రసంగిస్తూ ఆయన పైవిధంగా చెప్పారు.

బలహీన వర్గాలను ఉద్ధరించవలసిన అవసరం వున్నదని ఆయన అన్నారు.

మరిన్ని అమెరికా యుద్ధనౌకలు, విమానాలు వియత్నాం రాక

కామ్‌రాన్ ఖాతంవద్ద అమెరికా వైమానిక స్థావరం ముట్టడి

కువావియత్ నదినిదాటి పురోగమిస్తున్న విముక్తి యోధుల టాంకుదళం

సైగాన్, ఏప్రిల్ 9

రాజధాని సైగాన్‌కు వాయవ్యంగా కామ్‌రాన్ ఖాతం వద్ద ఉన్న పెద్ద అమెరికా వైమానిక స్థావరంపై గత రాత్రి విముక్తి యోధులు దాడి జరిపారు

నిస్సైనిక మండలానికి దక్షిణంగా ఉన్న కువావియత్ నదిని విముక్తియోధుల టాంకు దళాలు దాటి, దక్షిణంగా పురోగమించి దొంగ్‌హా పశ్చిమదిక్కున కీలుబొమ్మ సేనల టాంకులపై కాల్పులు సాగిస్తున్నాయి. ఇంకా ముందుకు పురోగమించిన విముక్తి దళాలు వివిధ వైమానిక కేంద్రంపై కూడా కాల్పులు జరిపాయి.

కామ్‌రాన్ ఖాతంవద్ద విముక్తివీరుల దాడికి గురిఅయిన అమెరికా వైమానిక స్థావరంలోనే, అమెరికా, కీలుబొమ్మ ప్రభుత్వ దళాల సంయుక్త రేడియో రిలేస్టేషన్ ఉన్నది. అక్కడ జరిగిన దాడిలో ముగ్గురు అమెరికన్లు మరణించారనీ, 15 మంది గాయపడ్డారనీ అమెరికా సైనికవర్గాల ప్రకటనలో ఉంది

బాంబుదాడులు ఇలాగే కొనసాగిస్తారట

కీబిస్కేన్ (ఫ్లోరిడా), ఏప్రిల్ 8

దక్షిణ వియత్నాంలో అమెరికా విమాన, నౌకాదళ దాడులు ఇంకా కొనసాగిస్తారని ఫ్లోరిడా వైట్‌హౌస్ నేడు ప్రకటించింది, కీలుబొమ్మ సైన్యాలకు "అదనపుసాయం" కూడా ఇవ్వగలమని ఆ ప్రకటన తెలిపింది.

అయితే "అదనపు సాయం" అనేమాట అంతరార్థాన్ని ప్రభుత్వ ప్రతినిధి రోనాల్డ్ జీగ్లర్ వివరించలేదు.

నిక్సన్, ఆయన ఉన్నత సలహాదారులతో వియత్నాం పరిస్థితిపై చర్చలు సాగిస్తున్నారు. వియత్నాంకు సంబంధించి

(మిగతా 2 వ పేజీలో)



శుభాకాంక్షలు

రాష్ట్ర శాసనసభ నుండి
రాజ్యసభకు ఎన్నికైన
శ్రీ ఎ. ఎస్. చౌదరి గారికి
మా శుభాకాంక్షలు

కార్మికులు-సిబ్బంది.
నవభారత్ ఎంటర్‌ప్రైజెస్, గుంటూరు
(ప్రైవేట్ లిమిటెడ్)
జనరల్ ట్రేడింగ్ కంపెనీ, గుంటూరు

సంక్షేమనిధి కుంభకోణంపై శాసనసభలో రభస

ప్రత్యేకకోర్టు విచారణకు ప్రభుత్వ తిరస్కృతి

హైదరాబాద్, ఏప్రిల్ 8

శ్రీ బాబూర్ హరిప్రసాద్ చే సంక్షేమనిధి దుర్వినియోగం విషయమై విచారణకు ప్రత్యేక కోర్టును నియమించడానికి ప్రభుత్వం నిరాకరించడంతో శాసనసభలో నేడు పెద్ద గందరగోళం చెలరేగింది.

స్వల్పకాల వ్యవధి ప్రశ్నకు హోం మంత్రి శ్రీ కృష్ణమూర్తినాయుడు సమాధానమిస్తూ హరిప్రసాద్ కేసులో ప్రత్యేక కోర్టు నియమించాలని ప్రాసిక్యూషన్ విజ్ఞప్తి చేసిందన్నారు. అయితే కొత్త వ్యయంపై నిషేధం ఉన్న దృష్ట్యా ఆ విజ్ఞప్తిని ప్రభుత్వం తిరస్కరించిందన్నారు.

ప్రత్యేక కోర్టు ఏర్పాటువల్ల ప్రభుత్వానికి రు. 30 వేలు ఖర్చవుతుందని మంత్రి అన్నారు.

హరిప్రసాద్ ఉత్తర్వులను అమలు పరిచారని పరిశోధనలో వెల్లడవటంతో డి.ఐ.జి. (సి.ఐ.డి.) శాఖలో కొందరిని సస్పెండ్ చేయాలని ప్రభుత్వం తలపెట్టిందనుకు సి. ఐ. డి. శాఖ నిరసన తెలిపిందా? అన్న ప్రశ్నకు ఆయన సమాధానమివ్వలేదు. శ్రీ హరిప్రసాద్ నుండి రు. 4 లక్షలు వసూలు చేసేందుకు నూతన కార్యదర్శి రాఘవేంద్రరావు, తల పెట్టారన్నమాట నిజమేనా? అన్న ప్రశ్నకు కూడా హోంమంత్రి సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు.

శ్రీ హరిప్రసాద్‌పై ఉన్న కేసులను ఉపసంహరించాలని ప్రభుత్వం భావించడం లేదన్నారు. శ్రీ హరిప్రసాద్ కుటుంబ ఆస్తుల వివరాలపై విచారణ జరిపే ప్రతిపాదన కూడా లేదన్నారు.

ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం ఎందుకు అంగీకరించడం లేదని కమ్యూనిస్టు సభ్యులు శ్రీ యం. నాగిరెడ్డి ప్రశ్నించారు. దానిని సివిల్ కోర్టులోనే విచారించవచ్చని ప్రభుత్వం భావించిందని హోం మంత్రి చెప్పారు.

నాగిరెడ్డి: హరిప్రసాద్‌కు బెయిల్ నిరాకరించిన మేజిస్ట్రేట్ బదిలీ చేయబడ్డాడెందుకు?

ముఖ్యమంత్రి: ఆ బదిలీతో ప్రభుత్వానికి సంబంధంలేదు. అది హైకోర్టుకు సంబంధించిన సమస్య.

వి. శ్రీకృష్ణ: ఇది కోటి రూపాయల దుర్వినియోగానికి చెందిన సమస్య. అందువల్ల ప్రత్యేక కోర్టు ఏర్పరచాలి.

హోంమంత్రి: అది సివిల్‌కోర్టుద్వారానే చెయ్యొచ్చు.

రత్నసభాపతి: ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని ప్రాసిక్యూషన్ ఏ కారణాలవల్ల సిఫార్సు చేసింది.

హోం మంత్రి: ఎక్కువమంది సాక్షులను విచారించవచ్చునని.

రత్నసభాపతి: ప్రాసిక్యూషన్ రిపోర్టులోని ఆ అంశాలను మంత్రి చదువుతారా?

మంత్రి: అవన్నీ నేను తీసుకురాలేదు.

కుడిపూడి ప్రభాకరరావు (కాం): ఏదైనా సమాచారం గురించి సభ్యుడు అడిగినపుడు మంత్రి తిరస్కరించకూడదు.

రత్నసభాపతి: ఏకొ గందరగోళంపుని, సభముందు మంత్రి ఆ కాపీ ఉంచుతారా?

మంత్రి: అది కోర్టు ధిక్కారణ అవుతుంది.

రత్నసభాపతి, వంకా సత్యనారాయణ: కోర్టు ధిక్కారణ కాబోదు. ఎందుకంటే దుర్వినియోగంపై విచారణను సభ అభిప్రాయంపైనే జరిపిందాం, విచారణ నివేదిక గురించి తెలుసుకునే హక్కు సభకు ఉన్నది.

మంత్రి: విచారించవలసిన సాక్షులు అనేకమంది ఉన్నారనీ, పెద్ద పెద్ద ఫైళ్ళను చూడవలసి ఉందనీ ప్రాసిక్యూషన్ అభిప్రాయపడింది. అందువల్లనే ప్రత్యేక కోర్టులో విచారణ జరపాలని సిఫార్సు చేసింది.

రత్నసభాపతి: ఆ విజ్ఞప్తిని మంత్రి తిరస్కరించినట్లుంది, కారణాలు ఆయనకు తెలియాలి.

మంత్రి: ఇందులో దాచిపెట్టాల్సిందేమీ లేదు.

రిపోర్టుకోసం ఎక్కువ తీవ్రంగా వత్తిడి చేయడంతో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రతి రిపోర్టునూ సభముందు ఉంచాలని ఏమీ లేదన్నారు. ప్రస్తుత విషయమే సభకు సంబంధించినది.

శ్రీయుతులు వి. శ్రీకృష్ణ, యం. నాగిరెడ్డి, వంగా సత్యనారాయణలతోపాటు మరికొందరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి ప్రకటనకు అభ్యంతరం తెలిపారు. ప్రతి పైలునూ సభముందుంచాలని తాము కోరడం లేదని వారన్నారు.

ఆ రిపోర్టును సభముందుంచవలసిన అవసరం లేదని శ్రీ కోన ప్రభాకరరావు, శ్రీ నారాయణరెడ్డి అన్నారు.

ఆ రిపోర్టును సభ ముందుంచడానికి అవకాశం కల్పిస్తూ శాసనసభ నిబంధనల్లో ఉన్న అంశాన్ని శ్రీ మందపాటి నాగిరెడ్డి పేర్కొన్నారు.

అన్నిటినీ స్వీకరించి పరిశీలనకై రిపోర్టును పంపవచ్చునని ముఖ్యమంత్రి అంగీకరించారు.

గత శాసనసభ సమావేశాల్లో ఇలాంటి సమస్యలపై ఏ విధంగా ప్రవర్తించారో పరిశీలించి రూలింగ్ ఇస్తానన్నారు. ఏమైనా మంత్రి ప్రకటనలోని ఆయా అంశాలను సభ ముందుంచుతానన్నారు.

జాంజిబార్ రాజుహత్య

దారెస్‌సలాం, ఏప్రిల్ 8

జాంజిబార్ రాజా షేక్ అబీద్ కరూమేను నిన్న కొందరు హత్యచేశారు.

ఈ సందర్భంగా అధికారంలో ఉన్న విప్లవమండలి, అగ్రనాయకులు ఒకరు గాయపడ్డారని టాంజానియా ప్రభుత్వం నేడిక్కడ ప్రకటించింది.

గత సాయంత్రం 6 గం. కరూమేను కాల్చి చంపారనీ, మరో ముగ్గురు తప్పించుకున్నారనీ టాంజానియా రేడియో ఒక ప్రత్యేక ప్రసారంలో తెలిపింది. ఇది కేవలం రాజకీయ హత్యకన్న జాంజిబార్ ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి పథకం ప్రకారం చేసిన యత్నంకాదని భావిస్తున్నట్లు ఎ. పి. వార్తా సంస్థ తెలుపుతుంది.

కేంద్ర అధికారంలో వున్న "ఆఫ్రో షిరాజీ పార్టీ" కేంద్ర కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో కరూమే ముచ్చటిస్తుండగా యీ హత్య జరిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శి థాబిత్ కొంబోకూడా గాయాలు తగలగా ఆస్పత్రిలో చేర్చారు.

తూర్పు ఆఫ్రికాలోని టాంజానియా రాజధాని దారెస్‌సలాం చేరువలో తూర్పు హిందూ మహాసముద్రంలోని చిన్న దీవి జాంజిబార్.

పశ్చిమబెంగాల్‌లో పారిశ్రామిక వాతావరణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

పశ్చిమ బెంగాల్‌లో పారిశ్రామిక అనుకూల వాతావరణం నెలకొంటున్న సూచనలు కొన్ని కనిపిస్తున్నాయని పారిశ్రామికాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ మొయినుల్‌హక్‌చౌదరి ఈరోజు రాజ్యసభలో చెప్పారు.

శ్రీ మహతా అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన పై విషయం తెలిపారు.

ఆ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకోసం పెట్టుకొన్న అనేక దరఖాస్తులను పరిశీలించడం పూర్తయిందనీ, ఏవో కొన్ని దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి అన్నారు.

శ్రీమతి గాంధిలేఖకు భుట్టో సమాధానం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

శిఖరాగ్రస్థాయిలో చర్చలు జరగాలనే భారత ప్రతిపాదనకు పాక్ అధ్యక్షులు భుట్టో సమాధానం రూపొందిస్తున్నారని విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

బహుశా ఈ సమాధానం భారత్ ప్రతిపాదనకు అనుకూలంగా వుండవచ్చునని యీ వర్గాలు చెప్పాయి.

ఎటువంటి ముందు షరతులు లేకుండా శిఖరాగ్రస్థాయి చర్చలు జరగాలని ప్రతిపాదిస్తూ ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ భుట్టోకు లేఖరాశారు. స్విస్ దౌత్య వర్గాలద్వారా శ్రీమతిగాంధీ లేఖ గత మంగళవారం భుట్టోకు అందింది.

పార్లమెంటరి గ్రూప్‌లకు భుట్టో ఆహ్వానం

రావల్పిండిలో సోమవారం, మంగళవారం ప్రాథమిక చర్చలు జరిపేందుకు రావలసిందిగా జాతీయ అసెంబ్లీలోని పార్లమెంటరి గ్రూప్ నాయకులను భుట్టో ఆహ్వానించారు.

అవసరమని భావిస్తే యీ నాయకులు తమ వెంట జాతీయ అసెంబ్లీకి ఎన్నికయిన ప్రతినిధిని వెంట తీసుకుని రావాలి.

ఇండిపెండెంట్ సభ్యులు కూడ గ్రూప్‌గా ఏర్పడి తమ ప్రతినిధిని పంపించాలని అధికార ప్రతినిధి చెప్పారు. అలా కానట్లయితే వారికి ప్రాతినిధ్యం వుండదని చెప్పారు.

ఇందిరా గాంధి ప్రకటనపై హర్షం

పాకిస్తాన్ దినపత్రిక "డి సన్" సంపాదక నిర్వాహక సభ్యుడు అహ్మద్ హసన్ ప్రత్యక్ష సంప్రదింపులు జరపాలన్న ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి ప్రకటన పట్ల హర్షం ప్రకటించారు.

అహ్మద్ హసన్ రాసిన వ్యాఖ్యానాన్ని యీ రోజు పాకిస్తాన్ రేడియో ప్రసారం చేసింది.

శ్రీ జైస్వాల్ రాజీనామా

యు. పి. కాంగ్రెస్ కార్యవర్గానికి

లక్నో, ఏప్రిల్ 8

ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ కార్యవర్గానికి ప్రముఖ కాంగ్రెస్ నాయకులు శ్రీ సాలిగ్రామ్ జైస్వాల్ రాజీనామా చేశారు. రాష్ట్రంలో పార్టీ నానాటికీ క్షీణిస్తున్న దృష్ట్యా రాజీనామా చేస్తున్నట్లు తెలియజేశారు.

రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గసమావేశంలో శ్రీ జైస్వాల్ రాజీనామా పత్రాన్ని గురించి చర్చించారు. శ్రీ జైస్వాల్ చెప్పిన కారణాలను కార్యవర్గ సభ్యులు అనేకమంది బలపరచినట్లు తెలుస్తున్నది.

ఫిరాయింపులపై తీవ్ర పరిశీలన

ముఖ్యమంత్రి వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 8

రాష్ట్ర శాసనసభనుంచి రాజ్యసభకు జరిగిన ద్వైవార్షిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీలో జరిగిన ఫిరాయింపులను గురించి తీవ్రంగా పరిశీలిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు నేడు చెప్పారు.

తమపార్టీ అభ్యర్థి శ్రీ సి. హెచ్. వెంకటరావు పార్టీ ఫిరాయింపులవల్లనే ఓడిపోయారని ఆయన యు. యన్. ఐ. విలేకరితో అన్నారు.

రాజ్యసభ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీలో ఫిరాయింపులు జరుగుతాయని వదంతులు బయలుదేరటంతో, అవసరమైన ఓట్లకన్నా ఎక్కువ కేటాయించడంతోపాటు అన్ని జాగ్రత్తలను కాంగ్రెస్ నాయకత్వం తీసుకుంది. అందువల్ల కాంగ్రెస్ అభ్యర్థు లందరూ ఉచితంగా గెలుపొందుతారని ముఖ్యమంత్రి భావించారు.

60 మంది కాంగ్రెసు సభ్యుల ఫిరాయింపు

హైదరాబాద్, ఏప్రిల్ 8

మొదటి లెక్కింపులోనే ఐదుగురు అభ్యర్థులను గెలిపించుకునేటంతటి బలం అనగా 219 సీట్లుండీ కూడా మొదటి లెక్కింపులో ఒకే ఒకరు ఎన్నికై, ఒకరు ఓడిపోవడం కాంగ్రెస్ శాసనసభా నూతన నాయకత్వానికి మోసపాటయింది.

గత సాయంత్రం జరిగిన శాసనసభాపార్టీ సమావేశంలో శ్రీ శంకరదయాళ్ శర్మ, పార్టీ నామినేట్ చేసిన వారికే ఓటు వేయాలని లేనిచో తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక చేసినప్పటికీ దాదాపు 60 మంది కాంగ్రెసు సభ్యులు ఆదేశాన్ని ధిక్కరించినట్టు వినిపిస్తోంది.

1970 లో రాజ్యసభకు జరిగిన ద్వైవార్షిక ఎన్నికల్లోకల్లా ఇటువంటి ఫిరాయింపులే జరిగి కాంగ్రెస్ ఒక సీటును కోల్పోయింది. అప్పుడు శ్రీ ఆదినారాయణరెడ్డి ఓడిపోయారు.

పరాజయాలపై దర్యాప్తు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి సంభవించిన పరాజయాలపై కాంగ్రెస్ అధిష్టానవర్గం దర్యాప్తు జరుపగలదని పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ యస్. డి. శర్మ నేడు తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ ఫిరాయింపులు జరిగాయన్నది స్పష్టమని ఆయన అన్నారు. అయితే మైసూర్‌లో సిండికేట్ నాయకులు శ్రీ వీరేంద్రపాటిల్ విజయానికి దారితీసిన పరిస్థితులను గురించి వివరాలు తెలియలేదని ఆయన అన్నారు.

బంగ్లాదేశ్ సైనిక శాఖల పునర్వ్యవస్థీకరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

బంగ్లాదేశ్ ప్రభుత్వం నేడు సంయుక్త సైనిక కమాండ్‌ను రద్దుచేసి దాని స్థానంలో త్రివిధ బలగాలను ఏర్పాటుచేసి ఒక్కొక్కదానికి ఛీఫ్‌ను నియమించింది.

మూడింటిని నియమించినట్లు, త్రివిధబలగాల అధిపతుల నియామకం తాత్కాలికమైనదేనని బంగ్లాదేశ్ రేడియో ప్రకటించింది.

సంయుక్త కమాండ్ స్థానానికి జనరల్ ఉస్మానీ రాజీనామా చేసిన అనంతరం ఈ పునర్వ్యవస్థీకరణ జరిగింది.

అసెంబ్లీ సభ్యుడుగా కొనసాగే నిమిత్తం జనరల్ ఉస్మానీ నిన్న తన పదవికి రాజీనామా చేశారు.

ఏ రాజకీయ పార్టీకి చెందిన సభ్యుడు గానీ, శాసనసభ్యుడుగానీ సాయుధ దళాల సభ్యుడుగా వుండకూడదన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈ మార్పులు జరిగాయి.

నూతనంగా నియమింపబడ్డవారు: కల్నల్ షఫీవుల్లా (సదాతిదళం), కమాండర్ నూరుల్‌హక్ (నావికాదళం) ఎయిర్ కమాండర్ ఎ. కె. ఖోండార్ (వైమానిక దళం)

యాహ్యా సాక్ష్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

14 రోజుల భారత - పాక్ యుద్ధం తర్వాత భుట్టోకు అధికారం అప్పగించిన జనరల్ యాహ్యాఖాన్ నేడు యుద్ధ విచారణ కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చారు.

తూర్పు పాక్ సైన్యం లొంగుబాటుపై ఒక కమిషన్ విచారణ జరుపుతున్నది. దీనికి హమీదుర్‌రహ్మాన్ నాయకత్వం వహిస్తున్నారు.

నేడు కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చిన 203 మందిలో యాహ్యాఖాన్ కూడా ఉన్నారని పాక్ రేడియో చెప్పింది. ఇంకా వీరిలో అబ్దుల్ హమీద్‌ఖాన్, ఎయిర్ మార్షల్ జహర్ చౌదరి, నేషనల్ అవామీ పార్టీ నాయకులు అబ్దుల్ వలీఖాన్ ఉన్నారు.

అవామీలీగ్ అధ్యక్షుడుగా ముజిబ్ ఎన్నిక

ఢాకా, ఏప్రిల్ 8

అవామీ లీగ్ అధ్యక్షులుగా షేక్ ముజిబుర్ రహ్మాన్ నేడిక్కడ తిరిగి ఎన్నికయ్యారు.

పార్టీ కౌన్సిల్ వచ్చే సమావేశంవరకూ ఆయన పదవిలో కొనసాగుతారు. కౌన్సిల్‌లో యీ విషయమై యిక్కడ ఒక తీర్మానం చేసింది.

నూతన పతాకం

పార్టీకి నూతన పతాకం ఏర్పరచాలని కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించారు.

నూతన పతాకం ఆకుపచ్చగా ఉంటుంది. దానిపై ఎరుపురంగు, ప్రజాస్వామ్యం, సోషలిజం, సెక్యులరిజం, జాతీయవాదాన్ని సూచించే నాలుగు నక్షత్రాలు ఉంటాయి.

రాజ్యసభలో కాంగ్రెస్‌కు పూర్తిమెజారిటీలభించనిస్థితి

కమ్యూనిస్టుపార్టీ బలం 11 కు పెరుగుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

వివిధ రాష్ట్రాలనుండి నేడు 39 రాజ్యసభ సీట్లకు జరిగిన ఎన్నికల్లో 30 సీట్లను కాంగ్రెస్ గెలుచుకున్నప్పటికీ కాంగ్రెస్‌కు రాజ్యసభలో పూర్తి మెజారిటీ లభించలేదు

కాంగ్రెస్‌పార్టీ ఊహించినట్లుగా ఆంధ్రప్రదేశ్, మైసూరు రాష్ట్రాలనుండి దానికి సీట్లు లభ్యంకాలేదు.

రాజ్యసభ మొత్తం సీట్లు 243, కాంగ్రెస్ 1969 లో చీలిక తరువాత దాని బలం 88 కి పడిపోయింది. మధ్యంతర ఎన్నికల తరువాత 101 కు పెరిగింది. ఏప్రిల్ 2 వ తేదీతో 72 మంది రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ముగిసింది.

ఈ ఎన్నికల ఫలితాల అనంతరం రాజ్యసభలో కాంగ్రెస్ బలం 116 కు చేరుకున్నది, అయితే పూర్తి మెజారిటీ లభించ లేదు.

కాంగ్రెసు గెలుచుకొన్న సీట్లు చాలావరకు సిండికేట్‌కు చెందినవి. సిండికేట్ బలం 26 నుండి 19 కి పడిపోయి ప్రధాన ప్రతిపక్షపార్టీ గుర్తింపును కూడా కోల్పోయింది.

72 రాజ్యసభ సీట్లకు మూడు దశలుగా అనగా మార్చి 31, ఏప్రిల్ 1, ఏప్రిల్ 8 వ తేదీన జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 49, సిండికేటుకు 4, జనసంఘ్‌కు 2, కమ్యూనిస్టు పార్టీకి 3, స్వతంత్రపార్టీకి 1, సోషలిస్టు పార్టీకి 1, డి. ఎం. కె. కు 6, ముస్లింలీగ్‌కు 1, రిపబ్లికన్‌పార్టీకి 1, ఉత్కళకాంగ్రెస్‌కు 1, మణిపూర్ పీపుల్స్‌పార్టీకి 1 బి. కె. డి. కి 2, ఇండిపెండెంట్లకు 2 సీట్లు లభించాయి.

రాష్ట్రపతి నలుగురిని నామినేట్ చేశారు.

హర్యానాలో కాంగ్రెస్ రెండు సీట్లను అస్సాంలో మూడు సీట్లను నిలబెట్టుకున్నది.

రాజస్థాన్‌లో జనసంఘ్ నుండి ఒకటి, మైసూరులో సిండికేట్ నుండి రెండు సీట్లను, పంజాబ్‌లో అకాలీదళ్ నుండి ఒకటి, గుజరాత్‌లో సిండికేట్, స్వతంత్రపార్టీ నుండి ఒక్కొక్కటి, మధ్యప్రదేశ్‌లో ఇండిపెండెంటు నుండి ఒక సీటు కైవసం చేసుకున్నది.

మైసూరు నుండి జీవిత భీమా సంస్థ మాజీ చైర్మన్ శ్రీ టి. ఎ. పాయ్ మొదటి లెక్కింపులోనే ఎన్నికైనారు. రాజస్థాన్ నుండి పి. సి. సి. అధ్యక్షురాలు శ్రీమతి లక్ష్మీకుమారి చుండావత్ మొదటి ప్రాధాన్యత ఓట్లు పొందటంలో రికార్డు సృష్టించారు. గుజరాత్ నుండి పోటీ చేసిన మహాత్మాగాంధీ మనుమరాలు శ్రీమతి సుమిత్రాబెన్ గాంధి కులకర్ణికి ఎక్కువ సంఖ్యలో ఓట్లు లభించాయి.

బీహార్

బీహార్ నుంచి 7 సీట్లకు 11 మంది పోటీ చేశారు. కాంగ్రెస్‌కు నాలుగు కమ్యూనిస్టుపార్టీకి ఒకటి, సిండికేట్‌కు ఒకటి, సోషలిస్టు పార్టీకి ఒక సీటు వచ్చాయి.

అస్సాం

అస్సాంనుండి కాంగ్రెస్ అభ్యర్థులు నలుగురు గెలుపొందారు.

మధ్య ప్రదేశ్

మధ్యప్రదేశ్ నుంచి నలుగురు కాంగ్రెసు అభ్యర్థులు. ఒకరు జనసంఘం అభ్యర్థి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ అభ్యర్థులు శ్రీయుతులు శంకరలాల్ తివారి, యస్. కె. భట్, విద్యావతి చతుర్వేది, మహేంద్ర బహదూర్ సింగ్. జనసంఘం అభ్యర్థి శ్రీ వీరేంద్ర కుమార్ మొదటి లెక్కింపులోనే ఎన్నికయ్యారు

హిమాచల ప్రదేశ్

హిమాచలప్రదేశ్ నుంచి కాంగ్రెసు అభ్యర్థి శ్రీ జగన్నాథ్ భరద్వాజ్ మొదటి లెక్కింపులో ఎన్నికయ్యారు

పోలవరం గ్రామంలో అగ్ని ప్రమాదం

బందరు, ఏప్రిల్ 9

బందరు తాలూకా పోలవరం గ్రామంలో నిన్న ఒంటిగంటకు హరిజనపల్లెలో అగ్ని ప్రమాదం సంభవించింది.

ప్రమాదంలో 28 ఇళ్ళు దగ్ధమయ్యాయి. దాదాపు 70వేలమేరకు ఆస్తినష్టం సంభవించి వుంటుందని అంచనా. వ్యవసాయ కార్మికులు ఇళ్ళలో లేని సమయంలో యీ సంఘటన జరిగింది. ధాన్యం, అవసరాలు సామాన్లు పూర్తిగా తగలబడిపోయాయి.

నిరాశ్రయులైన కుటుంబాలకు నిన్న శ్రీ కె. సుబ్బారావు భోజన ఏర్పాటు చేశారు. ఈ రోజు మధ్యాహ్నం చేనేత సహకార సంఘం భోజనం ఏర్పాటు చేసింది.

నిరాశ్రయులైన హరిజనులకు తక్షణమే ప్రభుత్వం సహాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫతేపూర్ సిక్రీ ఉక్కు ఫ్యాక్టరీయా?

చండీఘర్, ఏప్రిల్ 8

"ఫతేపూర్ సిక్రీ ఒక పెద్ద ఉక్కు ఫ్యాక్టరీ"

"డిగోల్ ఎవరు? ఇన్సపీ అధ్యక్షుడు"

పంజాబ్ పారిశ్రామిక శిక్షణా కేంద్రాలలో స్టెనోగ్రఫీ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టిన అభ్యర్థులు 'జనరల్ నాలెడ్జ్' పరీక్షలో వ్రాసిన జవాబుల్లోవి.

ఈ పరీక్షలు నిర్వహించిన పంజాబ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాష్ట్ర శాసనసభకు నేడు సమర్పించిన 1968-69 నివేదికలో పై సమాధానాలను ప్రస్తావించింది.

— మరికొన్ని మచ్చుతునకలు:

"కేరళ రాజధాని కోణార్క్" "మళయాళం గుజరాతీవారు మాట్లాడే భాష" "బడేగులామ్ అలీఖాన్ ప్రముఖ నటుడు"

అమెరికా చర్యలకు నిరసనగా ప్రదర్శనలు

కార్మికవర్గానికి ఎ.ఐ.టి.యు.సి. విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

ఉత్తర వియత్నాంపై అమెరికా జరుపుతున్న బాంబు దాడులకు వ్యతిరేకంగా కార్మికవర్గం, కార్మిక సంఘాలు తమ తమ వాణిని వినిపించాలని ఎ. ఐ. టి. యు. సి. నేడు పిలుపు యిచ్చింది.

వియత్నాం, లావోస్, కాంబోడియాలపై అమెరికా సామ్రాజ్యవాదులు కొనసాగిస్తున్న దురాక్రమణను ఎ. ఐ. టి. యు. సి. కార్యదర్శివర్గం ఒక ప్రకటనలో నేడు ఖండించింది.

వియత్నాం ప్రజలపై అమెరికా దురాక్రమణ దారులు జరుపుతున్న బాంబు దాడులను వెంటనే నిలుపు చేయాలనీ, సంపూర్ణ జరుగుతున్న ప్రాంతంనుండి దురాక్రమణ సైన్యాలన్నీ వెంటనే వైదొలగాలనీ, దక్షిణ వియత్నాం తాత్కాలిక విప్లవ ప్రభుత్వం చేసిన ప్రతిపాదన ప్రకారం పరిష్కారం కుదుర్చుకోవాలనీ, కార్మికవర్గం తక్షణమే ప్రదర్శనలు, నిరసన సభలు ఊరేగింపులద్వారా డిమాండు చేయాలని కార్యదర్శివర్గం విజ్ఞప్తి చేసింది.

మూడేళ్ళ పసికందును బలియిచ్చిన దుర్ఘటన

పంజాబ్ ముఖ్యమంత్రి వివరణ

చండీఘర్, ఏప్రిల్ 8

గురుదాస్‌పూర్ జిల్లా దీనానగర్ గ్రామంలో ఇటీవల ఒక తండ్రి తన మూడేళ్ళ కొడుకును "దేవతకు" బలియిచ్చిన దుర్ఘటనపై పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ జైల్‌సింగ్ నేడు శాసనసభలో ఈ క్రిందివిధంగా వివరించారు:

బలి ఇవ్వబడిన పసివాడి తండ్రి ప్రకాశ్. అతని సోదరుడు పరశురామ్ ఇద్దరు కలిసి వారింటిపై చిన్నదేవళం కట్టుకుని అందులో శ్రీకృష్ణుని విగ్రహాన్ని పెట్టి "కీర్తన" ప్రారంభించారు. ఇది మార్చినెల 20 వ తేదీన ప్రారంభించారు.

అలా కీర్తన చేస్తున్న సమయంలో దేవతకు తానే బలి అవుతానని పరశురామ్ తన సోదరుడు ప్రకాశ్‌తో అన్నాడు. అయితే మళ్ళీ ఏం జరిగిందో ఏమో ఏప్రిల్ 2 వ తేదీన కీర్తన చేస్తున్న సందర్భంలో పరశురామ్ బుద్ధి మార్చుకుని అన్నకొడుకును బలి ఇవ్వవలసిందిగా అన్నను కోరాడు. అప్పుడు బలియిస్తే తిరిగి తాను బ్రతికిస్తానని కూడా చెప్పాడు. ఆ తర్వాత పరశురామ్ చేత కొడవలి ధరించి తన అన్న కొడుకుని విగ్రహం వద్దకు పట్టుకొచ్చాడు. కుర్రవాడు అక్కడికి రాగానే ప్రకాశ్ (అంటే కుర్రవాని తండ్రి) వాని తల పట్టుకున్నాడు. అతని చెల్లెండ్రు కౌసల్య, మాయ వాని కాళ్ళు గట్టిగా పట్టుకున్నారు.

వారు పట్టుకుంటూనే పరశురామ్ చేతనున్న కొడవలితో దారుణంగా వాని తల నరికాడు. తల ఎగిరిపడింది. ఆ కిరాతకుడు అంతటితో పూజకోసం శవాన్ని ముక్కలుగా నరకవలసిందిగా తన అన్నను, అంటే కుర్రవాని తండ్రిని కోరాడు.

ఇంతలో యీ దుర్ఘటన చూసిన ఒక వ్యక్తి పోలీసు స్టేషన్‌కెళ్ళి రిపోర్టిచ్చాడు. పోలీసులు హుటాహుటిని వచ్చి మొత్తం నలుగురిని అక్కడే అరెస్టు చేశారు.

ఈ సందర్భంగా మరో నలుగురినికూడా అరెస్టు చేశారని ప్రస్తుతం దర్యాప్తు సాగుతున్నదని ముఖ్యమంత్రి తెలిపారు.

గోర్షకొవ్ శ్రీనగర్ రాక

శ్రీనగర్, ఏప్రిల్ 8

కాశ్మీర్‌లో రెండు రోజులపాటు అనధికార పర్యటన జరిపేనిమిత్తం సోవియట్ నౌకాదళాధిపతి అడ్మిరల్ గోర్షకోవ్ నేడిక్కడికి వచ్చారు. సోమవారంనాడు ఆయన తిరిగి ఢిల్లీ వెళతారు.

ప్రేలిపోయిన బ్రిటిష్ సైనిక విమానం

నియోనా (ఇటలీ), ఏప్రిల్ 8

నియోనా వద్ద నిన్న ఇటలీ వైమానికదళ స్థావరంనుండి గత శనివారం ఒక బ్రిటిష్ రాయల్ ఎయిర్ ఫోర్స్ విమానం బయల్దేరిన వెంటనే పేలిపోయింది.

ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. నలుగురి జాడ తెలియరాలేదు. 15 మంది సురక్షితంగా ఉన్నారు.

బియ్యం కుంభకోణంపై న్యాయవిచారణకు తిరస్కృతి

శాసనమండలిలో పౌర సరఫరాల మంత్రి శ్రీ సుబ్బారాయుడు ప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 8

బియ్యం రవాణా కుంభకోణంపై న్యాయ విచారణ జరిపించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను నేడు రాష్ట్ర శాసన మండలిలో పౌర సరఫరాల మంత్రి శ్రీ తల్లా సుబ్బారాయుడు తిరస్కరించారు.

ఈ అంశంపై జరిగిన స్వల్ప చర్చకు సమాధానమిస్తూ బియ్యం ఎగుమతులపై లైసెన్సులు ఇవ్వటంలో అవకతవకలు జరిగినట్లు ప్రభుత్వ దృష్టికి రాలేదని అందువల్ల న్యాయవిచారణ జరిపించవలసిన అవసరం లేదని మంత్రి అన్నారు. ఈ అవకతవకలు జరగటానికి సంబంధించి నిర్దిష్ట సంఘటనలను ప్రభుత్వ దృష్టికి తెచ్చినట్లయితే, అందుకు బాధ్యులైన వారిపై ప్రభుత్వం చర్యతీసుకుంటుందని మంత్రి అన్నారు.

ఆదర్శ వివాహం

హైదరాబాద్, ఏప్రిల్ 8

గోపరాజు నాగేశ్వరరావు, కుమారి పద్మావతిల ఆదర్శ వివాహం ఏప్రిల్ 7 వ తేదీన హైదరాబాద్ విద్యార్థి సమాఖ్య కార్యాలయంలో జరిగింది. వివాహాన్ని హైదరాబాద్ విద్యార్థి, యువజన సమాఖ్యలు జరిపించాయి

శాసనసభలో ప్రతిపక్ష నాయకులు శ్రీ వేముపల్లి శ్రీకృష్ణ యీ సందర్భంగా మాట్లాడుతూ ధైర్యంతో ఆదర్శ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్న వధూవరులను అభినందించారు, యువకులు ఇటువంటి వివాహాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశంలో నూతన సమాజాన్ని నిర్మించవలసిందిగా యువకులకు ఆయన విజ్ఞప్తి చేశారు

రాష్ట్ర యువజన సమాఖ్య అధ్యక్షులు శ్రీ నల్లూరి వెంకటేశ్వర్లు నూతన దంపతులను అభినందిస్తూ వర్ణాంతర వివాహాలను యువజన సమాఖ్య ఎప్పుడూ ప్రోత్సహిస్తుందని చెప్పారు. సమాజంలోని కులమత ప్రాతిపదికలపై వుండే దోపిడీని ఆయన విమర్శించారు. కులరహిత సమాజాన్ని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించక పోవటాన్ని విమర్శించారు.

ఆంధ్రప్రదేశ్ విద్యార్థి సమాఖ్య అధ్యక్షులు శ్రీ అజీజ్‌పాషా, సిటీ కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి పి. నాగేశ్వరరావు, మహిళా సంఘం నాయకురాలు శ్రీమతి సుబ్బమ్మ, రాష్ట్ర ఇస్కస్ ప్రధాన కార్యదర్శి రాంభట్ల కృష్ణమూర్తి, ఇంకా అనేకమంది నాయకులు వధూవరులను ఆశీర్వదించారు.

అభ్యుదయ రచయిత శ్రీ ఏటుకూరి ప్రసాద్ వివాహానికి అధ్యక్షత్వం వహించారు

వియత్నాం పోరాటం

(1వ పేజీ తరువాయి)

అమెరికా విధానంలో ఏటిమార్పు లేదనిఆయన స్పష్టీకరించారు

రహస్యంగా వియత్నాంచేరిన అమెరికా యుద్ధ నౌకలు

దానాంగ్, ఏప్రిల్ 8

రెండు స్క్వాడ్రన్ల ఫాంటమ్ యుద్ధ విమానాలతో అమెరికా నౌకలు రహస్యంగా వియత్నాం చేరుకున్నాయి.

జపాన్‌లోని ఇవాకినుండి ఈ నౌకలు బయల్దేరాయి. వీటిలో యుద్ధ సామగ్రికూడా వుంది, నేటికి ఇవి పత్రికల వైమానిక కార్యాలయం ఉన్న దానాంగ్ నగరంవద్ద ఒక రహస్యమైన విమాన స్థావరానికి ఆ నౌకలు అమెరికా విమానాలను చేరవేయడంతో ఈ విషయం వెల్లడయింది.

బాంబుదాడుల్ని ఐరాస ఖండించాలి

పారిస్, ఏప్రిల్ 8

వియత్నాంలో అమెరికా బాంబు దాడులను, ఐక్యరాజ్య సమితి ఖండించాలని దక్షిణ వియత్నాం జాతీయ విముక్తి సంఘటన నేడిక్కడ విజ్ఞప్తి చేసింది.

సస్పెన్షన్

(1వ పేజీ తరువాయి)

ఒకరు ఓడిపోవటానికి విద్రోహం తలపెట్టటం" అని చెప్పారు.

మహమ్మద్ ఇస్మాయిల్ పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రయోజనం దృష్ట్యా యీ చర్య తీసుకొన్నానన్నారు. కాంగ్రెసు వాదులలో క్రమశిక్షణను కాపాడేందుకు. కాంగ్రెసు అధిష్టానవర్గం ఆదేశాల ప్రకారమే యీ చర్య తీసుకొన్నానని చెప్పారు.

నిన్న జరిగిన రాజ్యసభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు జరిగిన పరాజయం అనంతరం పత్రికా విలేకరులతో మాట్లాడటానికే సిగ్గుపడుతున్నానని ఆయన అన్నారు. మునుపటి గ్రూప్‌నాయకులకుదీనితో సంబంధంవుందనీ, ఆ విషయం అందరికీ తెలుసునని ఆయన పేర్కొన్నారు.

పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటు చేసినవారిని కనుక్కొని వారిపై అవసర మయిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ పరిణామం పార్టీని క్షీణం చేస్తుందని చెప్పారు.

ఎ. పి. సి. సి. కార్యదర్శి ఎ. చక్రపాణి కూడ పత్రికా గోష్ఠిలో పాల్గొన్నారు. ఇస్మాయిల్ పత్రిక ప్రకటనలో యీ క్రింది విధంగా వున్నది.

"నిన్న ప్రకటించిన రాజ్యసభ ఎన్నికల ప్రకారం కాంగ్రెసు శాసన సభ్యులలో పెద్ద ఎత్తున ఫిరాయింపులుజరిగాయన్నది స్పష్టం. ప్రతి కాంగ్రెసు అభ్యర్థికి 48 శాసనసభ్యుల ఓట్లను కేటాయించటం జరిగింది. యిదికాక మిగులు ఓట్లు కూడా వున్నాయి. సాధారణంగా ఐదుగురు అభ్యర్థులు మొదట లెక్కింపులో గెలవవలసింది.

అయితే దురదృష్టవశాత్తు ఎ.ఐ.సి.సి. ప్రధాన కార్యదర్శి డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ ద్వారా అధిష్టానవర్గం సలహా ఇచ్చినప్పటికి, ప్రజలు కాంగ్రెసుకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ, అభివృద్ధి నిరోధకులైన, అసంతృప్తి చెందిన కొంతమంది వ్యక్తుల ప్రోత్సాహంతో కాంగ్రెసు శాసనసభ్యులుపార్టీ క్రమశిక్షణను విప్ ఆదేశాన్ని బుద్ధి పూర్వకంగానే ఉల్లంఘించారు. కాంగ్రెసు అభ్యర్థులలో ఒకరిని ఓడించేందుకు విద్రోహం తలపెట్టారు.

రాష్ట్ర శాసనసభ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పైన చెప్పిన కాంగ్రెసు వాదులపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పటికీ వారిపైన తీవ్రచర్య తీసుకోలేదు. 1972 ఫిబ్రవరి 24వ తేదీన ప్రదేశ్ ఎన్నికల సంఘం ఆమోదించిన ఐక్యతీర్మానం ప్రకారం తమ తప్పులను వారే సరిదిద్దుకునే అవకాశం యిచ్చేందుకే చర్య తీసుకోలేదు. ఇప్పుడు వారిపార్టీ వ్యతిరేకకార్యకలాపాలు పార్టీ ప్రతిష్ఠ, గౌరవం దెబ్బతిన్నాయి. అందువల్ల వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవటం అనివార్యమయింది.

పార్టీ విజ్ఞాన సమస్యలు పరిశీలించేందుకు యీ నెల 19 వ తేదీన పి. సి. సి. కార్యవర్గ సమావేశ మవుతుందని ఇస్మాయిల్ ప్రకటించారు.

శాసనసభ ఎన్నికలలో విద్రోహం చేసినట్లు ప్రస్తుత మంత్రులపై వచ్చిన ఆరోపణలు కూడా పరిశీలించటం జరుగుతుందని ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ శ్రీ ఇస్మాయిల్ అన్నారు

దక్షిణవియత్నాంలో మరో 3 స్థావరాలు విముక్తి సేనల వశం

మెకాంగ్ డెల్టాలో పోరాట ఉధృతి

హాంగ్‌కాంగ్, ఏప్రిల్ 8

దక్షిణ వియత్నాంలో మూడు కీలుబొమ్మ సైనిక స్థావరాలు వశమయ్యాయనీ, పెద్ద సంఖ్యలో టాంకులు, ఆయుధాలు, మందుగుండు విముక్తి యోధులు స్వాధీనం చేసుకున్నారని జాతీయ విముక్తి సంఘటన నేడు ప్రకటించింది.

సైగాన్‌కు వాయవ్యంగా కేవలం 55 మైళ్ళ దూరంలో నల్లకన్యపర్వతం (న్యూ బాదీన్) వద్దఉన్న అమెరికా సైనిక స్థావరంపై 150 మోర్టార్ కాల్పులు జరిపారు.

3,235 అడుగుల ఎత్తుగల ఈ పర్వతంపై ఉన్న అమెరికా సైనిక రేడియో కేంద్రం కాల్పులకు గురిఅయింది.

మికాంగ్ డెల్టా ప్రాంతంపై విముక్తి యోధుల దాడులు నేడు రెండింతలయ్యాయని ఎ. పి. వార్తాసంస్థ తెలిపింది

ఇలా వుండగా ఇండోచైనాపై బాంబు దాడులు పెంచేందుకు మరిన్ని విమానాలు, నౌకలను అమెరికా ప్రభుత్వం పంపింది.

హైవే 13 పై ఒక కీలుబొమ్మ రెజిమెంట్‌ను, రెండు ఫిరంగి బెటాలియన్లను విముక్తి యోధులు ముట్టడి పెట్టారు.

అక్కడ కీలుబొమ్మ 5 వ సేన దళం విముక్తి యోధులకు లొంగిపోయింది.

పటాలం పరారి

హోవాలాయవద్ద విముక్తియోధుల ధాటికి తట్టుకోలేక కీలుబొమ్మ సేన 74 వ బెటాలియన్, మరొక దళం దగ్గరలోని అడవుల్లోకి పారిపోయాయి. అక్కడ పెద్దఎత్తున ఆయుధాలు దొరికాయి.

క్వాన్‌లాయ్ వైమానిక కేంద్రం విముక్తి సేనల వశమయింది.

సైగాన్ చేరువలోని లాక్‌నిన్‌లో సంపతిత పడిన విముక్తి సేనలు పురోగమిస్తున్నాయి. అందువల్ల ఆ ప్రాంతంపై అమెరికా విమానాలు బాంబుదాడి చేస్తున్నాయి,

లాక్‌నిన్ దగ్గరలో ఉన్న అన్‌లాక్‌పై విముక్తి యోధుల దాడి ప్రారంభం కావడంతో రాజధాని సైగాన్‌కు "ప్రత్యక్ష ప్రమాదం" వచ్చిందని యు. పి. ఐ. విలేకరి రాస్తున్నారు.

సెంట్రల్ హైలాండ్స్‌లో గత అనేక సంవత్సరాలుగా ఇంతటి భీకర పోరాటం సాగలేదని ఆ విలేకరి తెలిపారు.

కీలుబొమ్మ సైనికులు వేల సంఖ్యలో హతమయిన విషయాన్ని సైగాన్ అధికార్లు ఒప్పుకోవడంలేదు, దానిసుండి "జాడ తెలియరావడంలేదు"ని మాత్రం అంటున్నారు.

సైగాన్‌లో కర్ఫ్యూ పొడిగింపు

సైగాన్, ఏప్రిల్ 8

దక్షిణ వియత్నాం రాజధాని సైగాన్‌లో కర్ఫ్యూ గత రాత్రి తిరిగి పొడిగించారు.

దీనితో 30 లక్షల మంది నగరవాసులు తమ ఇళ్ళల్లోనే వుండిపోవలసి వచ్చింది. ప్రతి వీధిలోనూ పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. ఒకచోట బాంబు పెట్టబడినట్లు కూడా వార్తలు రావడంతో ముందు జాగ్రత్త చర్యలు అధికంగా తీసుకున్నారు.

అమెరికా అణ్వాయుధాలు ప్రయోగించబోదు

వాషింగ్టన్, ఏప్రిల్ 8

వియత్నాంలో పరిస్థితి ఎంతవిషమంగా ఉన్నప్పటికీ అణ్వాయుధాలు ప్రయోగించబోమని వైట్‌హౌస్ ప్రతినిధి రోనాల్డ్ జిగ్లర్ చెప్పారు.

అణ్వాయుధ ప్రయోగానికి అమెరికా పథకం వేస్తున్నదని ఇటీవల ప్రముఖ జర్నలిస్టు జాక్ ఆండర్సన్ వెల్లడించిన దృష్ట్యా జిగ్లర్ ఈ ప్రకటన చేశారు

రాజ్యసభలో పార్టీలవారీ బలం

పార్టీ	సీట్లు
కాంగ్రెస్	116
సిండికేట్	20
జనసంఘ్	15
డి. యం. కె.	12
కమ్యూనిస్టు	11
స్వతంత్ర	9
సోషలిస్టు	8
మార్క్సిస్టు	7
ముస్లింలీగ్	5
బి. కె. డి.	5
అకాలీ	2
రిపబ్లికన్ పార్టీ	1
ఇతరులు	28
ఖాళీ స్థానాలు	4
మొత్తం	243

భువనగిరి తాలూకాలో వేలాది వ్యవసాయ కార్మికుల వలసలు; ఆకలిచావుల ప్రమాదం

ఇలాంటి కఠోర కరువుపరిస్థితిలో శిస్తుల, అప్పుల నిర్బంధ వసూళ్ళు క్షంతవ్యం కాదని తాలూకా కమ్యూనిస్టుసమితికార్యవర్గం ఖండన

భువనగిరి, ఏప్రిల్ 8

నల్గొండజిల్లా, భువనగిరి తాలూకాలో ఈసంవత్సరం మరింత దారుణంగా కరువు పరిస్థితి ఏర్పడి వ్యవసాయ కార్మికులు పనులులేక గ్రామాలువదలి గత మూడు మాసాల నుండి వేలసంఖ్యలో నిజామాబాద్, కృష్ణాజిల్లాలకు వలసపోయారు. మిగిలినవారు కూడా పస్తులతో కాలం గడుపుతున్నారు. ఆకలిచావులు సంభవించే ప్రమాదం ఏర్పడింది. పేద, మధ్యతరగతి రైతులుకూడా యీ పరిస్థితికి తట్టుకోలేక తల్లడిల్లుతూ, కొందరు వలస పోతున్నారు. ఇలాంటి కఠోర పరిస్థితులను ప్రభుత్వం గమనించకుండా విచక్షణా రహితంగా వివిధ రకాల శిస్తు బకాయీల నిర్బంధ వసూళ్ళకు పూనుకోవడం క్షంతవ్యంకాదని తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గం ఒక తీర్మానంలో ఖండించింది.

వెంటనే అన్నదానం చేస్తూ, అప్పుల వసూళ్ళు వాయిదావేసి, తక్షణ చర్య గైకొనాల్సిందిగా కార్యవర్గం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

భువనగిరి తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం శ్రీ కాచమ వీరారెడ్డి అధ్యక్షతన భువనగిరి పార్టీ కార్యాలయంలో జరిగింది.

సమావేశ ప్రారంభంలో శ్రీ తంగాని వెంకటరత్నం హత్యను గర్హిస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ తీర్మానించారు, సీనియర్ సభ్యులు శ్రీ [illegible] ఖాన్, పార్టీ సభ్యుడు శ్రీ దుంపల రాజిరెడ్డి మృతికి గాఢ సంతాపం తెలియజేశారు.

ఈ సంవత్సరానికి పార్టీ సభ్యత్వం వెంటనే చేర్పించేందుకు కార్యవర్గ సభ్యులు కోటాలు తీసుకున్నారు.

తర్వాత తాలూకాలో ఏర్పడిన కరువు పరిస్థితిపై ఆమోదించిన తీర్మానంలో యిలా వుంది.

భువనగిరి తాలూకా గత 5 సంవత్సరాల నుండి కరువు బారిన పడుతున్నది. ఈ సంవత్సరం కరువు పరిస్థితి మరింత దారుణంగా ఏర్పడింది. వర్షాలు లేక చెరువు కుంటలకు నీరురాకపోవడంతో పైరులు, రబీపైరులు పూర్తిగా దెబ్బతిన్నాయి. అభివృద్ధి కాలంలో బావులకింద ఎకరం, అర ఎకరం సేద్యం చేసినవాళ్లు తర్వాత కొన్ని పైర్లు పొట్టలకు వచ్చిన తరువాత కొన్ని పైర్లు పాలుకాగిన తరువాత నీరులేక ఎండిపోయాయి. గత ఆగస్టులో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి వచ్చిన సందర్భంలో 3 వేల మందితో ఆకలియాత్ర జరిపి మెమోరాండం సమర్పించగా పునాస శిస్తులు వాయిదావేస్తూ అన్ని గ్రామాలకు ఫెయిర్ డిపో ద్వారా కొద్ది మోతాదులో బియ్యం సప్లై చేయుటకు అంగీకరించింది. రెండు మాసాల క్రితం పనికి పనిసప్లై చేశారు. గ్రామాలలో కొన్ని కరువు పనులు కూడా కల్పించారు. కానీ తాలూకాలో కరువు పరిస్థితులున్నాయనే విషయాన్ని అంగీకరించి పునాసశిస్తువసూళ్ళు వాయిదా వేసినప్రభుత్వం ఇప్పుడు రబీ తాబీ శిస్తులవసూళ్ళకు పూనుకోవడం అర్థరహితంగా వుంది. రబీ పైరు ఏమాత్రం పండలేదనే విషయం తెలిసికూడా నిర్బంధ వసూళ్ళకు పూనుకోవడం క్షంతవ్యం కాదు. రబీ శిస్తుతో 1965 కు పూర్వం వున్న రెవిన్యూ బకాయీలు, తక్కావి బకాయీలు, 1971 నాటి బకాయీలు కూడా వసూలు చేయుటకు ప్రజలను తీవ్ర నిర్బంధాలకు గురి చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో అప్పులు చెల్లించాలని బెదిరిస్తున్నారు. దారుణ నిర్బంధాల ద్వారా పన్నుల వసూళ్ళకు రెవిన్యూ అధికారులు పూనుకొనడమేగాక, సహకార సంఘాల అప్పులు, భూమితనఖా బ్యాంకుల అప్పులు, ఎంతో ఖరీదైన మోటారులు యిచ్చిన అప్పులు కూడా చెల్లించమని ఒత్తిడి చేస్తున్నారు.

కనుక తాలూకాలో ఏర్పడిన కఠోర కరువు పరిస్థితులను గమనించి వెంటనే అన్ని రకాల శిస్తులు, అప్పుల వసూళ్ళు వాయిదా వేసి తక్షణమే గ్రామాలలో పశువుల మేతను యితర ప్రాంతాల నుండి తెప్పించి ఉచితంగా అర్హులైనవారికి సప్లయి చేయాలి. గ్రామ గ్రామాన గంజి కేంద్రాలు నెలకొల్పి పేదవాళ్ళకు ఆహారం సప్లయి చేయాలి. ఆహారధాన్యాల ధరలను అదుపులోవుంచుటకై ఆహార ధాన్యం టోకు వ్యాపారాన్ని ప్రభుత్వం నిర్వహించుటకు ఆహార ధాన్యం వ్యాపారాన్ని జాతీయం చేయాలని, గత రెండు మాసాల జొన్నలు, గోధుమల కోటా, యిప్పుడిస్తున్న దానికి రెట్టింపు బియ్యం సప్లై చేయాలని, తాలూకాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది.

అమలాపురంలో ప్రశాంత పరిస్థితి

అమలాపురం, ఏప్రిల్ 7

అమలాపురంలోనూ, ఆ పరిసర ప్రాంతాలలోనూ మామూలు పరిస్థితి నెలకొల్పేందుకు శాంతి కమిటీ, పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారు.

అమలాపురంలోని వివిధ ప్రాంతాలలోనూ, బత్తినపల్లి, వీనసపల్లి, రాయిగూడెం, చెయ్యేరు, గంగలకుర్రు, అగ్రహారం, ముక్కామల, వక్కలంక గ్రామాలలో వీరు పర్యటనలు జరిపి మామూలు పరిస్థితిని నెలకొల్పేందుకు సహకరించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కాపు, షెడ్యూలు కులాల ప్రతినిధుల సమావేశాలు విడి విడిగా జరిగాయి. శాంతిని నెలకొల్పవలసిందిగా ఈ సమావేశాలలో నాయకులు విజ్ఞప్తి చేశారు.

నిన్న ఎటువంటి సంఘటనలు జరుగలేదు. పరిస్థితి ప్రశాంతంగా వుంది. అమలాపురంకు పాల సరఫరా తిరిగి ప్రారంభమైంది.

ఏనుగుపాలెంతగాదా కేసులో పోలీసుల నిర్లక్ష్య వైఖరి

వినుకొండ, ఏప్రిల్ 3

గుంటూరుజిల్లా, వినుకొండ తాలూకా ఏనుగుపాలెం గ్రామంలో నెలరోజుల క్రితం రెండు పార్టీల మధ్య జరిగిన తగాదాలో కమ్యూనిస్టుపార్టీ వారికి బలమైన గాయాలు తగిలాయి.

గుంటూరు జనరల్ ఆసుపత్రిలో చేర్చిన తరువాత కొంతకాలానికి డిశ్చార్జి చేయబడ్డారు. మెడికల్ రిపోర్టు యింకా రాలేదనే నెపంతో వినుకొండ పోలీసులు యింతవరకు ఎలాంటి చర్యతీసుకోలేదు. కనుక వెంటనే మెడికల్ రిపోర్టు తెప్పించుకొని పోలీసులు తగు చర్య తీసుకోవాల్సిన అవశ్యకత వుంది.

మీటర్ గేజ్ ను బ్రాడ్ గేజ్ గా మార్పుకు పరిశీలన

రైల్వే అధికారుల రాక

హైదరాబాద్, ఏప్రిల్ 7

సికింద్రాబాద్, బెంగుళూరు మీటర్ గేజ్ రైల్వే లైన్ ను బ్రాడ్ గేజ్ గా మార్చే అవకాశాల్ని పరిశీలించేందుకు వున్నత రైల్వే అధికారులు ఏప్రిల్ 11, 12 తేదీలలో ఇక్కడ రానున్నారు.

ఉప ముఖ్యమంత్రి శ్రీ బి. వి. సుబ్బారెడ్డి నేడు శాసన మండలిలో పై విషయం తెలిపారు.

గుంతకల్లు-హైదరాబాద్ మీటర్ గేజ్ రైల్వే మార్గాన్ని బ్రాడ్ గేజ్ గా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫారస్ చేసినట్లు ఆయన చెప్పారు.

ఈ సమస్య ప్రస్తుతం రైల్వేబోర్డు పరిశీలనలో వున్నదన్నారు.

విజయవాడ-మద్రాసు రైల్వే లైన్ విద్యుదీకరణ కేంద్ర కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు నిర్ణయించి, ఆమేరకు వుత్తర్వులు జారీచేసిందని శ్రీ బి. వి. సుబ్బారెడ్డి తెలిపారు.

విజ. - కాజీపేట రైల్వే మార్గాన్ని కూడా విద్యుదీకరణ చేయవలసిందిగా రాష్ట్రం కేంద్రాన్ని కోరింది.

కాజీపేటలో వర్క్ షాపు

కాజీపేటలో డీజిల్ (రైల్వే ఇంజన్ల) వర్క్ షాపును రైల్వేశాఖ నెలకొల్పిందని ఉపముఖ్య మంత్రి తెలిపారు.

1971 అక్టోబరులో వర్క్ షాపు నిర్మాణం ప్రారంభమైందని ఆయన తెలిపారు.

వర్క్ షాపు నిర్మాణానికి మొత్తం రూ. 134 లక్షలు ఖర్చు అవుతుంది.

మెట్ట ప్రాంతాల అభివృద్ధి బోర్డు

కోస్తా జిల్లాలో మెట్టప్రాంతాలకై అభివృద్ధి బోర్డును ఏర్పాటుచేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.

ఉప ముఖ్యమంత్రి శ్రీ సుబ్బారెడ్డి నేడు శాసనమండలిలో పై విషయం తెలిపారు.

1971-72 లో కోస్తా జిల్లాల్లో మెట్ట ప్రాంతాల అభివృద్ధికి రూ. 2 కోట్లు ఖర్చు పెట్టారన్నారు.

21 శతాబాల నాటి బంగారు నాణాలు

కొత్తగూడెం, ఏప్రిల్ 7

బుద్ధుని బొమ్మ గల 23 బంగారు నాణాలు యిక్కడికి సమీపంలో వున్న ఊరికి లింగన్నపేట వద్ద బయటపడినాయి. రోడ్డు నిర్మాణానికై త్రవ్వకం జరుగుతుండగా యివి బయటపడినాయి. ఒక్కొక్కటి 8½ గ్రాముల బరువు వున్నాయి. ఇవి 21 శతాబ్దాలనాటివని కూడా భావించబడుతున్నది.

తవుడు బియ్యం కొరత

తిరుపతిలో

తిరుపతి, ఏప్రిల్ 8

రాష్ట్రం మొత్తం మీద వచ్చిన విద్యుత్ కొరత వలన తిరుపతిలో బియ్యపు మిల్లులు తక్కువ గంటలు పని చేస్తున్నాయి.

ఈ కారణంగా తవుడు, బియ్యం సరఫరాకు కొంత అంతరాయం కలుగుతున్నది. తిరుపతి చుట్టుపట్లవుండే ధాన్యం వుప్పుడు బియ్యానికే వుపకరిస్తాయి.

మిల్లులు పనిచేసే గంటలు తగ్గిన కారణంగా పశువుల అవసరాలకు తగినంత తవుడు, బయటకు రావడంలేదు.

కొన్ని వేల పాడి పశువులున్న యీ పట్టణంలో తవుడు కొరత వలన పశువుల యజమానులు యిబ్బంది పడుతున్నారు.

విజయవాడ ముఠా కార్మికసంఘం 8 వ మహాసభ

విజయవాడ, ఏప్రిల్ 9

ముఠా కార్మికుల పని హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని ప్రభుత్వాన్ని కోరుతూ విజయవాడ ముఠా కార్మికసంఘం 8 వ మహాసభ తీర్మానించింది.

విజయవాడ ముఠా కార్మికసంఘం, 8 వ మహాసభ ఇటీవల లెనిన్ భవనంలో జరిగింది. సభా ప్రారంభంలో తంగాని వెంకటరత్నం, దత్తి కనకారావులకు సభ జోహార్లు తెలిపింది.

వీరిని హత్యచేసిన నేరస్తులను కఠినంగా శిక్షించాలని సభ ప్రభుత్వాన్ని కోరింది.

తర్వాత కార్యదర్శి శ్రీ పడాల దాలప్ప ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదిక, జమా ఖర్చులను సభ ఆమోదించింది.

ముఠా కార్మికులకు వారాంతపు శెలవులు, బోనస్, ప్రావిడెంటు ఫండు సౌకర్యాలను వర్తింపజేయాలని, సభ తీర్మానించింది.

పాత ప్రాజెక్టు అధికారులు 1958లో లేబర్ కమిషనరు సమక్షంలో చేసుకున్న ఒప్పందం మేరకు, లారీ ముఠా కార్మికులకు ప్రాజెక్టు లోడింగు, అన్ లోడింగు పని చేయుటకు అనుమతించాలని, 1956 జనరల్ ఒప్పందం గౌరవించాలని ప్రాజెక్టుఅధికారులను, ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

కార్యవర్గం

శ్రీ యలిపిల్లి సోములు అధ్యక్షులుగా, శ్రీ ఉప్పలపాటి వెంకటసుబ్బరాజు ఉపాధ్యక్షులుగా శ్రీ ఉప్పలపాటి రామచంద్రరాజు కార్యదర్శిగా, శ్రీ బొల్లి చిన్నయ్య సహాయ కార్యదర్శిగా, శ్రీమంతల వెంకటదుర్గారావు కోశాధికారిగా, శ్రీ పడాల దాలప్ప సహా 10 మంది సభ్యులుగా నూతన కార్యవర్గం ఎన్నికైనది.

కార్మికుల మధ్య ఘర్షణ

88 మందికి గాయాలు

బెంగుళూరు, ఏప్రిల్ 8

నేడు యిక్కడ న్యూగవర్నమెంటు ఎలక్ట్రిక్ ఫ్యాక్టరీలో రెండు కార్మిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 28 మంది పోలీసులతో సహా 88 మంది గాయపడ్డారు. కంపెనీకి చెందిన 11 కార్లు ధ్వంసమైపోయాయి.

ఈ రెండు వర్గాల కార్మికులు ఐ. యన్. టి. యు. సి. అనుబంధానికి చెందినవారు.

గత రాత్రి ఫ్యాక్టరీ ఆవరణలో చనిపోయిన కార్మికునికి రూ. 10 వేలు నష్టపరిహారం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. అయితే మేనేజిమెంట్ రూ. 2500 నష్టపరిహారం చెల్లించుటకు అంగీకరించింది. కార్మికుని శవయాత్రను సక్రమంగా నిర్వహించలేదని యూనియన్ ప్రెసిడెంటు (జనసంఘ్), దిగిపోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. దీనితో ఘర్షణలు ప్రారంభమయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సభలకు సినీనటుడు శ్రీ జగ్గయ్య ప్రారంభోత్సవం చేసినప్పటిదృశ్యం. మాట్లాడుతున్నవారు శ్రీ [illegible] శ్రీనివాసరావు ఎం.పి. శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావుకూడా యీ దృశ్యంలో వున్నారు.

ఫ్యాక్టరీల మూతవల్ల 16 వేల మందికి నిరుద్యోగం

పశ్చిమబెంగాల్లో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

ముడిపదార్థాల కొరతవల్లగాని లేదా ఆర్థిక యిబ్బందులవల్లగాని పశ్చిమ బెంగాల్లో ఫ్యాక్టరీలను మూసి వేసిన పరిణామంగా 1970-71 లో 16,651 మంది కార్మికులు ఉపాధిని కోల్పోయారు. ఇదే కారణంగా 1969-70 లో ఉపాధి కోల్పోయిన కార్మికుల సంఖ్య 13,389.

అయితే మైసూర్ లో ఉపాధి కోల్పోయిన కార్మికుల సంఖ్య 1961-70 లో 13,676 వుండగా 1970-71 లో వీరిసంఖ్య 416 కి తగ్గిపోయింది.

గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ లలో పై కారణం ఉపాధి కోల్పోయిన వారి సంఖ్య పెరిగింది.

మూతపడిన మిల్లుల స్వాధీనం

అవసరం ఏర్పడవచ్చునని మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

మూత పడిన మిల్లులను స్వాధీనం చేసుకోవలసిన అవసరం, కొన్ని కీలక పరిశ్రమలను ప్రభుత్వ ఆజమాయిషీలోకి తేవలసిన అవసరం ఏర్పడవచ్చునని ఆర్థిక మంత్రి శ్రీ చావన్ నేడు లోక్ సభలో చెప్పారు.

విస్తృత స్థాయిలో వనరుల సేకరణకు, అధికోత్పత్తికి, సమాన పంపిణీకి పై అవసరం కలగవచ్చునని ఆయన అన్నారు.

ప్రభుత్వరంగం విస్తరింప చేయాలనే మా అభిప్రాయానికి, ప్రైవేటు, ప్రభుత్వ రంగాల రెండూ కూడా అభివృద్ధి చెందాలనే ప్రధాని శ్రీమతి గాంధీ అభిప్రాయానికి మధ్య భేదం లేదా? అని శ్రీ తి. విశ్వనాథన్ ప్రశ్నించారు.

భారత నటిగా పద్మలత

అలహాబాద్ నాట్యసంఘంవారు 5 వ భారత నాటికలపోటీలను అలహాబాద్ లోని [illegible] లో అపురూపంగా నిర్వహించింది మార్చి 10వ తేదీనుండి 20వ తేదీవరకూ భారతభాషలన్నింటిలోనూ, భారీ ఎత్తున నిర్వహించారు. ఈ నాటికల పోటీలో మొత్తం 41 నాటికలు ఉత్తమస్థాయిలో ప్రదర్శించబడ్డాయి.

హైదరాబాద్ నటరాజ సాంస్కృతిక కళాసమితివారు "కన్య" నాటికను వి. వి. రామారావు దర్శకత్వంలో చక్కగా ప్రదర్శించి తృతీయ ప్రదర్శనా బహుమతిని అందుకున్నారు.

"కన్య" నాటికను రచించిన గొల్లపూడి మారుతీరావు భారతస్థాయిలో ఉత్తమద్వితీయ రచనా బహుమతిని అందుకొన్నారు.

"కన్య" నాటికలో కథానాయిక కుమారి పద్మలత అఖిలభారత నటిగా ఎన్నికవడం ఆంధ్రులకి. ఆంధ్ర ఔత్సాహిక నాటక కళకే గర్వ కారణం. పద్మలత హావభావాలు సంభాషణా చాతుర్యమూ, ఆంగికాభినయమూ ప్రేక్షకుల్ని ముగ్ధుల్ని గావించాయి.

ఉర్దూరచయితమృతి

న్యూఢిల్లీ ఏప్రిల్ 7

ప్రముఖ ఉర్దూ రచయిత, పాత్రికేయుడు అయిన శ్రీ [illegible] హుస్సేన్ నేడిక్కడ మరణించారు, ఆయన వయస్సు 65 సంవత్సరాలు.

భారత - సోవియట్ మధ్య 25 సంవత్సరాల మైత్రి

మాస్కో, ఏప్రిల్ 9

భారత, రష్యా దేశ ప్రజలమధ్య ఎంతో దీర్ఘకాలం నుండి ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలువున్నాయి. భారత దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరమే ఈ సంబంధాలకు ఒక ప్రయోజనం ఏర్పడింది.

17, 18 శతాబ్దాల్లో భారతీయ వర్తకులు అజర్ బైజాన్, ఆస్ట్రఖాన్ లలో, మాస్కోలో, నివసించినట్టు చరిత్రకారులు తెలియజేస్తున్నారు.

భారతదేశంలో బ్రిటిష్ పాలన ప్రారంభమైనప్పుడు భారత, రష్యాలమధ్య సంబంధాలు బలహీనమయ్యాయి. భారత్ లోని బ్రిటిష్ పాలకులు రష్యాను ఒక శత్రు దేశంగా పరిగణించేవారు. అక్టోబరు మహావిప్లవం అనంతరం పరిస్థితి మరింత క్షీణించింది.

అక్టోబర్ మహావిప్లవం పదవవార్షికోత్సవానికి జవహర్ లాల్ నెహ్రూ తన తండ్రి మోతీలాల్ నెహ్రూతో సోవియట్ యూనియన్ ను సందర్శించారు. స్వదేశం తిరిగి వచ్చిన అనంతరం ఆయన నూతన సోషలిస్టు దేశం గురించి, అది సాధించిన ఘన విజయాలను గురించి భారతీయులకు తెలియజేస్తూ అనేక వ్యాసాలు వ్రాశారు. "సోవియట్ రష్యా" అనే గ్రంథం కూడా రచించారు. భారతదేశ ప్రథమ విదేశాంగవిధానాన్ని 1946 సెప్టెంబరు 7 వ తేదీన ఆలిండియా రేడియోలో ప్రకటిస్తూ "సోవియట్ యూనియన్ ను, "ఆసియాలో భారత్ కు పొరుగు దేశం" అని వర్ణించారు.

50 వ దశకం ఆరంభంలో భారత-సోవియట్ సహకారం వివిధ రంగాలకు వ్యాపించింది. 1950-51లో భారత దేశం ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు సోవియట్ యూనియన్ భారత దేశానికి మూడు లక్షల టన్నుల గోధుమలు పంపింది. 1953లో ఉభయ దేశాలు ఒక దీర్ఘకాలిక వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. 1954లో భారత-సోవియట్ ఆర్థిక సహకారం పారిశ్రామిక రంగానికి వ్యాపించింది. భిలాయ్ ఉక్కు కర్మాగార నిర్మాణంపై 1955 ఫిబ్రవరి 2 వ తేదీన ఒప్పందం కుదిరింది.

1955 జూన్ లో జవహర్లాల్ నెహ్రూ భారతదేశ ప్రధానమంత్రి హోదాలో సోవియట్ యూనియన్ లో పర్యటించారు. ఈయన పర్యటనతో భారత - సోవియట్ సంబంధాలలో నూతన మలుపు ఏర్పడింది. 1955 లో సోవియట్ నాయకులు భారత దేశంలో పర్యటించారు.

భారతదేశం అతిప్రధాన రాజకీయ సమస్యలు (కాశ్మీర్, గోవా) ఎదుర్కొంటున్నప్పుడు సోవియట్ యూనియన్ భారతదేశానికి మద్దతు ఇవ్వడమేకాక, చమురు, భారీ ఇంజనీరింగ్, విద్యుత్ మొదలైన కీలకపరిశ్రమల స్థాపనకు కూడా ఎంతో సహాయం చేసింది. ఈ సహకారం ఫలితంగా భారత దేశంలో 70 కర్మాగారాలు, పారిశ్రామిక ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిగావడమో, లేక కొనసాగడమో జరుగుతోంది.

భారత భూగర్భ శాస్త్రవేత్తలు, చమురు అన్వేషకులు, సోవియట్ సహాయం మూలంగా, నేడు స్వయంగా చమురునిలిక్ తీయగల పరిస్థితిలో వున్నారు. ఒక్కటే ఉదాహరణగానేకాదు. భారతదేశానికి సోవియట్ యూనియన్ సహాయం చేయడం

వాణిజ్యంద్వారా కూడా గత 20 సంవత్సరాలుగా సోవియట్ - భారతదేశాల మధ్య వాణిజ్యం ఎంతగానో అభివృద్ధి చెందింది.

భారత-సోవియట్ యూనియన్ల మధ్య దౌత్యసంబంధాలు ఏర్పడి 25 సంవత్సరాలు గడిచాయి. ఈ నెల 13 వ తేదీన ఉభయ దేశాలు 25 వ వార్షికోత్సవం జరుపుకుంటున్నాయి.

బంజరుభూములుకాజేత్తకై ధనిక రైతుల కుతంత్రాలు

ఊటుకూరు గ్రామంలో రెవిన్యూ అధికార్ల విచారణతతంగం: ముఖ్యమంత్రికి గ్రామబంజరు పంపకంకమిటీఛైర్మన్ వినతి

ఊటుకూరు, ఏప్రిల్ 7

కృష్ణా జిల్లా తిరువూరు తాలూకా ఊటుకూరు గ్రామంలో బంజరు భూములు ఆక్రమించుకొని వున్న ధనిక రైతులు ఏదోవిధంగా వాటిని తామే దక్కించుకోనేందుకై రకరకాల బూటకాలతో అధికార్లకు అర్జీలు పెట్టారు. వారు చెప్పిన మాటలు నమ్మి, రెవిన్యూ అధికార్లు జరిపిన విచారణ ఒక తతంగంగా జరిగింది కనుక యీ విషయమై తక్షణమే న్యాయవిచారణ జరిపించాల్సిందిగా కోరుతూ గ్రామ సర్పంచ్, గ్రామ బంజరు పంపకం కమిటీ చైర్మన్ శ్రీ రామిశెట్టి వేణుగోపాలరావు ముఖ్యమంత్రికి ఒక వినతి పత్రం పంపారు.

ఆ వినతిపత్రం నకళ్ళను కృష్ణా జిల్లా కలెక్టరు, జిల్లా రెవిన్యూ అధికారికి, నూజివీడు రెవిన్యూ డివిజన్ ఆఫీసరుకు, శాసన సభ ప్రతిపక్ష నాయకులు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణకు పంపటం జరిగింది.

ఆ పత్రంలో క్రింది వివరాలున్నాయి:

ఊటుకూరు గ్రామంలో రెవిన్యూ లెక్కల ప్రకారం బంజరుగా నమోదైన దాదాపు 800 ఎకరాల మెరక భూమి కొంతకాలంగా ధనిక రైతుల క్రింద, అర్హతలేని రైతుల క్రింద, కొద్ది మంది నిరుపేదల ఆక్రమణ క్రింద వున్నది. అందులో సుమారు 280 ఎకరాల భూమి ఒక్కొక్కరికి 10 నుండి 20 ఎకరాల స్వంత పట్టా భూములున్న ధనిక రైతులక్రింద, అర్హతలేని యితర రైతులక్రింద వున్నది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం ముఖ్యమంత్రి కార్యక్రమం వుద్దేశం ననుసరించి ఊటుకూరు గ్రామంలోకూడా ప్రభుత్వ బంజరు భూమిని భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయుటకు గాను ప్రభుత్వం గ్రామబంజరు పంపిణీ కమిటీని ఏర్పాటు చేసింది.

గ్రామంలో దాదాపు 400 కుటుంబాలకు చెందిన 1600 మంది కేవలం వ్యవసాయం ఆధారంగానే జీవించే భూమిలేని పేదలు ఉన్నారు. 1969 డిసెంబరులో బంజరు పంపిణీ అధికారులను తిరువూరు తాలూకా తహశీల్దారు పంపారు.

బంజరు భూములను ఆక్రమించుకొని కూర్చున్న ధనిక రైతులు దాదాపు 103 మంది తమ ఆక్రమణ క్రింద వున్న బంజరు భూములు ఎలాగూ పోతాయనే ఉద్దేశంతో బంజరు భూముల పంపిణీ సక్రమంగా జరగనివ్వకుండా చేసేందుకై 1970 ఫిబ్రవరి మార్చి నెలల్లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కెళ్ళి రిట్ పిటీషను దాఖలు చేసుకొని తమ స్వాధీనంలో వున్న దాదాపు 166 ఎకరాలు పంపిణీ జరగకుండా 'స్టే' ఉత్తర్వు పొందారు.

వీరిలో చాలా మంది ఆక్రమణదారులుగా కూడా రెవెన్యూ లెక్కలలో నమోదు కాలేదు. మరో 64 మంది రైతులు ఆ నాటి రెవిన్యూ మంత్రి శ్రీ తిమ్మారెడ్డి వద్ద 1970 ఆగస్టు నెలలో 'స్టే' ఉత్తర్వు పొందారు.

అభ్యంతరం లేని కేసులను బంజరు పంపిణీ అధికారులు, గ్రామ బంజరు పంపకం కమిటీ కలసి 1970 జనవరి నుండి మార్చి నెల వరకు విచారణ జరిపి బంజరు పట్టాలు మంజూరుకై సిఫారసు చేయటం జరిగింది. పట్టాల ప్రదానం జరిగింది. తర్వాత బంజరు పంపిణీ వ్యవహారం ఆగిపోయింది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారు 1971 ఫిబ్రవరి నెలలో రిట్ పిటీషన్లపై విచారణ జరిపి వాటిని కొట్టివేస్తూ తీర్పిచ్చారు. ఆ రిట్ పిటీషన్ దార్ల బంజరు భూముల అర్జీలను విచారించి తగు ప్రకారం తగు చర్య గైకొనుటకు ప్రభుత్వానికి అవకాశమున్నదని తీర్పులో సూచించబడివుంది.

అప్పటి నుండి ఆ బంజరు భూముల ఆక్రమణదారులుగా వున్న ధనిక రైతులు ఏదో రకంగా తమ క్రింద గల భూములను తామే దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతోనే తాము కూడా భూమిలేని వారి క్రింద కొత్త మరి పచ్చి అబద్ధపు ప్రకటనలిస్తూ, ప్రభుత్వం వారి లెక్కల ప్రకారం తమకు చెందిన స్వంత భూములు తమవి కావని, ఎవరికో అమ్మివేశామని, దాన మిచ్చామని, పసుపు కుంకుమ క్రింద కూతుళ్ళ కిచ్చామని, చెపుతూ తాముకూడా బంజరు భూములు పొందుటానికి అర్హులమని తెలియజేస్తూ తిరువూరు తహశీల్దారుకు అర్జీలు దాఖలు చేసుకున్నారు. ఈ ధనికరైతులకు కొందరికి యితర గ్రామాలలోకూడా స్వంత పట్టా భూములున్నాయి. వాటి విషయం అధికారులకు తెలియకుండా దాచిపెడుతున్నారు.

తిరువూరు తహశీల్దారు ఆ ధనిక రైతులు చెప్పిన విషయాలు నమ్మి రిట్ పిటీషన్ దార్ల అర్జీలను గ్రామ బంజరు పంపకం కమిటీ సమక్షంలో గాకుండా, మామూలుగా విచారణ జరిపే పంచాయతీ కార్యాలయంలో గాకుండా గ్రామ అప్పర్ ప్రైమరీ స్కూలులో గ్రామాధికారుల ఎదుట మాత్రమే విచారించారు. తిరువూరు డిప్యూటీ తహశీల్దారు, గంపలగూడెం రెవిన్యూ ఇన్ స్పెక్టర్ యీ విచారణ జరిపారు, రిట్ పిటీషన్ దార్లు తమకు అనుకూలంగా స్టేట్ మెంట్లు దాఖలు చేసుకున్నారు. గ్రామాధికారులు కూడా పిటీషనుదార్లకు అనుకూలంగా స్టేట్ మెంటు యిచ్చినట్లు తెలుస్తున్నది. పిటీషనుదార్లయిన ధనిక రైతులు తమ మేనల్లుళ్ళను, కుమారులను కూడా ఆ బంజరు భూములలో ఖాతా దారులని సకల ప్రయత్నాలు చేస్తున్నారు.

ఈ విచారణ తతంగమంతా 1971 డిసెంబరు 6, 7, 8 తేదీలలో జరిగింది. కానీ తర్వాతనే చర్య తీసుకొనడలేదు.

కనుక న్యాయంగా ముఖ్యమంత్రికార్యక్రమం ననుసరించి ప్రభుత్వంవారు పేదలకు బంజరు భూములుపంపిణీచేసే విషయాన్ని తక్షణమే చేపట్టాలని పై విషయమై న్యాయమైన విచారణ జరిపించాలని తక్షణమే ఊటుకూరు గ్రామంలో బంజరు పంపిణీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను.

కాంగ్రెస్ శాసన సభ్యుని ముఠా దాడి

(4 వ పేజీ తరువాయి)

కొన్నిరోజుల తర్వాత కోలుకుంటారనే భావంతో ఇంటికివెళ్ళి అనుమతికి వస్తూ వుండమని డాక్టర్లు సలహా యిచ్చారు, శ్రీ మంచుకొండ రాములు యింటికి రావటం తడవుగా శ్రీ విస్సుల రాములు తన గూండాలను కాపలా పెట్టారు. ఈ రౌడీలు యింటిచుట్టూ పదేపదే తిరుగసాగారు.

ఈ స్థితిలో శ్రీ విస్సుల రాములు ముఠా ఒకవ్యక్తిని రాయబారం పంపాడు. వెంటనే సర్పంచ్ పదవికి, పంచాయతీ సభ్యత్వానికి రాజీనామా చేసి తీరాలని తుది హెచ్చరిక పంపారు. అలా రాజీనామా చేయని పక్షంలో హత్య చేయబడతావనే అర్థం ఆ హెచ్చరికలో వుంది. కాని శ్రీ మంచుకొండ రాములు రాజీనామా చేయలేదు.

అదే రాత్రి శ్రీ మంచుకొండ రాములు యింటిచుట్టూ శ్రీ విస్సుల రాముల ముఠా గూండాల కదలిక తీవ్రమైంది. హత్యా ప్రయత్నం వాతావరణం ముంచుకొని వచ్చింది. ఇది గమనించిన గ్రామస్థులు శ్రీ మంచుకొండ రాములును తప్పుకోమని సలహాయిచ్చారు. శ్రీ రాములు తిరిగి సాగర్ కాలనీ చేరారు.

సాగర్ కాలనీలో కూడా శ్రీ విస్సుల రాముల ముఠా గూండాల కదలిక తిరిగి పెరిగింది. తలకుర్తి, తిరుమలగిరికి చెందిన శ్రీ విస్సుల రాముల ముఠా గూండాలు ఏ పనీ లేకపోయినా కృత్రిమంగా పని కల్పించుకొని తిరగసాగారు.

ఇంతలో మరో వైపున శ్రీ మంచుకొండ రాములు ఆరోగ్య పరిస్థితి విషమించింది, పైకి గాయాలు మానుతున్నట్లు కనబడినా, కానరాని దెబ్బలవలన లోపల ఆరోగ్యస్థితి విషమించింది, మార్చి 27నుండి శ్రీ రాములు నెత్తురు కక్కుకుంటున్నారు. [illegible] నెత్తురు లోపలికి ఎక్కిస్తున్నారు, అయినా నెత్తురు కక్కుకుంటునేవున్నాడు. ప్రస్తుతం అతను ప్రమాద పరిస్థితిలో వున్నాడు.

ఇంత జరిగినా పోలీసులు గూండాలను అరెస్టు చేయలేదు, కేసు విషయమై పోలీసులు ఏమీ పట్టించుకోలేదు. శ్రీ విస్సుల రాములు కొడుకు వగైరాలు బహిరంగంగా తిరుగుతున్నారు. శ్రీ మంచుకొండ రాములు మరణావస్థలో వున్నాడు.

హత్య చేయకుండానే శ్రీ మంచుకొండ రాములు చనిపోతాడని శ్రీ విస్సుల రాముల ముఠా ఎదురు చూస్తూ వుంది.

మార్చి 8 వ తేదీ పోలింగు రోజు తలకుర్తిలో ప్రత్యర్థివర్గాన్ని దెబ్బతీసి మెజారిటీ సంపాదించడానికి కాంగ్రెసు అభ్యర్థి శ్రీ విస్సుల రాములు వేసుకున్న వ్యూహంలో భాగంగానే 6 వ తేదీ శ్రీ మంచుకొండ రాములుమీద హత్యా ప్రయత్నం జరిగింది

ఈ నియోజకవర్గంలో యిలాంటి దౌర్జన్యాలు ఆ కాంగ్రెసు అభ్యర్థి ఎన్నో జరిపించారు. అందులో ఇదొకటి

ధాన్యం వుత్పత్తిలో అఖిల భారత రికార్డు

ఆంధ్ర రైతు ప్రతిభ

అనంతపురం ఏప్రిల్ 7

రాయదుర్గ పంచాయతీ సమితిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీ వి. గోవిందరెడ్డి 1971-72 ఖరీఫ్ సీజన్ లో ఎకరాకు 13809 కిలోగ్రాముల జొన్న పరిమాణాన్ని పండించి అఖిలభారత రికార్డు స్థాపించారు.

జాతీయ స్థాయిలో శ్రీ రెడ్డికి తృతీయ బహుమతి ఇవ్వాలని కేంద్ర ఆహార వ్యవసాయశాఖ నిర్ణయించింది. జిల్లా స్థాయిలో శ్రీ రెడ్డి బహుమతిని పొందారు.

రేడియో

మంగళవారం ఏప్రిల్ 11

శక॥ 1894 చైత్రం 22

విజయవాడ

357.1 మీ. (840 కిలోసై.)

ఉదయం: 5.55 వందేమాతరం, శుభోదయం: 6.02 ఆం. వా: 6.04 భక్తిరంజని: 6.40 సూక్తిముక్తావళి: 6.45 పొలం పనులు: 6.55 ప్రబోధ గేయాలు: 7.02 ఆం. వా: 7.04 కార్యక్రమవిశేషాలు: 7.05 తె. వా: 7.15 లయవిన్యాసం: 7.30 వాద్య బృందం: 7.45 సంగీతశిక్షణ (పీరియర్లుకు): 8.00 హిం. వా: 8.10 ఆం. వా: 8.20 చివుకుల శ్రీరామమూర్తి వయోలిన్: 9.00 హిం. వా: 9.02 ఆం. వా: 9.04 సమాప్తి.

మధ్యాహ్నం: 11.45 చిత్ర తరంగిణి: 12.05 టి. వి. రామన్, టి. వి. లక్ష్మణన్, చిత్తూర్ సుబ్రహ్మణ్య పిళ్లై. 12.30 తె. వా: 12.40 కార్మికుల కార్యక్రమం: 1.10 పసిడి పంటలు: 1.20 చిత్రతరంగిణి: 1.30 వనితా వాణి: 1.59 వాతావరణ సూచన, 2.00 ఆం. వా: 2.10 చిత్రతరంగిణి: 2.30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 చివుకుల శ్రీరామమూర్తి వయోలిన్: 5.55 స్థానిక ప్రకటనలు: 6.00 ఆం. వా: 6.05 ప్రాం. వా: 6.15 పురాణ కాలక్షేపం: 6.25 వ్యవసాయదారులకు: 6.30 కల్పలత: 6.55 కబుర్లు: 7.02 ఆం. వా: 7.04 కార్యక్రమవిశేషాలు: 7.05 తె. వా: 7.15 పంట సీమలు: 7.45 యువవాణి: 8.30 ఈరోజు పార్లమెంటులో: 8.45 హిం. వా: 9.00 ఆం. వా: 9.15 హై. వలి: 10.30 జన గణ మన - ప్రసార సమాప్తి.

హైద్రాబాద్ - (ఎ)

405.4 M (740 kHz)

ఉదయం: 6.00 వందేమాతరం, 6.02 ఆం. వా: 6.04 మంగళధ్వని, కార్యక్రమ వివరణ: 6.10 భక్తిరంజని: 6.40 సూక్తిముక్తావళి: 6.45 వాద్యసంగీతం, 6.55 పాడి - పంట: 7.02 ఆం. వా. 7.04 కార్యక్రమ వివరణ: 7.05 తె. వా: 7.15 లలితా వందనన్: 7.45 సంకీర్తనం 8.00 హిం. వా: 8.10 ఆం. వా: 8.20 వి. వలి: 9.01 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12.05 చిత్రసీమ: 12.20 హిందీ పాఠము: 12.30 తె. వా: 12.40 కార్మికుల కార్యక్రమం: 1.10 వాద్యగోష్టి: 1.30 వనితావాణి: 1.59 వాతావరణ సూచన: 2.00 ఆం. వా: 2.10 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 లలితా వందనన్: 5.55 ప్రసార విశేషాలు: 6.00 ఆం. వా: 6.05 ప్రాం. వా: 6.15 ఉ. వా: 6.25 వ్యవసాయ దారులకు: 6.30 గ్రామసీమలు: 7.00 అనగ అనగ. కథానిక: 7.05 తె. వా: 7.15 గ్రామస్థుల రేడియో గోష్ఠి: 7.45 లలిత సంగీతం: 8.00 చిత్రగీతావళి: 8.15 చిత్రసీమ: 8.30 లలితా వందనన్: 8.45 అంతస్తులు-(నాటిక): 8.45 హిం. వా. ([illegible])-9.00 ఆం. వా: 9.15 వీణ: 10.30 జన గణ మన - ప్రసార సమాప్తి.

హైద్రాబాద్ - (బి)

217.4 మీ. (1380 కిలోసైకిల్సు)

ఉదయం: 6.30 వందేమాతరం, 6.40 ఈశ్వర అల్లా తేరేనాం: 7.00 హిం. వా: 7.02 విరామ సంగీతం: 7.05 లలిత సంగీతం: 7.20 పాశ్చాత్య సంగీతం: 7.30 నేటి కార్యక్రమం: 7.35 ఫిల్మిగానే: 7.45 రేడియో కళాశాల: 8.10 హిందూస్థానీ సంగీతం: 8.25 చిత్రసీమ: 8.50 ఉ. వా: 9.00 వసుమతీ దాతాలే ఖయాల్: 9.30 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 2.00 వాద్య సంగీత్: 2.10 హిం. వా: 2.20 ఫిల్మిగానే: 2.30 శ్రీ లంక (హిందీ): 3.00 హిం. వా: 3.02 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 హిందూస్థానీ సంగీతం: 6.45 చిత్రసీమ: 6.05 హిం. వా: 6.10 రంగుల తెర: 6.40 ఫిల్మిగానే: 7.00 హిం. వా: 7.02 నేటి కార్యక్రమము: 7.05 కర్ణాటక సంగీతం: 7.20 మ్యాగజిన్ ప్రోగ్రామ్: 7.50 క్రీడారంగ సమీక్ష: 8.00 హి. వా: 8.02 విరామ సంగీతం: 8.05 (ప్రసంగం హిందీ): 8.15 రేడియో న్యూస్ రీల్: 8.25 శాస్త్రీయ సంగీత్: 8.35 ఈ రోజు పార్లమెంటులో: 8.45 హిం. వా: 9.00 ఫిల్మిగానే: 9.15 ఉ. వా: 9.30 నైరంగ్ (ఉర్దూలో కార్యక్రమం). 10.30 జన గణమన - ప్రసార సమాప్తి.

మద్రాసు - (బి)

ఉదయం: 6.55 వందేమాతరం, మంగళ ధ్వని: 7.02 ఆం. వా. 7.04 విరామ సంగీతం: 7.05 తె. వా: 7.15 తమిళ వార్తలు: 7.45 ఇశైక్కోలం: 8.00 హిం. వా: 8.10 ఆం. వా: 8.20 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12.30 తె. వా: 12.40 వాద్యసంగీత్: 12.50 ఆర్. మధురం, ఆర్. కమల, 1.00 కార్యక్రమ వివరణ: 1.02 ఆం. వా: 1.04 పాశ్చాత్య సంగీతం: 1.30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 పాశ్చాత్య సంగీతం: 6.00 ఆం. వా: 6.05 కార్యక్రమ వివరణ: 6.30 యువజనుల కొరకు కార్యక్రమం: 7.02 ఆం. వా: 7.04 కార్యక్రమ వివరణ: 7.05 తె. వా: 7.15 ఇసై భారతం: 8.15 రేడియో న్యూస్ రీల్: 8.25 ఇతర ప్రాంత సంగీతం: 8.35 ఈరోజు పార్లమెంటులో: 8.45 హిం. వా: 9.00 ఆం. వా: 9.15 స్పాట్ లైట్: 9.20 పాశ్చాత్య సంగీతం (యువకులకు): 10.00 పాశ్చాత్య సంగీతం: 11.00 జనగణ మన. ప్రసార సమాప్తి.

విశాలాంధ్ర

1972 ఏప్రిల్ 10 సోమవారం

కేంద్ర కార్మికశాఖ లొంగుబాటు వైఖరి

కేంద్ర కార్మిక శాఖ మంత్రి శ్రీ ఖాడిల్కర్ ఇటీవల కేంద్ర ట్రేడ్ యూనియన్ సంస్థలపై ఒక పెద్ద అగావు వేశారు. నూతన పారిశ్రామిక సంబంధాలను రూపొందించడంలో తాము చాలా శ్రద్ధాశక్తులు చూపుతున్నట్లు, కేంద్ర ట్రేడ్ యూనియన్ సంస్థలే ఒక ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నట్లు ఆరోపించారు.

శ్రీ ఖాడిల్కర్ ఆసక్తి చూపుతున్న నూతన పారిశ్రామిక సంబంధాలు ఎంత "ఆదర్శవంతం"గా ఉంటాయో, వాటి స్వరూప స్వభావాలు ఏ విధంగా ఉంటాయో మచ్చుకి ఒక ఉదాహరణ:

ఒక పరిశ్రమను మూసివేసేటప్పుడు ఆ పరిశ్రమ యజమాని 60 రోజులు ముందుగా నోటీసు యివ్వడాన్ని చట్టబద్ధం చేసే పారిశ్రామిక వివాదచట్టం సవరణబిల్లును ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

ఇలాంటిబిల్లునే రాష్ట్రపతి ఉత్తరువుద్వారా లోగడ పశ్చిమ బెంగాల్లో అమలుజరిపారు. ఆ బిల్లులో ముందు నోటీసులేకుండా మిల్లులను మూసివేసే యజమానులకు ఖచ్చితంగా జైలు శిక్ష విధించాలని నిర్దేశించబడింది.

కాని ఇప్పుడు దేశమంతటికీ వర్తించే విధంగా కేంద్ర కార్మికమంత్రి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లులో నోటీసు లేకుండా మిల్లులను మూసివేసే యజమానులకు జరిమానా విధించడంద్వారా మాత్రమే చర్య తీసుకోవాలని నిర్దేశించారు ఖచ్చితంగా జైలుశిక్ష విధించాలన్న క్లాజును ఎత్తివేశారు,

రాజ్యసభలో ఈ బిల్లు చర్చకు వచ్చినప్పుడు కమ్యూనిస్టు పక్ష నాయకుడు శ్రీ భూపేష్‌గుప్త తదితరులు బెంగాల్ బిల్లులోని క్లాజును యీ బిల్లులో ఎందుకు తొలగించవలసి వచ్చిందని సూటిగా అడిగారు. ఇది యజమానులపట్ల పక్షపాతం చూపడం తప్ప వేరుకాదని నిశితంగా ఖండించారు.

జైలుశిక్ష విధించే ఈ క్లాజు విషయం కేంద్ర మంత్రివర్గం పరిశీలించి యీ నిబంధన అవసరంలేదని తీర్మానించినట్లు శ్రీ ఖాడిల్కర్ కుంటి సమాధానం ఒకటి చెప్పారు.

కార్మికులు సమ్మె నోటీసు సక్రమంగా యివ్వలేదనిచెప్పి, సమ్మెలను అక్రమ సమ్మెలుగా ప్రకటించడానికి అరెస్టులు చేయడానికి కావలసినన్ని అధికారాలను చేతబుచ్చుకొన్న ప్రభుత్వం యజమానులు అక్రమంగా, నోటీసులు లేకుండా మిల్లులను మూసినప్పుడు వారిపై జైలు శిక్షలు విధించడానికి అవకాశం లేకుండా చేయడం యజమానుల పక్షం వహించడం, వారి వత్తిడికి లొంగిపోవడం తప్ప వేరుకాదు.

బిల్లులో వున్న నిబంధనలు యజమానులపై చర్య తీసుకోడానికి తగినంత కఠినంగా లేవని ఆచరణలో తేలితే అప్పుడు పరిస్థితిని పునఃపరిశీలిస్తామని శ్రీ ఖాడిల్కర్ చెప్పిన సమాధానం తమ లొంగుబాటును కప్పిపుచ్చుకోడానికి చేసే శుష్కవాదన మాత్రమే.

కార్మికులను లొంగదీయడానికీ, తమ లాభాల రేటును రక్షించుకోడానికి యజమానులు మిల్లులను, మూసివేసి జరిపే అక్రమాలను, అన్యాయాలను ఖచ్చితంగా ఎదుర్కోడానికి ప్రభుత్వం సంసిద్ధంకావటంలేదని దీనినిబట్టి స్పష్టం.

కార్మికులకు ద్రోహం చేస్తూ యజమానులకు వత్తాసు నిస్తూ పారిశ్రామిక నూతన సంబంధాలు నెలకొల్పుతామని శ్రీ ఖాడిల్కర్, కాంగ్రెస్ నాయకులు ఉపన్యాసాలు చెప్పడం సిగ్గుచేటు.

కార్మిక ప్రతినిధుల విమర్శదృష్ట్యానైనా కేంద్ర కార్మికశాఖ ఇటి లొంగుబాటు వైఖరి విడనాడుతుందని, బెంగాల్ బిల్లులో ఉన్న కఠిన నిబంధనను కేంద్రం బిల్లులో ప్రవేశపెడతారని ఆశిస్తున్నాం.

వైద్యవిద్యార్థిని దారుణహత్య

విశాఖ వైద్య విద్యార్థిని కుమారి కె. ధనలక్ష్మి విశాఖ నుండి విజయవాడ వస్తుండగా స్లీపర్‌కోచ్‌లో హత్యచేయబడిన ఉదంతం ఏ విధంగా చూసినా చాలా దారుణంగా ఉంది. ధనలక్ష్మి తల్లి తండ్రులకే కాదు ప్రతి తల్లి దండ్రికి ఇది గగుర్పాటు కల్గించుతూంది.

మోసగించబడటానికి కుమారి ధనలక్ష్మి చదువురాని పల్లెటూరు యువతికాదు అమాయకురాలుకాదు, ఉన్నత విద్యావతి ఇదివరకు నుండి ఒంటరిగా ప్రయాణం చేయడానికి అలవాటుపడిన విద్యార్థిని. అట్టి విద్యావతే ఇటువంటి హత్యకు లోనైనదంటే స్త్రీలు రైళ్లలో ఒంటరిగా ప్రయాణం చేయడం ఎంత భద్రతా రహితంగా ఉన్నదో వేరుగా చెప్పనక్కరలేదు.

రైళ్ళలో ఇటువంటి అరక్షిత పరిస్థితి ఏర్పడటం ఘోరమైన విషయం. అనేకమంది తోటి ప్రయాణీకులు, స్లీపర్‌కోచ్ కండక్టరు ఉండగానే దుండగులు కుమారి ధనలక్ష్మితో ముందు బెర్త్‌కోసం తగవుపెట్టుకున్నారు. ఆ తరువాత ప్రయాణం పొడవునా ఆమెను వేధించారు. చివరకు ఆమెపై అత్యాచారంచేసి హత్యచేశారు. గోదావరిలో త్రోసివేశారు.

కుమారి ధనలక్ష్మి హత్యకు కారకులను నెరికి పట్టుకొని తగు శిక్ష విధించడానికి నేర పరిశోధక శాఖ ఎంత చాకచక్యంగా వ్యవహరించుతుందని ప్రజలందరు ఎదురు చూడటం సహజం.

సైన్య కూటాలు, స్థావరాలు ఎందుకోసం?

సైన్య రాజకీయ కూటాలనూ, సైన్య స్థావరాలనూ ఏర్పాటు చేయడం రెండో ప్రపంచ యుద్ధానంతరం కొన్ని రాజ్యాలకు ఒకార్యక్రమం అయింది. యూరప్‌లో నాటో ఆస్ట్రేలియా ప్రాంతంలో అన్‌జస్ ఆగ్నేయాసియాలో సియాటో. మధ్య ప్రాచ్యంలో సెంటో యీ విధంగా వచ్చినవి. అమెరికా ఖండం మీద ఓ. ఎ. ఎస్. భూగోళం అంతటా సైన్య స్థావరాలూ ఏర్పర్చబడినాయి. ఈ కూటాలూ, ఈ స్థావరాలూ ప్రతిఒక్క దానిమీదా అమెరికా పెత్తనంవుంది. దానిలో 40 దేశాలు మార్చబడివున్నాయి. సైన్య స్థావరాల మొత్తం విస్తీర్ణం 10 వేల చదరపు కిలోమీటర్లు. వీటన్నింటిలో మిలియను పైగా అమెరికను సైనికులున్నారు. ఇదిగాక మధ్యధరా సముద్రంలో 6 వ నౌకాదళం, పసిఫిక్‌లో 7 వ నౌకాదళం (ప్రస్తుతం యిది హిందూ మహా సముద్రంలో కూడా పెత్తనం తీసుకొంది.) లాగ సముద్రాలలో అమెరికాకు ప్రవహణ స్థావరాలున్నాయి.

ఇన్ని సైన్య కూటాలూ, స్థావరాలూ ఎందుకు?

రెండో ప్రపంచ యుద్ధంలోంచి చాలా పాశ్చాత్య రాజ్యాలు బలానికి కుంటుకుంటూనే బయటపడ్డాయి. పెద ఎర్రను రాజ్యాల బలానికి విశాలమైన మూలం ఆసియా, ఆఫ్రికాలలోని ఇటీ పూర్వపు వలసలు. అవి అన్నీ కాకపోయినా చాలవరకు చెయ్యి జారిపోయి, స్వతంత్ర రాజ్యాలు అయ్యాయి, కాని ఆ పాశ్చాత్య రాజ్యాలు ఆ ప్రాంతాలలోని తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోగలిగాయి. అనేక పద్ధతులలో వానిని పెంచుకొంటూనేవచ్చాయి, 'సహాయాలు' 'సహకృషి' పేరుతో తరుణ రాజ్యాలలో ఎంతెంతో పెద్దపెట్టుబడులు పెడపోగారు. ఆ విధంగా వలసవ్యవస్థ కొత్త రూపంలో తలెత్తింది. రూపం చాలా పరిష్కృతంగానీ, దయారహితంగా దోచుకొనడంలో వెనకటి దానికి ఏమీ తగ్గదు.

ఆర్థిక స్వాతంత్ర్యం వైపు పురోగమనం

నూతనంగా స్వాతంత్ర్యం పొందిన దేశాల ప్రకృతి సంపదలను కొంతకాలంపాటు దోచుకునే హక్కును యధేచ్ఛగా అనుభవించగలమని "పాత ప్రభువుల" ఆశ ఆలోచన. కాని, వారి దురదృష్టం ఆర్థిక స్వాతంత్ర్యం లేని స్వాతంత్ర్యానికి అర్థంలేదని ఆ అద్భుత ప్రజానీకం తెలుసుకొంది. ఈ పరిజ్ఞానం జాతీయ విముక్తి ఉద్యమంయొక్క రెండో దశను ప్రారంభించింది. సంపూర్ణ ఆర్థిక స్వాతంత్ర్యం కోసం సంచలనం ఆరంభమయింది.

జాతీయ విముక్తి కోసం, ఆర్థిక స్వాతంత్ర్యం కోసం పోరాడే ప్రజలకు బహిరంగంగా వత్తాసు పలుకుతున్న సోషలిస్టు దేశాలతో, ముఖ్యంగా సోవియట్ యూనియనుతో నూతనంగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు సంబంధం పెట్టుకోవడం ఆ పూర్వపు వలస ప్రభుత్వాలకు కంటకంగా వుంటుంది. అందుచేత సోవియట్‌కూ, స్వాతంత్ర్యం కాంక్షిస్తున్న ప్రజలకు మధ్య అనుమానాలూ, ద్వేషాలూ, వాటి దానికి అవి కల్పించి కొట్టి పదవేస్తున్నాయి. వారు డబ్బు తినేవాళ్ళ యీ ప్రయత్నంలో సిద్ధాంతాలను, సాకాలను రంగంలోకి తెస్తారు. తమ ప్రాబల్యం దక్కించుకోవడం కోసం సాధనాలనుగా వర్ధమాన దేశాలలో కొందరికి సాయం, ప్రోత్సాహం యిస్తారు.

దక్షిణ అమెరికా, ఆసియా, ఆఫ్రికాలలోని అభ్యుదయ ప్రభుత్వాలు ఎన్నో అమెరికా విద్రోహానికి బలి అయాయి. ఇస్రాయిలు తన ఇరుగు పొరుగు అరబ్బు దేశాల మీద దాడి చేయడంలో వుద్దేశం యిదే, ఇటీవలనే సి. ఐ. ఎ, నాయకత్వాన అదే మాదిరి కుట్రలు బంగ్లాదేశ్ ప్రజల స్వాతంత్ర్య పోరాటం గొంతు నులిమి వేయడానికి ప్రయత్నించాయి.

అమెరికనుల అణు సబ్మెరిన్ 'ఎంటర్ ప్రైజ్' ఇటీవల జరిగిన బంగ్లాదేశ్ యుద్ధకాలంలో బంగాళాఖాతంలో ప్రవేశించడమే యీ సైన్య స్థావరాలూ, సముద్ర గస్తీలూ ఎందుకో స్పష్టంగా చూపుతోంది. స్వాతంత్ర్యంకోసం పోరాటాలు సాగుతున్నచోట్ల సైన్యకూటాలా, ఆ ప్రాంతంలోని స్థావరాలా పాత్ర ఎలా వుంటుందో ఆగ్నేయాసియాలోనూ, మధ్యప్రాచ్యంలోనూ మనం చూస్తున్నాం. పొరుగుదేశాలలోని అమెరికను స్థావరాలలో వుంచిన బాంబర్లు ఇండో-చైనామీద విధ్వంసాన్నీ, మృత్యువునీ వర్షిస్తున్నాయి. దక్షిణ అమెరికాలో ఎక్కడ ఆందోళన వచ్చినా కరేబియన్ నౌకాదళాన్ని సిద్ధంచేసినట్లే, మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తత ఏర్పడినప్పుడు మధ్యధరా సముద్రంలోని 6 వ నౌకాదళాన్ని ఆయత్తం చేస్తుంటారు.

శ్రీ

ఎస్. డబ్ల్యు. దాంతే

సోషలిస్టు వ్యూహం

ఈజిప్టు మీద బ్రిటిష్ - ఫ్రెంచి - ఇస్రాయిలుల దాడిని గట్టిగా వ్యతిరేకిస్తూ సోవియటు గట్టి హెచ్చరిక యిచ్చిన నాటికి, ఈజిప్టు సోవియట్‌ల మధ్య పెద్ద స్నేహం లేదు. ఇటువంటప్పుడు ఈజిప్టు తరఫున అంత హఠాత్తుగా, నిర్ణయాత్మకంగా ఎందుకు వ్యవహరించింది? పాకిస్తాను కాశ్మీరుపై దాడిచేసినపుడు భారతదేశానికి అనుకూలంగా భద్రతా సమితిలో సోవియట్ గట్టిగా నిలబడింది. మళ్ళీ గోవాసమస్యమీద కూడా భారతదేశం తరఫునే సోవియట్ నిలబడింది. ఇటీవల స్వాతంత్ర్యంకోసం పోరాడుతున్న బంగ్లాదేశ్ ప్రజలను బాహాటంగా సమర్థించింది. రెండో వేపున సోవియటు నాయకులు భారత పాకిస్తాన్ ప్రజల మధ్య శాంతి, స్నేహాలు ఏర్పడే మార్గం వెతకడంలో లోపం చేయడంలేదు.

సోవియట్ యూనియను అనుసరిస్తున్న శాంతి విధానానికి యిది అనుగుణమైనది. విదేశాలలో ఎక్కడా దానికి సైనిక స్థావరాలు లేకపోవడమే యిందుకు సాక్ష్యం.

కమ్యూనిజాన్ని వ్యాపించకుండా నిరోధించడానికి ప్రపంచమంతటా అమెరికను స్థావరాలు నిర్మించ బడుతున్నాయంటూ చాలాదేశాలు భావించిన రోజులువెళ్ళిపోయాయి, అధ్యక్షుడు డిగోలే [illegible] అమెరికా పెత్తనంలో నాటో కూటమి ప్రధానకార్యాలయాన్ని ఫ్రాన్సునుండి తీసివెయ్యమన్నాడు. మధ్య నేటికూటాలలో చేర్చిన వారికి, తమ దేశ భాగాలలో అమెరికా స్థావరాలు నిర్మించుకోడానికి అనుమతించిన వారికి ఆ ఒక్క ఘటన కళ్ళు తెరిచింది. కాని, అంతటితో అమెరికా దృక్పథం మారలేదు స్థావరాలు నిర్మించుకొనే ప్రదేశాలకోసం ఇంకా సైన్య పాలకులతో అమెరికాబేరాలు జరుపుతున్నదని ఇటీవలి వార్త, హిందూ మహాసముద్రంలోని డియాగో గార్సియా దీవిలో బ్రిటన్ అమెరికాలు ఉమ్మడిగా పనిచేస్తున్నాయి.

సోవియట్‌పై దుష్ప్రచారం

ఒక మూల తామీ పని చేస్తూ, రెండో వేపున సోవియట్ యూనియను సైనిక స్థావరం నిర్మాణం కోసం ఏదో దేశంలో స్థలం బేరమాడుతున్నదని తరచుగా ప్రచారం సాగిస్తున్నారు, ఉదాహరణకు అమాదిరి వార్తను లండన్ టైమ్స్ ప్రచురిస్తే భారత దేశంలో కొందరు దానిని ఎత్తిరాశారు. ఈజిప్టు అధ్యక్షుడు సాదత్ ఒప్పుకోలేదని,అందుచేతనే ఆయన మాస్కో యాత్ర ప్రయోజనం విఫలమయిందని అదే పత్రికలో మరో వార్త. భారత దేశంలో కొన్ని పత్రికలు ఆ వార్తను పట్టుకొని సోవియట్ అల్లాంటి షరతులు వేస్తుందేమో జాగ్రత అని హెచ్చరిస్తున్నాయి.

తర్వాత అధ్యక్షుడు సాదత్ బియోపీలో మాట్లాడుతూ తన మాస్కో పర్యటన వల్లనే ఈజిప్టు సోవియట్‌ల మధ్య ఏ విధమైన మనస్పర్థలు కలిగించలేదని ధృవపడిందన్నారు. అయినా 'సోవియటుకేవో దురభిప్రాయాలున్నాయం'టూ ప్రజల మనస్సులలో అనుమానాలు రేకెత్తించడం కోసం కథలు అల్లుతూనే వున్నారు.

ఎవరిమీదికో వుద్దేశించి సైనిక రాజకీయ కూటాలూ. యుద్ధ స్థావరాలూ, విచ్ఛిన్నంచాలనడంగాక, వాటిని నిర్మూలించాలని సోవియట్ కోరుతూంది. దేశాల కొత్త జలాల నుంచి యుద్ధ నౌకల్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూంది. విదేశాలలో ఏ రాజ్యమూ సైన్యాలను వుంచకూడదని ఖండితంగా డిమాండు చేస్తూంది. అదే సమయంలో వేర్వేరు ప్రాంతాలలో శాంతియుత సహజీవనసూత్రమూ, పరస్పరగౌరవం పరస్పర లాభకరమైన ఆర్థిక సహకారమూ ప్రాతిపదికగా సమష్టి భద్రతను నిర్మించుకోవాలనే భావాన్ని ముందుకు తెచ్చింది.

సామ్రాజ్యవాదుల యుద్ధం, దురాక్రమణ వ్యూహానికి ప్రతిగావున్న సోషలిస్టు శాంతి, సహకారవ్యూహం యిది.

నల్లగొండజిల్లా

చలకుర్తిసర్పంచ్‌పై కాంగ్రెస్ శాసనసభ్యుని ముఠా దాడి

నెత్తురు కక్కుకుంటూ ప్రమాదకర స్థితిలో ఆసుపత్రిలోవున్న ఉదంతం

(విశాలాంధ్ర విలేకరి)

విజయపురి, ఏప్రిల్ 8

నల్లగొండజిల్లా చలకుర్తి సర్పంచ్ శ్రీ మంచుకొండ రాములు యింటిమీద కాంగ్రెస్ శాసన సభ్యుడు శ్రీ నిమ్మల రాములు ముఠా గతనెల 7వ తేదీ దాడి చేసింది. ఈ దాడికి శ్రీనిమ్మల రాములు కొడుకు నాయకత్వం వహించాడు. మంచుకొండ రాములుకు తలపగిలింది. చేతులు విరిగాయి. ప్రస్తుతం అతని ఆరోగ్యం ప్రమాదకరంగావుంది. నెత్తురు కక్కుకుంటూ వున్నాడు.

ఈ రౌడీ ముఠా అంతటితో ఆగకుండా ఆ కత్తి తలపు పదునుపెట్టి పదేపదే నొక్కిగారు అసలు హత్య చేయడానికే యీ దాడి ఉద్దేశించబడినట్లు ఇక్కడ భావింప బడుతూవుంది. కాని ఎందువల్లనో అంతపని జరుగలేదు. శ్రీ మంచుకొండ రాములు సాగర్ కె. యస్. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

(మిగతా 3 వ పేజీలో)

సభలు - సమావేశాలు

ఖమ్మంజిల్లా ఇల్లెందుతాలూకా గార్ల, బయ్యారం. ప్రాంతాలకు చెందిన కమ్యూనిస్టుపార్టీ సభ్యుల సమావేశం యీనెల 12 వ తేదీ సత్యనారాయణపురంలో జరుగుతుంది.

* * *

ఖమ్మం జిల్లా మధిర తాలూకా కమ్యూనిస్టు పార్టీ సభ్యుల, సానుభూతిపరుల సమావేశం ఈ నెల 10 వ తేదీ పాలడుగు గ్రామంలో జరుగుతుంది.

* 0 *

ఇల్లెందు తాలూకా పండితాపురం, కారేపల్లి ప్రాంతాలకు చెందిన కమ్యూనిస్టు పార్టీ సభ్యుల, సానుభూతిపరుల సమావేశం ఈ నెల 11వతేదీన డిశాపురంలో జరుగుతుంది.

* * *

ఇల్లెందు తాలూకా జల్లనపూడం, మాదారం, పేరేపల్లి ప్రాంతాలకు చెందిన కమ్యూనిస్టుపార్టీ సభ్యుల సమావేశం ఈనెల 13 వ తేదీన ముకుందాపురంలో జరుగుతుంది.

0 0 0

భద్రాచలం డివిజన్‌లోని వెంకటాపురం తాలూకా కమ్యూనిస్టుపార్టీ సభ్యుల సమావేశం చర్ల గ్రామంలో ఈ నెల 14 వ తేదీన జరుగుతుంది.

0 0 0

భద్రాచలం తాలూకా కమ్యూనిస్టుపార్టీ సభ్యుల సమావేశం ఈ నెల 16 వ తేదీ గన్నవరం గ్రామంలో జరుగుతుంది.

0 0 0

భద్రాచలం డివిజన్ సి. ఆర్. పురం సమితి ప్రాంతీయ కమ్యూనిస్టుపార్టీ సభ్యుల సమావేశం ఈ నెల 18 వ తేదీ చింతూరు గ్రామంలో జరుగుతుంది.

0 0 0

బూర్గంపహాడ్ తాలూకా కొండాయిగూడెం ప్రాంతీయ కమ్యూనిస్టు పార్టీ సభ్యుల సమావేశం ఈ నెల 18 వ తేదీ పగిడేరు గ్రామంలో జరుగుతుంది,

0 0 0

బూర్గంపహాడ్ తాలూకా అశ్వాపురం ప్రాంతీయ కమ్యూనిస్టుపార్టీ సభ్యుల సమావేశం ఈ నెల 20 వ తేదీ మల్లెలమడుగులో జరుగుతుంది

కొత్తగూడెం తాలూకా అశ్వారావుపేట ప్రాంతీయ కమ్యూనిస్టుపార్టీ సభ్యుల సమావేశం ఈ నెల 21 వ తేదీ దమ్మపేట గ్రామంలో జరుగుతుంది.

జిల్లా వ్యాపితంగా జరుగనున్న యీ సర్వసభ్య సమావేశాలకు జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ పి. నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి శ్రీ వెంకటపతి, శాసన సభ కమ్యూనిస్టు పక్ష ఉప నాయకులు శ్రీ రజబ్ అలీ ప్రభృతులు పాల్గొంటారు.

ఈ సమావేశాలలో జిల్లాలోని మొత్తం పార్టీ సభ్యులు. సానుభూతి పరులు పాల్గొనే ఏర్పాటు చేయవలసినదిగా ఆయా తాలూకా సమితి కార్యదర్శులను. పార్టీ ఆర్గనైజర్లను జిల్లా సమితి కార్యదర్శి శ్రీ నాగేశ్వరరావు కోరుతున్నారు.

ప్రణాళికా సంఘ చర్చలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

దేశంలో దారిద్ర్యాన్ని నిర్మూలించి త్వరితగతిని ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు ఉద్దేశించబడిన కార్యక్రమాలకు ఐదవ పంచవర్ష ప్రణాళికలో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని ప్రణాళికా సంఘం నేడు నిర్ణయించింది.

పండిమిషాలపాటు జరిగిన ప్రణాళికా సంఘ సమావేశానికి ప్రధాని శ్రీమతి గాంధి అధ్యక్షత వహించారు. ఐదవ పంచవర్ష ప్రణాళిక స్వరూప స్వభావాలను గురించి ఈ సమావేశంలో పరిశీలించారు. వచ్చే సెప్టెంబరు నాటికి ఐదవ పంచవర్ష ప్రణాళికను గురించి ఒక పత్రాన్ని రూపొందిస్తుంది.

ఈ పత్రం రూపొందించటంలో సహకరించవలసిందిగానూ, జూలై నెలాఖరులోగా తమ అభిప్రాయాలను తెలియ పరచవలసిందిగానూ వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఇంతకు ముందే కోరటం జరిగింది. ఐదవ పంచవర్ష ప్రణాళిక ముసాయిదా 1973 ఏప్రిల్ నాటికి పూర్తికావలసివుంది.

ఇది ఇలా వుండగా ఐదవ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలు విధానాలను గురించి ముఖ్య మంత్రులతో ప్రాథమిక చర్చలు జరిపేందుకు గాను వచ్చే నెలలో జాతీయ అభివృద్ధి మండలి సమావేశం ఏర్పాటు చేయబడింది.

నేటి సమావేశంలో వనరులు, ఆర్థిక విధాన పద్ధతి, పరిపాలనా యంత్రాంగంలోనూ, ఆర్థిక వ్యవస్థలోనూ సమూల మార్పులు, వాటి అవసరం గురించి రూపొందించబడిన కొన్ని తాత్కాలిక ప్రతిపాదనలతో కూడిన ఒక పత్రాన్ని పరిశీలించారు.

నాలుగవ ప్రణాళికలో ప్రభుత్వరంగ పెట్టుబడి రు. 16 900 కోట్లుకాగా, ఐదవ పంచవర్ష ప్రణాళికలో రు. 20,000 కోట్ల నుంచి రు. 22 000 కోట్లవరకు పెట్టుబడి వుండే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు ఒక కాలపరిమితి గల కార్యక్రమంతో కూడిన ఒక పత్రాన్ని నేటి సమావేశంలో పరిశీలించారు.

ఉపాధి కల్పనకుగాను సమగ్ర గ్రామీణ అభివృద్ధి పథకం, సుస్థిరమైన ధరల విధానం. మంచి పారిశ్రామిక సంబంధాలు అమలు జరపవలసి వుంటుందని ఆ పత్రంలో పేర్కొన్నారు.

సాంఘిక న్యాయం చేకూర్చడానికి వ్యూహంతోపాటు ప్రజల నిత్యజీవితావసర వస్తువుల ఉత్పత్తి పెంపు చేసేందుకు కృషి చేయవలసి వుంటుందని ఆ పత్రంలో పేర్కొన్నారు. భూసంస్కరణల ద్వారా గ్రామీణ రంగంలో కూడా సమూలమార్పులు తీసుకరావలసిన అంశాన్ని గురించి కూడా ఆ పత్రంలో పేర్కొన్నారు.

నేటి సమావేశంలో ప్రధాని ఏటువంటి ప్రసంగం చేయలేదు, పరస్పరం అభిప్రాయాలను మాత్రమే తెలుసుకున్నారు.

ప్రాంతీయ అసమానతల తొలగింపు, అమలు జరపవలసిన కార్యక్రమాలు, ప్రణాళికా యంత్రాంగాన్ని పటిష్ఠం చేయటం గురించి నేటి చర్చలలో ప్రస్తావించారు.

నూతన పారిశ్రామిక సంబంధాలు నెలకొల్పటం గురించి ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలిస్తుంది. సమ్మెలు, లాకౌట్లపై మారటోరియం ప్రకటించాలని గతంలో ప్రధాని విజ్ఞప్తి చేసిన విషయం పాఠకులకు తెలిసినదే.

ఈ నెల 13, 14 తేదీలలో జరుగనున్న ముఖ్యమంత్రుల సమావేశంలో భూసంస్కరణలను సత్వరం అమలు జరపవలసిన అవసరం గురించి కేంద్ర నాయకులు విజ్ఞప్తి చేస్తారని భావించ బడుతూంది.

నడికూడి గ్రామ సమస్యలపై శ్రీనాగిరెడ్డిమెమొరాండం

తగినచర్యలుతీసుకుంటామనిమంత్రులహామీ

హైదరాబాదు, ఏప్రిల్ 7

గుంటూరుజిల్లా ఎర్నాదు తాలూకా నడికూడి పంచాయతీ పాతిమానగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందికి టీచింగ్ గ్రాంటును మంజూరు చేయాల్సిందిగా కమ్యూనిస్టు శాసన సభ్యులు శ్రీ మందపాటి నాగిరెడ్డి విద్యా శాఖమంత్రికి సమర్పించినమెమొరాండంలో విజ్ఞప్తి చేశారు.

పాతిమానగర్‌లో ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభించిన పాతిమా ఆర్.సి.ఎం. ప్రాథమిక పాఠశాలకు వచ్చే సంవత్సరం నుండి 3, 4, 5 తరగతులు ప్రారంభించేందుకు అనుమతివ్వాల్సిందని, పరోముగ్గురు ఉపాధ్యాయుల గ్రాంటును మంజూరు చేయాల్సిందని ఆ మెమొరాండంలో కోరారు. టీచింగ్ గ్రాంటును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేయగలనని మంత్రి హామీ యిచ్చారు.

వీధిలైట్ల సమస్య

నడిగూడి గ్రామ పంచాయతీలోని వీధిలైట్లకు విద్యుత్ సరఫరా చేయాల్సిందిగా శ్రీ మందపాటి నాగిరెడ్డి విద్యుత్ మంత్రి శ్రీమతి [illegible] సమర్పించిన మెమొరాండంలో డిమాండ్ చేశారు. విద్యుత్‌ను వెంటనే సరఫరా చేసేందుకు తక్షణ చర్య తీసుకుంటామని మంత్రి హామీయిచ్చారు.

సాగర్ ఆయకట్టు పెనాల్టీలు

ప్రభుత్వ పరిశీలన

హైదరాబాద్, ఏప్రిల్ 7

నాగార్జునసాగర్ కుడి కాలువ క్రింది ఆయకట్టు పెనాల్టీలకు సంబంధించి గుంటూరుజిల్లాకలెక్టర్ పంపిన్నప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ఆర్థిక మంత్రి శ్రీ భగవంతరావు నేడు శాసన సభలో తెలిపారు.

సావధాన తీర్మానానికి సమాధానమిస్తూ ఆయన పై విషయం చెప్పారు.

అక్రమంగా సాగుదల చేసిన వారిపై రు 67 లక్షల 36 వేలు పెనాల్టీ విధించడం జరిగిందని మంత్రి తెలిపారు.

రీలోకలైజేషన్ పూర్తయ్యే వరకూ, పెనాల్టీ వసూళ్ల నిలుపుదల చేయాలని శ్రీయుతులు మందపాటి నాగిరెడ్డి, శ్రీ ఆంజనేయశర్మ డిమాండ్ చేయగా, ఆ విషయాన్ని ప్రభుత్వం [illegible] పరిశీలిస్తుందని మంత్రి సమాధానమిచ్చారు.

శాసనసభ చర్చలపట్ల అటవీ మంత్రి నిష్క్రియాపరత్వం

హైదరాబాదు ఏప్రిల్ 8

జమీన్ రైతు పత్రికపై వచ్చిన సభా హక్కుల తీర్మానంపై నేటి ఉదయం శాసన సభలో సభ్యులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతుండగా, స్పీకరు శ్రీ రంగారెడ్డి అటవీశాఖ మంత్రి శ్రీ సాగి సూర్యనారాయణ రాజును పిలిచి, వారి అమూల్యమైన అభిప్రాయం తెలియజేయాలని కోరగా, మంత్రి 'ఏ విషయం మీద' అని ప్రశ్నించారు.

సభలో ముఖ్యమైన అంశంపై చర్చ జరుగుతూంటే ఏమి జరుగుతున్నదీ మీరు వినకపోతే ఎలా, అని స్పీకరు అన్నారు.

శ్రీ వీరప్ప (కాం, దుర్భిక్ష పరిస్థితులపై చర్చలో పాల్గొంటూ "అన్నమో రామచంద్రా" అనే నినాదం "మంచినీళ్లో రామచంద్రా" అనే నినాదంగా మారుతోందని అన్నారు.

ఒంగోలు జిల్లాలో ఐ. టి. ఐ. కేంద్రం

హైదరాబాద్, ఏప్రిల్ 8

ఒంగోలు జిల్లాలో పారిశ్రామిక శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పాలని ప్రభుత్వం తలపెట్టిందని, ఆ విషయం ప్రభుత్వ పరిశీలనలో వుందని నేడు రాష్ట్ర శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో తెలియచేయబడింది.

రు. 5లక్షల డాలరు పొందిన విమానం మళ్ళింపు దారు

సాల్ట్‌లేక్ సిటీ, ఏప్రిల్ 8

గత రాత్రి శాన్ ఫ్రాన్సిస్కో బలవంతంగా యునైటెడ్ ఏయిర్‌లైన్స్ విమానాన్ని దింపిన సాయుధ దొంగ ఐదులక్షల డాలర్లు, నాలుగు పారాచూట్లు పొంది విమానాన్ని వదిలివేశాడు.

వ్యాఖ్యలు-విమర్శలు

భారత గుత్త పత్రికల బానిస బుద్ధి!

—నిస్సైనికమండలంలో హానోయ్ నూతన పోరాట రంగం

—టైమ్స్ ఆఫ్ ఇండియా, ఏప్రిల్ 8

—హానోయ్ విజృంభణ: పెద్దయెత్తున అమెరికా విమానదాడులుప్రారంభం.

హిందూ. ఏప్రిల్ 7

—హానోయ్‌పై అమెరికా ప్రతీకార దాడులు

—ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 7

గత కొన్నిరోజులుగా వియత్నాం విముక్తి దళాలు విజృంభించి సైగాన్‌పై పురోగమిస్తున్న వార్తలకు భారత దేశంలోని గుత్త పెట్టుబడిదారీ పత్రికలు యిచ్చిన శీర్షికలు యివి!

ఈ శీర్షికలు చూస్తే ఉత్తర వియత్నాం సైన్యాలు ఏదో దురాక్రమణ యుద్ధాన్ని ప్రారంభించినట్లు, అందుకు ప్రతీకారంగా అమెరికా ఉత్తర వియత్నాంపై తిరిగి దాడులుసాగించుతున్నట్లు పాఠకులకుఅభిప్రాయం కలుగుతుంది. అంతేకాని దక్షిణ వియత్నామ్ విమోచన దళాలు సైగాన్ ప్రభుత్వ సైన్యాలపైనా. వాటికి వత్తుగానున్న అమెరికా సైనిక దళాలపైన జరుపుతున్న స్వాతంత్ర్య పోరాటంగా అనిపించదు.

అమెరికా సామ్రాజ్యవాదులు దేనినైతే మనసుపూర్తిగా మారేదుకాయగా చిత్రించదలిచారో దానినే భారతదేశం గుత్త పత్రికలు అంది పుచ్చుకొని భారత ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నాయి.

ఇది వియత్కాంగ్ దళాల విమోచన పోరాట విజృంభణ కాక, దక్షిణ వియత్నామ్‌పై ఉత్తర వియత్నామ్ అక్రమ దాడిగా చిత్రిస్తూ, ఆ సాకుతో అదే కంపై తమ సాగరిక నౌకా విమానికి దాడికి తిరిగి అమెరికా దిగింది, ఆదాడిని ప్రతీకార దాడిగా సమంజసమైన దాడిగా ప్రపంచాన్ని నమ్మించాలని అమెరికా చూస్తున్నది. భారత గుత్తపత్రికలు, అమెరికా సామ్రాజ్యవాదులు జరిపే ఈ నీచ ప్రచారాన్ని బుజానవేసుకొని భారత ప్రజలను అపోహలు కల్గించడానికి, తద్వారా అమెరికా సామ్రాజ్యవాదుల విజయరూపాన్ని మరుగు పరచడానికి యత్నిస్తున్నాయి. వియత్నామ్ జాతీయ విముక్తి పోరాటాన్ని వక్రంగా చిత్రించడానికి ప్రయత్నిస్తున్నాయి. అమెరికా సామ్రాజ్యవాదుల ప్రచారాన్ని పశ్చిమదేశాల వార్తా సంస్థల ప్రచారాన్ని కంఠంలో పోసిన తీర్థంవలె కళ్ళకద్దుకొని స్వీకరిస్తున్నాయి.

ఉత్తర వియత్నామ్‌పై అమెరికా వైమానిక దాడులను గురించి ఏప్రిల్ 7వ తేదీన పార్లమెంటులో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో స్వతంత్రపార్టీ సభ్యుడు శ్రీ మోహతా ఒక ప్రశ్న అడుగుతూ. వియత్నామ్ ప్రస్తుత యుద్ధ ప్రజ్వలనకు ఉత్తర వియత్నామ్ కూడా సమాన బాధ్యురాలు కాదా? అని అడిగాడు. విదేశాంగమంత్రి శ్రీ స్వర్ణసింగ్ దీనికి సమాధానమిస్తూ "ఉత్తర వియత్నాంచే జరుపబడుతున్నట్లు చెప్పే దాడి" గురించి భారత ప్రభుత్వానికి ఏమి తెలియదన్నారు. ఇది వియత్నాం భూభాగం తప్పితే, అమెరికా భూభాగం కాదని చెప్పి స్వతంత్రపార్టీ సభ్యునికి సరైన సమాధానం చెప్పారు.

10 వేల కిలో మీటర్ల దూరం నుండి అమెరికా సైనిక వైమానిక నౌకా దళాలు వియత్నామ్ గడ్డపై ఎందుకు కాలు పెట్టవలసివచ్చింది? ఒక దేశ భూ భాగంపై మరొక దేశ సైన్యాలు ఉండవలసిన అవసరం ఏమిటి? ఈ విధంగా వుండటాన్ని ఏమని పిలవాలి?

ఈ అన్ని ప్రశ్నలకు భారతదేశ గుత్త పత్రికలు ఎటువంటి సమాధానం యివ్వవు. అమెరికా జరుపుతున్నది దురాక్రమణ యుద్ధంగా చెప్పడానికి యీ పత్రికలకు నోరు రావటంలేదు.

రాజును మించిన రాజభక్తివలెను అన్న చందంగా భారతీయ గుత్తపత్రికలు తమ రక్త బంధువు అయిన అమెరికా సామ్రాజ్యవాదుల నిజస్వరూపాన్ని మరుగుపరచడానికే ఈ విధంగా వక్ర శీర్షికలు యిచ్చి వక్రభాష్యం చేయడానికి పూనుకుంటున్నాయి. సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తే బానిసబుద్ధిని, ప్రదర్శించుతున్నాయి"

బంగ్లా విముక్తి పోరాటాన్ని పాక్.-భారత్ పోరాటంగా చిత్రించడానికి అమెరికా ఏ విధంగా యత్నించిందో అదే విధంగా ఈనాడు వియత్నామ్ విముక్తి పోరాటాన్ని ఉత్తర దక్షిణ వియత్నామ్‌ల మధ్య పోరాటంగా చిత్రించడానికి అమెరికా సామ్రాజ్యవాదులు, పశ్చిమదేశాల వార్తాసంస్థలు ప్రయత్నిస్తున్నాయి,

ఉత్తరవియత్నామ్‌తో భారతదేశంతో పూర్తి దౌత్యసంబంధాలను కల్గివున్నది. అమెరికా ప్రారంభించిన దాడులను భారతదేశం ఖండించింది. వియత్నామ్ విమోచన దళాల విజయాలను భారత ప్రజలు హర్షిస్తున్నారు. కీలుబొమ్మ థియూ కూలిపోయే రోజు దగ్గర పడిందని సంతోషిస్తున్నారు.

కాని భారతీయ గుత్త పత్రికలు తమ సొమ్మేదో పోయినట్లు దక్షిణవియత్నాం కీలుబొమ్మ ప్రభుత్వానికి నలువైపుల నుండి "ప్రమాదం" ఏర్పడిందంటూ గాకి గోల పెడుతున్నాయి.

ఆలిండియా రేడియో కూడా కొన్ని ప్రసారాల" సైగాన్‌కు ప్రమాదం" ఏర్పడిందంటూ వియత్నామ్ విముక్తి పోరాటాన్ని వక్ర భాష్యం చేయడానికి యత్నించడం సిగ్గుచేటు,

భారత ప్రభుత్వం అనుసరించే విధానానికి విరుద్ధంగా అమెరికాను సమర్థించే ఇట్టి వైఖరి గుత్త పత్రికలు, ఆలిండియా రేడియో సైతం అనుసరించడం దారుణమైన నేరం, జాతీయ విద్రోహాకరం కూడా.

డి. యం. కె. ప్రభుత్వ భూ సంస్కరణ బిల్లు

అభివృద్ధి నిరోధకమైనదని శ్రీ కళ్యాణసుందరం విమర్శ

మదురై, ఏప్రిల్ 8

కుటుంబానికి 40 ప్రామాణిక ఎకరాలు పరిమితిని విధిస్తూ డి. యం. కె. ప్రవేశ పెట్టిన భూ సంస్కరణ బిల్లు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మొట్ట మొదటి భూ సంస్కరణల చట్టం కన్నా అభివృద్ధి నిరోధకమైనదని తమిళనాడు కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ కల్యాణసుందరం నేడు యిక్కడ విమర్శించారు.

ఈ నూతన బిల్లులో మైనర్లకు 15 ఎకరాలు కానుకగా యివ్వాలనివుందని ఆయన పత్రికల వారికి తెలిపారు.

భూపరిమితి చట్టం ప్రకారం మిగులు భూములను ప్రకటించని భూస్వాముల భూములు ఆక్రమించడానికి ప్రారంభించవలసిన ఉద్యమంపై ఈ నెల చివరివారంలో మన్నార్ గుడిలో జరిగే అఖిల భారత వ్యవసాయ కార్మిక మహాసభ నిర్ణయం చేస్తుందని ఆయన అన్నారు.

డి. యం. కె. ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఎవరు తెలిపిలేకుండా వినవస్తున్న పుకార్లను ప్రస్తావించగా అటువంటి అద్భుత కార్యాన్ని శ్రీమతి ఇందిరాగాంధీ కూడా చేయలేరని. డి. యం. కె. ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కమ్యూనిస్టుపార్టీ బద్ధవ్యతిరేకమని ఆయన అన్నారు.

ముజిబ్ తో అమెరికా దౌత్యాధిపతి భేటీ

ఢాకా, ఏప్రిల్ 8

బంగ్లాదేశ్ లోని అమెరికా రాయబార కార్యాలయాధిపతి స్పివాక్ బంగ్లా ప్రధాని ముజిబుర్ రహమాన్ ను కలుసుకొని, అధ్యక్షుడు నిక్సన్ సందేశాన్ని అందజేశారు.

అంతకుముందు స్పివాక్ బంగ్లాదేశ్ విదేశాంగమంత్రి అబ్దుస్ సమద్ ను కలుసుకున్నారు.

శాంతిసాధనకు కృషి చేసే నిమిత్తం అమెరికా బంగ్లాదేశ్ తమ సంబంధాలను మెరుగుపరుచుకోవడం అవసరమని నిక్సన్ తన సందేశంలో పేర్కొన్నారు.

బంగ్లాదేశ్ అభివృద్ధికి అమెరికా సహాయాన్ని కొనసాగించగలమని తెలిపారు.

రాయబార స్థాయిలో బంగ్లాదేశ్ తో దౌత్య సంబంధాలను ఏర్పరచుకోవాలని అమెరికా ప్రభుత్వం భావిస్తున్నదని నిక్సన్ తెలియజేశారు.

"దరిద్ర నిర్మూలన పథకం" సిద్ధమైందట

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

ఆరవ ప్రణాళిక అంతంనాటికి "పేదరికాన్ని నిర్మూలించే" వుద్దేశంతో ప్రణాళికా సంఘం స్థూలంగా ఒక కార్యక్రమాన్ని రూపొందించిందని, ప్రణాళికా మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం నేడిక్కడ చెప్పారు.

ప్రధాని శ్రీమతి గాంధి అధ్యక్షతన ప్రణాళికా సంఘం నిన్న సమావేశమైచర్చలు జరిపి దారిద్ర్యనిర్మూలన పథకాన్ని రూపొందించిందని, దానికింకా తుది మెరుగులు మాత్రమే దిద్దవలసివున్నదని ఆయన చెప్పారు.

"పేదరికాన్ని నిర్మూలించండి" అనే అంశంపై జరిగిన గోష్ఠిలో మాట్లాడుతూ ఆయన పై విషయం చెప్పారు.

అత్యవసర వస్తువుల ఉత్పత్తి పెంపుదల, ఉపాధికల్పనద్వారా కొనుగోలు శక్తిని అధికం చేయడం. అనే లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని "ఆపథకాన్ని" రూపొందించటం జరిగిందని శ్రీ సుబ్రహ్మణ్యం చెప్పారు.

లక్షలాదిమందికి ఉపాధి కల్పించేందుకు సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాన్ని రూపొందించ వలసిన అవసరం వున్నదని ఆయన అన్నారు.

తర్వాత ఉపరాష్ట్రపతి శ్రీ పథక్ కూడా గోష్ఠిలో మాట్లాడారు.

ప్రస్తుతం దేశంఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటే, ధరలస్థిరీకరణ, పన్ను ఎగవేతల నిరోధం, ఉపాధికల్పనకు ఉపయోగపడే విద్య, సత్వరమే భూ సంస్కరణల అమలు జరగాలని ఆయన అన్నారు.

దారిద్ర్యం వున్నచోటే దాని ప్రక్కనే నిరక్షరాస్యత, అనారోగ్యం, అజ్ఞానంకూడా వుంటాయని ఆయన అన్నారు.

కమ్యూనిస్టు నాయకులు శ్రీ ఇంద్రజిత్ గుప్తా, మాజీమంత్రి మురార్జీ దేశాయ్, డాక్టర్ బి. ఎన్. మెల్కోటే ప్రభృతులు కూడా గోష్ఠిలో ప్రసంగించారు.

మిజోరామ్ లో ఎన్నికల ప్రచారం

అయిజాల్, ఏప్రిల్ 8

ఏప్రిల్ 18న మొట్టమొదటిసారిగా పోలింగ్ జరిగే కొత్త కేంద్రపాలితప్రాంతం మిజోరామ్ లో ఇటీవలే ఎన్నికల ప్రచారం ప్రారంభమైంది

మొత్తం 30 శాసన సభా స్థానాలకు ఒక లోక్ సభ స్థానానికి ఏప్రిల్ 18న పోలింగ్ జరుగుతుంది.

ఒకప్పటి మిజో తిరుగుబాటు దార్లు ఇప్పుడు ఎన్నికల్లో ముమ్మరంగా పాల్గొంటుండడం విశేషం.

సలామ్ తోంబిసింగ్ ఎన్నిక

ఇంఫాల్, ఏప్రిల్ 8

మణిపూర్ శాసనసభనుంచి రాజ్యసభ స్థానానికి నిన్న జరిగిన ద్వైవార్షిక ఎన్నికల్లో మణిపూర్ పీపుల్స్ పార్టీ అభ్యర్థి శ్రీ సలాం తోంబిసింగ్ ఎన్నికయ్యారు.

ఆయనకు 32 ఓట్లు రాగా, ఆయనతో పోటీచేసి ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థికి 28 ఓట్లు వచ్చాయి.

ఆంధ్రప్రదేశ్ కు తుంగభద్ర నీటి విడుదల

మైసూరు ముఖ్యమంత్రి వివరణ

బెంగుళూరు, ఏప్రిల్ 8

తుంగభద్ర రిజర్వాయరు నుంచి 3500 క్యూసెక్కుల నీటిని ఆంధ్ర ప్రదేశ్ కు పంపేందుకు తమ ప్రభుత్వం స్వంతంగానే నిర్ణయం తీసుకున్నదని, అందులో "కేంద్రం పత్తిడి" ఏమాత్రం లేదని మైసూరు ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ్ అర్స్ నేడు శాసన సభలో చెప్పారు.

జనతాపక్ష. సిండికేట్ సభ్యులు ప్రతిపాదించిన వాయిదా తీర్మానానికి సమాధానమిస్తూ ఆయన పైవిషయం స్పష్టీకరించారు.

కేవలం సౌహార్ద దృష్టితోనే పై నిర్ణయం తీసుకున్నామని శ్రీ అర్స్ ప్రకటించారు.

వచ్చే జూన్ మాసంలో రిజర్వాయరులోని నీటిమట్టం పెరగవలసినంత ఎత్తుకు పెరగకపోతే, కుడికాలువలోని నీటిని ఆంధ్రకు పంపడం జరగదని, అంతే నీటిమట్టం పెరగవలసినంత ఎత్తుకు పెరిగేదాకా ఆంధ్ర ప్రదేశ్ కు నీటిని పంపడం ఆపివేస్తామని ఆయన వివరించారు.

మహిళా సమాజ్ భవనానికి గవర్నర్ ప్రారంభోత్సవం

ఒంగోలులో

ఒంగోలు, ఏప్రిల్ 8

రాష్ట్ర గవర్నర్ శ్రీ ఖండూభాయ్ దేశాయ్ ఒంగోలులో మహిళా సమాజ భవనానికి నేడు ప్రారంభోత్సవం చేశారు.

అనంతరం ఒంగోలు మున్సిపాలిటీ గవర్నర్ కు పౌరసన్మానం జరిపింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేయబడిన సభలో ఆయన ప్రసంగించారు.

సాయంత్రం 6 గంటలకు కొత్తపట్నం గ్రామంలో ఫిషర్ మెన్ కాలనీకి శంకుస్థాపన చేశారు. భూమిలేని 500 మంది పేదలకు ఆయన పట్టాలు ప్రదానం చేశారు.

సింగరాయకొండలోని గోల్డెన్ కంపెనీలోని మహిళాకార్మికులందరు జాతీయపొదుపు పథకంలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేయబడిన సభలో కూడా ఆయన పాల్గొన్నారు.

అనంతరం ఉలవపాడు సమితిలోని చినకమబల్లి గ్రామంలో హరిజన కాలనీకి ప్రారంభోత్సవం చేశారు.

జూన్ లో ఎ. ఐ. సి. సి. సమావేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

వచ్చే జూన్ నెల మొదటి వారంలో ఎ. ఐ. సి. సి. ఢిల్లీలో సమావేశం కావచ్చునని తెలుస్తున్నది.

ప్రధానంగా ఎన్నికలవాగ్దానాల, అమలు, పార్టీ నిర్మాణ సమస్యలపై సమావేశంలో చర్చలు జరుగుతాయని భావిస్తున్నారు.

మతకలహ వార్తల ప్రచురణ

సంపాదకులకు శ్రీ అచ్యుతమీనన్ విజ్ఞప్తి

తిరువనంతపురం, ఏప్రిల్ 8

మతకలహాలకు సంబంధించిన వార్తలను ప్రచురించే సందర్భంగా సంపాదకులు కొన్ని ప్రవర్తనా నిబంధనలను రూపొందించుకుంటే బాగుంటుందని కేరళ ముఖ్యమంత్రి శ్రీ అచ్యుత మీనన్ నేడిక్కడ కోరారు.

వార్తా పత్రికా సంపాదకుల సమావేశంలో ప్రసంగిస్తూ ఆయన పై విధంగా విజ్ఞప్తి చేశారు.

మత కలహాలకు సంబంధించిన వార్తలను ప్రచురించడంలో కేరళపత్రికలు చాలా నిగ్రహం పాటిస్తున్నాయని ఆయనఅన్నారు

సంపాదకులతో సంప్రదించిన అనంతరం ఆ విషయమై ముసాయిదా ప్రతిపాదను రూపొందించటం జరుగుతుందని శ్రీ అచ్యుత మీనన్ చెప్పారు.

ఆర్థిక మంత్రిపై సభాహక్కుల తీర్మానం

స్పీకర్ తిరస్కృతి

హైదరాబాద్, ఏప్రిల్ 8

రాష్ట్ర శాసన సభలో ఆర్థిక మంత్రి శ్రీ భగవంతరావుపై తీసుకవచ్చిన సభా హక్కుల తీర్మానాన్ని స్పీకర్ శ్రీ పి. రంగారెడ్డి తిరస్కరించారు.

ఇండిపెండెంట్ సభ్యుడు శ్రీ యస్. శ్రీనివాసులరెడ్డి ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు.

పొదుపు పేరుతో ప్రభుత్వ ఉద్యోగులను రిట్రెంచ్ చేయబోమని మంత్రి వాగ్దానం చేశారని, అయితే సాధారణ పరిపాలనశాఖ నుంచి కొంతమంది ఉద్యోగులను రిట్రెంచ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వును జారీ చేసిందని శ్రీ శ్రీనివాసులరెడ్డి తన తీర్మానంలో పేర్కొన్నారు.

రిట్రెంచ్ మెంట్ కు ప్రభుత్వం పూనుకోదని తాను స్థూలప్రాయంగా మాత్రమే చెప్పానని లిఖితంగా రిట్రెంచ్ మెంట్ ఉండబోదని తాను చెప్పలేదని మంత్రి అన్నారు.

మంత్రి ప్రసంగంలోని కొన్ని భాగాలను స్పీకర్ చదివి వినిపించి మంత్రి లిఖితమైన వాగ్దానమేమీ ఇవ్వలేదనిచెపుతూ తీర్మానాన్ని తిరస్కరించారు.

ఇరిగేషన్ మంత్రి శ్రీ నరసారెడ్డిపై వచ్చిన మరొక సభాహక్కుల తీర్మానాన్ని కూడా స్పీకర్ తిరస్కరించారు.

రాష్ట్ర దిగుమతి కార్పొరేషన్ వార్షిక నివేదిక

శాసనసభకు సమర్పణ

హైదరాబాద్, ఏప్రిల్ 8

నూతనంగా ఏర్పాటు చేయబడిన రాష్ట్ర దిగుమతి కార్పొరేషన్ వార్షిక నివేదికను మున్సిపల్ మంత్రి శ్రీ యం. మాణిక్ రావు నేడు రాష్ట్ర శాసనసభకు సమర్పించారు.

దిగుమతి చేసుకున్న ముడి పదార్థాలను, దేశవాళీ ముడిపదార్థాలను సక్రమంగాపంపిణీ చేయటం, చిన్నతరహా పరిశ్రమల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే బాధ్యతలను ఈ కార్పొరేషన్ నిర్వహిస్తుంది.

1971 ఆర్థిక సంవత్సరాంతానికి ఈ కార్పొరేషన్ రు. 15 లక్షలు పెట్టుబడి పెట్టింది. 1970 డిసెంబరు 14 వ తేదీన రు. 5 లక్షలు, 1971 మార్చి 31 వ తేదీన రు. 10 లక్షలు పెట్టుబడిగా రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ కు కేటాయించింది.

ఈకార్పొరేషన్ 16,93,000 రూపాయల చందనపు నూనెను, 63 వేల రూపాయల విలువచేసే చందనపు విత్తనాలను సోవియట్ కు ఎగుమతి చేసింది.

150 ఉద్యోగాలకోసం 20,000 మంది అభ్యర్థులు

విశాఖపట్నం, ఏప్రిల్ 8

తూర్పు రైల్వేలోని 150 ఉద్యోగాల కోసం 20 వేల మంది అభ్యర్థులు నేడు విశాఖపట్నంలో పరీక్ష వ్రాస్తున్నారు.

నిరుద్యోగులైన ఈ నిరుద్యోగులంతా ఈ ఉద్యోగంకోసం ఎలాగో నానా కంటాలుపడి ఖర్చుపెట్టే డబ్బు కొన్ని సంస్థలకు ఆదాయం తెచ్చిపెడుతుంది. ఈ నిరుద్యోగులు మొత్తంగా పెట్టేఖర్చు లక్ష రూపాయలుండవచ్చని అంచనా.

ఒక్కొక్కరి దరఖాస్తుకు రెండు రూపాయల చొప్పున వేసుకుంటే రైల్వేలకు రు. 40 వేల ఆదాయం వస్తుంది. ఇది గాక పరీక్ష కేంద్రాలకు వెళ్ళే అభ్యర్థుల రానూ పోనూ ఛార్జీలకు చాలా డబ్బు అవుతుంది, ఇది కూడా రైల్వేలకు "ప్లస్" అవుతుంది. దాంతో పాటే బస్సులకు కూడా కొంత ఆదాయం వుంటుంది.

పోతే, అభ్యర్థులంతా దరఖాస్తులను రిజిష్టర్ పోస్టులో పంపినందువల్ల తంతి తపాలాశాఖకు కనీసం రు. 25 వేలయినా ఆదాయం వచ్చి ఉంటుంది.

దరఖాస్తుదార్లంతా పాస్ పోర్టు సైజు ఫోటోలు పంపారు. దీనివల్ల రాష్ట్రంలోని ఫోటో స్టుడియోలకు రు. 30 వేల ఆదాయం వచ్చి ఉంటుంది.

కీటింగ్ చే 35 సార్లు స్వంత విమానంలో ప్రయాణాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

భారత్ లో అమెరికా రాయబారి కీటింగ్ తన స్వంత విమానంలో మన దేశంలో పర్యటనలు జరిపేందుకు గత 3 సంవత్సరాల్లో 35 సార్లు అనుమతించారు.

లోక్ సభలో నిన్న విదేశీ వ్యవహారాల డిప్యూటీమంత్రి ఈ విషయం తెలిపారు. శ్రీ జ్యోతిర్మయిబాసు ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

ప్రతిసారి అనుమతించే ముందు ఆయా పరిస్థితులను పరిశీలించడం జరిగిందని మంత్రి చెప్పుకున్నారు.

కీటింగ్ ప్రయాణించే విమానంపై అమెరికా సైనిక దళాల గుర్తు ఉన్నాయి. దానిలో రహస్యకార్యకలాపాలకు వినియోగపడే అధునాతనమయిన యంత్ర పరికరాలుంటాయి ఆ విమానం లోపలికి వెళ్ళడానికి కూడా భారత వైమానిక అధికార్లకు హక్కు లేదు.

సోవియట్, హంగరీలతో బంగ్లాదేశ్ వాణిజ్య ఒప్పందం

కలకత్తా, ఏప్రిల్ 8

సోవియట్ యూనియన్, హంగరీలు, బంగ్లాదేశ్ తో 2 సంవత్సరాల వాణిజ్య ఒప్పందాన్ని చేసుకున్నాయని, బంగ్లాదేశ్ లో సంయుక్త పరిశ్రమలు నెలకొల్పేందుకు గల అవకాశాలను పరిశీలించేందుకు నిపుణుల బృందాలు రానున్నాయని బంగ్లాదేశ్ వాణిజ్య మంత్రి యం. ఆర్. సిద్దికి నేడిక్కడ చెప్పారు.

మాస్కో నుంచి ఢాకా వెళుతూ ఆయన నేడిక్కడకు వచ్చారు. ఈ ఒప్పందం ప్రకారం సోవియట్, బంగ్లాదేశ్ ల మధ్య మొదటి సంవత్సరం వాణిజ్యం రు. 10 కోట్లు వరకు వుంటుందని కలకత్తా విమానాశ్రయంలో ఆయన పత్రికలవారికి చెప్పారు. హెలికాప్టర్లు, సరుకులు రవాణా చేసే నౌకలను సోవియట్, బంగ్లాదేశ్ కు సరఫరా చేస్తుంది

బంగ్లాదేశ్ కు విమానాలు, యంత్రాలు, ఖనిజ తైలాలు సోవియట్ సరఫరాచేస్తుంది. జనుము, తోళ్ళు బంగ్లాదేశ్ నుంచి సోవియట్ కొనుగోలుచేస్తుంది, హంగరీ కూడా బస్సులను, యంత్రాలను బంగ్లాదేశ్ కు సరఫరా చేస్తుంది, జనుము, తోళ్ళు బంగ్లాదేశ్ నుంచి హంగరీ కొనుగోలు చేస్తుంది.

విశాఖ రేవుకార్మికుల సమ్మె విరమణ

శాసన సభలో ప్రస్తావన

హైదరాబాద్, ఏప్రిల్ 9

సమ్మెను ఆపడానికి విశాఖ పోర్టుట్రస్టు అధికారులు, కార్మికసంఘ నాయకులు చర్చలు జరుపుతున్నారని ముఖ్యమంత్రి శ్రీ పి.వి. నరసింహారావు నిన్న సాయంత్రం శాసనసభలో తెల్పారు.

కమ్యూనిస్టుపక్ష సభ్యులు శ్రీ వి. సత్యానిరావు ప్రవేశపెట్టిన తీర్మానానికి సమాధానమిస్తూ ఆయన పై విషయం తెలిపారు.

కార్మికులపై కేంద్ర భద్రతా దళాలు దాడిచేసిన కారణంగా కార్మికులు సమ్మె జరిపిన విషయం పాఠకులకు తెలిసిందే. రేవు కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కామరాజు ఈ నెల 5 వ తేదీన నిరాహారదీక్ష విరమించారు.

కార్మికులపై చెయ్యి చేసుకున్నందుకు భద్రతా దళాలకు చెందిన నలుగురిని సస్పెండ్ చేసినట్లు తెలుస్తున్నదని ముఖ్యమంత్రి అన్నారు.

మూడవ దేశం మధ్యవర్తిత్వం అంగీకరించబోము

బంగ్లాదేశ్ ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

మూడవ దేశం మధ్యవర్తిత్వంలో పాక్ తో సంప్రదింపులు జరిపేదిలేదని బంగ్లాదేశ్ ప్రభుత్వం నేడు స్పష్టీకరించింది.

బంగ్లాదేశ్ వాస్తవాన్ని పాకిస్తాన్ గుర్తించనంతవరకు దానితో సంప్రదించే ప్రశ్నే ఉదయించదని ఢాకాలోని విదేశ వ్యవహారాల కార్యాలయం ప్రకటించింది.

బొంబాయిలో ప్రదర్శన

వివిధ వుద్యోగ సంఘాలచే

బొంబాయి, ఏప్రిల్ 8

ఈ రోజు బొంబాయిలో శాసన సభ ఎదుట హోటళ్ళకు చెందిన వంట మనుషులు, నర్సులు, పూరి గుడిసె వాసులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు గొప్ప ప్రదర్శన చేశారు. వారంతా, పట్టణంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపు చేసుకుంటూవచ్చి శాసనసభకుకొన్ని వందల మీటర్ల దూరంలో ప్రదర్శన చేశారు. తమ ఇబ్బందులు తొలగించవలసిందిగా నినాదాలిచ్చారు.

అక్కడ వారిని పోలీసులు అటకాయించగా కొంతమంది ప్రతినిధులు శాసనసభలోకి వెళ్ళారు.

ఈ ప్రదర్శన రాష్ట్రఉద్యోగుల కాన్ఫెడరేషన్ నాయకత్వాన జరిగింది.

సోవియట్ మహిళా ప్రతినిధివర్గం ఢాకా ఆగమనం

ఢాకా, ఏప్రిల్ 8

సోవియట్ యూనియన్ కు చెందిన ఒక మహిళా ప్రతినిధివర్గం యీ రోజు ఢాకా చేరుకుంది. ఇందులో ముగ్గురు మహిళ లున్నారు.

బంగ్లాదేశ్ మహిళా పరిషత్ ఆహ్వానంపై యీ ప్రతినిధివర్గం వచ్చింది.

సమ్మెలపై నిషేధం విధించే యోచన ప్రభుత్వానికి లేదు

— శ్రీ ఖాడిల్కర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

సమ్మెలపై నిషేధం విధించాలన్న ప్రతిపాదన ప్రభుత్వానికి లేదని కేంద్ర కార్మిక మంత్రి శ్రీ ఆర్. కె. ఖాడిల్కర్ నిర్ద్వంద్వంగా నేడు లోక్ సభలో హామీ యిచ్చారు.

నూతన పారిశ్రామిక సంబంధాల, కార్మిక విధానాన్ని అనుసరించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చిన ఒక అనధికార తీర్మానంపై జరిగిన చర్చలో పాల్గొంటూ ఆయన పై విధంగా అన్నారు. సమ్మెచేయటమనేది కార్మికుల ప్రాథమిక హక్కు అనీ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సమ్మెలపై నిషేధం విధించటం అనూహ్యమని ఆయన అన్నారు.

కమ్యూనిస్టునాయకుడు శ్రీ ఇంద్రజిత్ గుప్తా ప్రవేశ పెట్టిన తీర్మానంపై రెండుగంటలపాటు చర్చలు జరిగిన అనంతరం కార్మిక మంత్రి శ్రీ ఖాడిల్కర్ ఇచ్చిన హామీతో ఈ తీర్మానాన్ని శ్రీ గుప్తా ఉపసంహరించు కున్నారు

కేంద్ర కార్మిక సంఘాలయిన ఎ.ఐ.టి.యు.సి., ఐ.యన్.టి.యు.సి., హెచ్.యం.యస్.లు ఒక ఒప్పందానికి వచ్చిన అనంతరం పారిశ్రామిక సంబంధాలను మెరుగుపరచేందుకు ప్రభుత్వంసమగ్రమైన నూతన శాసనాన్ని తీసుకవస్తుందని శ్రీ ఖాడిల్కర్ హామీ ఇవ్వటంతో శ్రీ ఇంద్రజిత్ గుప్తా తన తీర్మానాన్ని ఉపసంహరించుకున్నారు.

ఈ మూడు కేంద్ర కార్మిక సంఘాలు ఇంకా ఒక ఒప్పందానికి రాలేదని శ్రీ ఖాడిల్కర్ అన్నారు.

సభ్యత్వంపై వివిధ యూనియన్లు చేసే వాదనలను బ్యాలెట్ ద్వారాగాని వెరిఫికేషన్ ద్వారాగాని నిర్ణయించాలని పై మూడు యూనియన్లు గతంలో ఒక ఒప్పందానికి వచ్చాయి. అయితే దానినుంచి ఉపసంహరించుకుంటున్నట్లు హెచ్.యం.యస్. తనకు తెలిపిందన్నారు,

ఈ ఒప్పందంనుంచి హెచ్. యం. యస్. వైదొలగినట్లు బహిరంగపరచటం నా అభిమతం కాదు. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించిన శ్రీ ఇంద్రజిత్ గుప్తా ఈ ఒప్పందం ఇంకా అమలులో వుందని భావిస్తున్నందువల్ల నాపై విషయం తెలిపాను అని శ్రీ ఖాడిల్కర్ అన్నారు.

ఈ మూడు సంఘాలు త్వరలో ఒక పరిమితమైన ఒప్పందానికైనా వస్తాయన్న ఆశాభావాన్ని ఆయన వెలిబుచ్చారు. ఈ సంఘాలు ఒక ఒప్పందానికి వచ్చిన అనంతరం పారిశ్రామిక సంబంధాలను నూతన దశకు చేర్చేందుకు ప్రభుత్వం ఒక శాసనం తీసుకవస్తుందన్నారు.

ఇంద్రజిత్ గుప్తా ప్రవేశ పెట్టిన తీర్మానంలో క్రింది విధంగా పేర్కొన్నారు.

పారిశ్రామిక స్తంభనను అధిగమించేందుకు, స్వయం సమృద్ధిని సాధించేందుకు, కార్మిక వర్గానికి సామాజిక న్యాయాన్ని విస్తరింప జేసేందుకుగాను ట్రేడ్ యూనియన్ గుర్తింపు, హక్కుల రక్షణకు మూడవ పక్షం లేకుండా సమిష్టి సంప్రదింపులు జరిపేందుకు వీలు కల్పిస్తూ నూతన పారిశ్రామిక సంబంధాలు, కార్మిక విధానాన్ని ప్రభుత్వం అనుసరించాలి.

అమెరికాతో మామూలు సంబంధాలు

శ్రీ స్వరణ్ సింగ్ వివరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

అమెరికా ప్రతినిధి ప్రకటనను ప్రభుత్వం చూసిందని అయితే భారత్, అమెరికాల మధ్య మామూలు సంబంధాల ఏర్పాటుకు అవి మరింత నిర్దిష్టంగా వుండాలని యీరోజు రాజ్యసభలో విదేశాంగమంత్రి శ్రీ స్వరణ్ సింగ్ అన్నారు.

రాజ్యసభలో సభ్యుల ప్రశ్నకు సమాధానమిస్తూ 1966 లో కన్నా 1971 లో అమెరికా వైఖరి మరింత స్పష్టంగా పాకిస్తాన్ కు అనుకూలంగా వున్నదని శ్రీ స్వరణ్ సింగ్ అన్నారు.

ప్రత్యక్షంగాసాధ్యం కానట్లయితేమరోదేశం ద్వారా పాకిస్తాన్ కు ఆయుధాలు పంపేందుకు అమెరికా ఏర్పాట్లు చేసిందనే వార్తలు ప్రభుత్వానికి అందాయన్నారు.

పాక్ లోని బెంగాలీ మహిళలను రహస్య ప్రాంతాలకు తరలింపు

కలకత్తా, ఏప్రిల్ 8

పాకిస్తాన్ లోని బెంగాలీ మహిళలను గుర్తు తెలియని ప్రాంతాలకు తరలించి వుంచుతున్నారని బంగ్లాదేశ్ రేడియో నేడు తెలియ చేసింది.

పాకిస్తాన్ లోని బెంగాలీలను నిర్బంధ శిబిరాలలో వుంచుతున్నారని, వారికితగినంత ఆహారం, మంచినీటిని సరఫరా చేయటం లేదని ఆ రేడియో పేర్కొంది.

2822,04,22,820 రూపాయల వీలునామా

లండన్, ఏప్రిల్ 8

బ్రిటన్ లో కన్సర్వేటివ్ పార్టీ నాయకుడు ఒకప్పుడు విదేశాంగ మంత్రిగా పని చేసిన శాలిస్బరీ 11,88,000 పౌండ్ల (2822 కోట్ల 4 లక్షల 22 వేల 820 రూపాయలు) ఆస్తిని తన బంధువులకు, వారసులకు వదిలారు.

గత ఫిబ్రవరిలో మరణించే ముందు ఆయన రాసిన వీలునామాను నేడు చూడగా ఈ విషయం తెలిసింది. శాలిస్బరీ వయస్సు 78 సంవత్సరాలు, ఆయన కుటుంబానికి చెందిన అపారమయిన సంపదను వారసుల కోసం ట్రస్టులో ఉంచారు.

చలసాని యువజన సంఘం కార్యాలయం హనుమాన్ పేటలో

విజయవాడ, ఏప్రిల్ 8

విజయవాడలోని హనుమాన్ పేటలో నేటి ఉదయం 11 గంటలకు చలసాని యువజన సంఘ కార్యాలయానికి పట్టణ కమ్యూనిస్టు నాయకులు శ్రీ వెల్లంకి సుబ్బారావు ప్రారంభోత్సవం చేశారు.

ఆ తరువాత చలసాని చౌక్ ను ప్రారంభోత్సవం చేస్తూ అమరజీవి చలసాని వెంకటరత్నం జీవితచరిత్రను శ్రీ సుబ్బారావు వివరించారు.

ఈ సందర్భంగా జరిగిన సభకు శ్రీ టి. అప్పారావు అధ్యక్షత వహించారు.

చలసాని యువజన సంఘం అధ్యక్షులుగా శ్రీ బి. వెంకటరావు, కార్యదర్శిగా శ్రీ జి నేతాజీ సహాయ కార్యదర్శిగా శ్రీ జి. శ్యామలరావు, కోశాధికారిగా శ్రీ టి. వెంకటరత్నం, మరో 9 మంది కమిటీ సభ్యులను సమావేశం ఎన్నుకున్నది.

ముస్లిమ్ లీగ్ తో భుట్టో ఒప్పందం

పెషావర్, ఏప్రిల్ 8

పాక్ జాతీయ అసెంబ్లీలో సహకారం విషయమై నేషనల్ అవామీ పార్టీ, జమాయత్ ఇస్లామిపార్టీలలో ఒకవైపు చర్చలు జరుపుతూనే, వాయవ్య సరిహద్దు ప్రాంతంలో నేషనల్ అవామీపార్టీకి వ్యతిరేకంగా మిశ్రమ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ముస్లిమ్ లీగ్ తో అధ్యక్షుడు భుట్టో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు.

వాయవ్య సరిహద్దు ప్రాంతంలోని మొత్తం 42 సీట్లకుగానూ 22 సీట్లను కలిగి వున్న నేషనల్ అవామీపార్టీకి వ్యతిరేకంగా ముస్లిమ్ లీగ్ తో భుట్టో ఈ ఒప్పందం చేసుకున్నారు. పీపుల్స్ పార్టీ, ముస్లిమ్ లీగ్ లకు కలిసి ఇక్కడ 10 సీట్లు మాత్రమే వున్నవి.

వాయవ్య సరిహద్దు ప్రాంతంలో భుట్టో పీపుల్స్ పార్టీ, ముస్లింలీగ్ కు మద్దతునిస్తుంది. దీనికిబదులుగా జాతీయ అసెంబ్లీలో 7 ఓట్లు కలిగివున్న ముస్లిమ్ లీగ్ భుట్టోకు మద్దతు నిస్తుంది.

బ్యాంకు ఉద్యోగుల ఆందోళన

ఒంగోలు, ఏప్రిల్ 8

ఆంధ్ర ప్రదేశ్ బ్యాంక్ ఫెడరేషన్ ఆదేశానుసారం యీనెల 4 వ తేదీన మేనేజిమెంటు మొండివైఖరిని ఖండిస్తూ ఒంగోలు బ్యాంకు ఉద్యోగులందరూ ఆంధ్ర బ్యాంకు ముందు నినాదాలు చేశారు. ఆంధ్ర బ్యాంక్ యూనియన్ మెంబర్లందరూ గత నెల 8 వ తేదీ నుండి సమ్మె చేయుచున్నారు.

శింగరాయకొండ

గత నెల 8 వ తేదీ నుండి శింగరాయకొండలోని ఆంధ్ర బ్యాంకు ఉద్యోగులు మరియు బ్యాంకు ఆఫీసరు యీ నెల 2 వ తేదీ వరకు సమ్మెలో పాల్గొన్నారు. 3 వ తేదీన గుంటూరు డివిజనల్ ఆఫీసరు శింగరాయకొండ వచ్చి ఏజెంటు సుబ్బయ్యతో రహస్య మంతనాలు జరిపి, ఉద్యోగులను పనిలో చేరమని, లేని యెడల ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరించారు. అందువలన బ్యాంకు సిబ్బంది భయపడి పనిలో ప్రవేశించారు. జి. రంగారావు అనే గుమాస్తా మాత్రం ఆఫీసరు బెదిరింపులకులొంగక పనికి హాజరు కానందున పని నుండి సస్పెండ్ చేసినారు. ఈ విధంగా గుంటూరు డివిజనల్ మేనేజరు పనిగట్టుకొని ఉద్యోగుల ఐక్యతను, సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి తీవ్ర కృషి చేయుచున్నారు.

ప్రాణాలు తీస్తున్న పరీక్షలు

బెంగళూరు, ఏప్రిల్ 8

పదే పదే పరీక్షలు తప్పడంవల్ల నిరాశా నిస్పృహలకు లోనై ఇరువురు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న దుర్ఘటన నేడిక్కడ తెలియవచ్చింది.

రెండవ సంవత్సరం ఎం. బి. బి. ఎస్ పరీక్ష నాలుగు సార్లు తప్పిన 27 ఏళ్ళ అమ్మాయి, పి. యు. సి. పరీక్ష రెండు సార్లు తప్పిన 17 ఏళ్ళ అమ్మాయి ఆత్మహత్య చేసుకున్నారు.

వారు విషం తీసుకుని మరణించారని తెలుస్తున్నది

"నిరాశ నిస్పృహల" మూలంగా తాము ఆత్మహత్య చేసుకుంటున్నామని 17 ఏళ్ళ అమ్మాయి చనిపోవడానికిముందు ఉత్తరంరాసి పెట్టింది.

భూమి శిస్తు వసూళ్ళ నిలిపివేతకు తిరస్కృతి

రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రి ప్రకటన

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, ఏప్రిల్ 8

రాష్ట్రంలో తీవ్రమైన కరువు పరిస్థితి వున్న దృష్ట్యా రైతులనుండి భూమిశిస్తు ఇతర రుణాల వసూళ్ళను నిలుపుచేస్తూ ఉత్తరువుల నివ్వాలని పలువురు సభ్యులు చేసిన డిమాండును ముఖ్యమంత్రి శ్రీ నరసింహారావు నేడు శాసనసభలో తిరస్కరించారు.

రాష్ట్రంలోని కరువు పరిస్థితి నీటి ఎద్దడి గురించి 6 గంటలపాటు జరిగిన చర్చకు సమాధానమిస్తూ ఆయన పైవిధంగాఅన్నారు. భూమిశిస్తు, ఇతర రుణాలను వసూలుచేసే సమయంలో నిర్బంధ చర్యలు చేపట్టబోమని ఆయన అన్నారు. రుణాలు వసూళ్ళకై రైతులను వత్తిడి చేయవద్దని ఇవ్వగలిగిన వారివద్దనుంచి మాత్రమే వసూలుచేయవలసిందిగాను జిల్లాకలెక్టర్లకుసూచన లిచ్చినట్లు ఆయన తెలిపారు.

వసూళ్ళపై నిషేధం విధించాలని శ్రీయుతులు ఫి. శ్రీకృష్ణ, రజబ్ అలీ, డి. వెంకటేశం డిమాండ్ చేశారు. కనీసం వంద రూపాయలు వరకు శిస్తు చెల్లించవలసిన రైతులనుండి వసూళ్ళనిలుపుచేయవలసిందిగా శ్రీ రజబ్ ఆలీ సూచించారు అయితే ముఖ్యమంత్రి ఈ సూచననుకూడా తిరస్కరించారు.

అవసరమైనచోట్ల శిస్తురెమిషన్ ఇవ్వగలమని శ్రీ నరసింహారావు చెప్పారు. సభ్యులు లేవనెత్తిన సమస్య లన్నిటికీ సమాధానం ఇవ్వటం సాధ్యంకాదని. కొన్ని సమాధానాలు పోస్టుద్వారా పంపుతామని ఆయన తెలిపారు.

రాష్ట్రంలో 6 శాతం ప్రజానీకం కరువు పాలు గురయ్యారని. ప్రభుత్వం 13 వేల కేంద్రాలలో కరువుపనులు చేపట్టటం జరిగిందని అన్నారు.

1971 డిసెంబరులో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రు. 19 కోట్లు కరువుపనులకు కేటాయించటం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరంజనవరినుండి మార్చివరకుజరిపే సహాయకచర్యలకై కేంద్రం మరో రు. 4కోట్లు యిచ్చేందుకు అంగీకరించిందన్నారు.

నీటి సౌకర్యంకోసం ప్రభుత్వం 38 వేల బావులుతవ్వించిందని, కానీ అందులో చాలా బావులు ఎండిపోయాయని అన్నారు. అందువల్ల త్వరలోనే రు. 65 లక్షలతో విదేశీ రిగ్గులు కొనాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.

శ్రీ ఉపేందర్ నిరాహారదీక్ష

బదిలీఫిల్లర్ల నాయకులు

గోదావరిఖని, ఏప్రిల్ 7

బదిలీ ఫిల్లర్ల యూనియన్ నాయకులు శ్రీ ఉపేందర్, ఏజెంటు కార్యాలయం ముందు రిలే నిరాహారదీక్షను ప్రారంభించారు.

ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అనారోగ్య కారణాలవల్ల సెలవుపెట్టినవారికి సిక్ లీవు వేతనం చెల్లించాలని కోరుతూ ఈ నిరాహారదీక్ష ప్రారంభమైంది.

ఆక్రమిత అరబ్ ప్రాంతాలనుండి వెనక్కు వెళ్ళేది లేదు

గోల్డామీర్

టెల్ అవీవ్, ఏప్రిల్ 8

"అరబ్ - ఇజ్రాయెల్ ఒప్పందం జరిగినప్పటికీ జెరూసలెం గోలాన్ పర్వతపంక్తి గాజా ప్రాంతంగాని అకాబా జలసంధికి దారితీసే షార్మ్-ఎల్-షేక్ నుండిగాని "ఇజ్రాయిల్ ఉపసంహరించుకోబోదని ప్రధాని శ్రీమతి గోల్డామీర్ గతరాత్రి రేడియోలో ప్రసంగిస్తూ చెప్పారు.

ఈజిప్టు నాయకులు తమతో ఒప్పందం చేసుకుంటే సినాయ్ లో అత్యధిక ప్రాంతం నుండి మాత్రం ఇజ్రాయిల్ ఉపసంహరించు కుంటుందని ఆమె అన్నారు.

"మమ్మల్ని రక్షించుకోవడానికి తగిన సరిహద్దులు పొందడం మాకు అవసరం" అన్నారామె. ఆరురోజుల యుద్ధానికి ముందున్న ప్రాంతాలనుండి యథాస్థానాలకు ఉపసంహరించుకునే సమస్యే లేదని ఎప్పటి మాదిరిగానే ఆమె చెప్పారు

బంగ్లాదేశ్ కు 12.5 లక్షలటన్నుల ఆహార పదార్థాలు

ఢాకా, ఏప్రిల్ 8

వచ్చే నాలుగు నెలలలో వివిధ దేశాల నుంచి 12.5 లక్షల టన్నుల ఆహార పదార్థాలు బంగ్లాదేశ్ కు చేరనున్నట్లు అంచనా వేసుకుంటున్నదని అధికార ప్రతినిధి ఒకరు నేడిక్కడ చెప్పారు.

భారత్, సోవియట్ యూనియన్ల నుండి ప్రధానంగా ఆహార పదార్థాలు రానున్నాయి.

వచ్చే ఆగస్టు వరకు తమ ప్రభుత్వం నెలకు 2.5 లక్షలటన్నుల ఆహారపదార్థాలను విడుదల చేస్తుందని ఆ ప్రతినిధి తెలిపారు.

ఖాద్యతైలాలు, వ్యాపార, పారిశ్రామిక సంబంధమైన దిగుమతులు కూడా బంగ్లాదేశ్ కు రానున్నాయని ఆయన తెలిపారు.

"సమగ్ర జాతీయ నీటి గ్రిడ్"

ఆగస్టులో పరిశీలన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

'సమగ్ర జాతీయ నీటి గ్రిడ్'ను ఏర్పాటు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించేందుకు ఆగస్టు నెలలో ప్రయత్నాలు ప్రారంభమవుతాయి.

పోయిననెలలో భారత్ లో పర్యటించిన ఐక్యరాజ్య సమితి నిపుణుల కమిటీ నీటిగ్రిడ్ ఏర్పాటు విషయమై త్వరలో తన నివేదిక సమర్పిస్తుందని అధికార వర్గాలద్వారా తెలుస్తున్నది.

ఆరోగ్యమే మహాభాగ్యము

★ భావి భారత పౌరులైన మీ బిడ్డల ఆరోగ్యమే మీకు ప్రధానం.
★ ఆరోగ్య రక్షణకు వలయు నమ్మకమైన పాత బియ్యం
వడ్లు, నూకలు, మట్టిగడ్డలు వగైరా లేకుండా పరిశుభ్రముగా బాగుచేయబడినవి మా వద్ద లభించును.
★ మీకు బియ్యం కావలసినపుడు 73704 వ నెంబరుకు ఫోన్ చేసిన వెంటనే విజయవాడ పరిసర ప్రాంతములలో ఎచ్చటికైననూ ఆటో రిక్షాలో స్వల్ప చార్జీలతో హోమ్ డెలివరీ చేయగలవారము.

ప్రొప్రయిటర్:
శ్రీ విజయ రైస్ కంపెనీ, పొట్టి సత్యనారాయణ,
గవర్నరుపేట, విజయవాడ-2.

ANDHRA UNIVERSITY

REVISED NOTIFICATION

It is here by notified that the examinations noted below will commence on the dates mentioned against each.

All candidates who have applied for admission to the Examinations should proceed to their respective centres three days before the commencement of the Examinations and obtain their Hall Tickets in person from the Chief Superintendent of the Centre concerned producing proper Indentification certificates etc.

M.A. and M.Com. Final	15th May, 1972
M.A. and M.Com. (Previous)	26th June, 1972
Law, M.B.A., and Diploma in Co-operation and Rural Studies	5th June, 1972

University Office,
WALTAIR
Date : 1-4-1972

Ch. Sriramamurthy,
Controller of Examinations.

నదీ జలాలపై శాశ్వత సంయుక్తసంఘం ఏర్పాటు

భారత్ - బంగ్లాదేశ్‌ల నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

నదీ జలాలపై శాశ్వత సంయుక్తసంఘం ఏర్పాటు చేసుకోవాలని భారత్, బంగ్లాదేశ్‌లు నిర్ణయించుకున్నాయి.

ఈ సంఘంలో ఉభయ దేశాలకు చెందిన నిపుణులు ఉంటారు.

రెండు దేశాలకు చెందిన ఉమ్మడి నదీ వ్యవస్థపై సమగ్రసర్వే జరిపి వరద నిరోధక ప్రాజెక్టుల నిర్మాణానికి యీ సంఘం సూచన లిస్తుంది.

ఇరిగేషన్ విద్యుత్ మంత్రిత్వ శాఖ 1971-72 సంవత్సరానికి సమర్పించిన అనుబంధ నివేదికలో ఈ విషయం వెల్లడించబడింది.

వేలం ప్రకటన

శ్రీ ఆత్మకూరి వెంకటసుబ్బారావు తాలూకు క్రాంతి కార్పొరేషన్ తాలూకు చెప్పులు వగైరా పాదరక్షలు, లెదర్ సూట్ కేసులు, ఇతర ఫాన్సీ సామానులు వగైరాలను ది 12—4—1972న బుధవారం 10 గంటలకు మా బాకీ రాబట్టుకొనటకుగాను గాంధీనగరంలోని నర్రావారి వీధిలో క్రాంతి కార్పొరేషన్ దుకాణము వద్ద బహిరంగంగా వేలం వేయబడును. ఎట్టి కారణములు ఇవ్వకుండానే అట్టి పాటను నిరాకరించే హక్కున్నూ, వేలం వాయిదా వేయు హక్కున్నూ బ్యాంకు వారికి గలదు.

విజయవాడ,
8—4—72

ఏజంట్,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నరుపేట.

విజయవాడ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ కోర్సు రద్దు చేయబోమని మంత్రి ప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 8

విజయవాడ యస్. ఆర్. ఆర్. అండ్ సి. వి. ఆర్. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ కోర్సును రద్దుచేసే ప్రతిపాదన లేదని ముఖ్యమంత్రి తరఫున విద్యా మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి నేడు శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు.

శ్రీ జోసెఫ్ ప్రశ్నకు సమాధానమిస్తూ, అన్ని కాలేజీలతోపాటు యస్. ఆర్. ఆర్. అండ్ సి. వి. ఆర్. కళాశాలలో కూడా ప్రీ యూనివర్శిటీ కోర్సు రద్దు చేసిన విషయం ఆయన తెలిపారు.

యూనివర్శిటీస్థాయి గ్రంథాల ఉత్పత్తికి తెలుగు అకాడమీకి ఇంతవరకూ రు. 5 లక్షల 60 వేలు మంజూరు చేసిందని శ్రీ భుజంగరావుకు మంత్రి శ్రీరామమూర్తి తెలిపారు. ఇంటర్మీడియట్ కోర్సుకు 48 పుస్తకాలు అవసరం. మూడు డిగ్రీకోర్సుల మొదటి సంవత్సరానికి కావలసిన 48 పుస్తకాలు అచ్చువేయిస్తామన్నారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అరబ్ ప్రజాపోరాటానికి తోడ్పాటు

"అల్ గొమరియా"కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ముజిబ్ స్పష్టీకరణ

కైరో, ఏప్రిల్ 7

బంగ్లాదేశ్ పట్ల అరబ్ దేశాల వైఖరిని ప్రధాని ముజిబుర్ రహ్మాన్ తీవ్రంగా విమర్శించారు.

ఈజిప్ట్ పత్రిక "అల్ గొమరియా"కు చెందిన జర్నలిస్టు మహమ్మద్ ఓవాకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

అరబ్ దేశాల వైఖరి ఎలా ఉన్నా, అమెరికన్ సామ్రాజ్యవాదానికి ఇజ్రాయిలీ వలసవాదానికీ వ్యతిరేకంగా పోరాడుతున్న అరబ్ ప్రజాపోరాటాన్ని బంగ్లా ప్రజలు బలపరుస్తారని ఆయన హామీ ఇచ్చారు.

అరబ్ రాజ్యాల పట్ల తమ వైఖరి గురించి అల్ గొమారియా జర్నలిస్టుతో ఆయన ఇలా వివరించారు.

"అన్ని దేశాలకంటె ముందు ఈజిప్టు మమ్మల్ని గుర్తిస్తుందని అనుకొన్నాను. సరే అది అలా ఉండండి. గుర్తింపు అనేది ఏదో ఒక రోజున జరుగుతుంది. అప్పుడు మనం మాట్లాడుకుంటాం. మిత్రుల్లా కలిసి ఉంటాం"

కాని వాస్తవాన్ని మీరు తెలుసుకోవాలి. బంగ్లాదేశ్ అస్తిత్వంలోకొచ్చింది. దాన్ని గుర్తించడం మీ బాధ్యం. చైనాను 20 సంవత్సరాలవరకూ గుర్తించడానికి అమెరికా నిరాకరించింది. మరి అధ్యక్షుడు నిక్సన్ ఈమధ్యనే పెకింగ్ వెళ్ళారు. చైనా ప్రజలన్నా, అమెరికా ప్రజలన్నా నాకేమీ కోపం లేదు. అలాగే ఈజిప్టు ప్రజల మీద కూడా సహజంగానే కోపంలేదు. పైగా అన్ని దేశాలూ అభివృద్ధి చెందాలనే కోరుకుంటాను."

మాట్లాడుతున్నప్పుడు మధ్యలో షేక్‌కు చాలా కోపం వచ్చింది. కొంత ఘాటుగా మాట్లాడారు. ఏది ఏమైనా తానేం కోపం పెట్టుకోబోవడంలేదని హామీ యిచ్చాడు షేక్. ఆయన ఇలా చెప్పుకుపోయారు:

బంగ్లాదేశ్ పట్ల అరబ్బు దేశాల మూగనోము

"నా దేశంలో 80 నుండి 90 శాతం ప్రజలు ముస్లింలు. కాని దురదృష్టం ఏమంటే మన అరబ్ సోదరులు దీనినెప్పుడూ పట్టించుకో లేదు. మేము అనుభవించిన దారుణమైన ఆటవిక కృత్యాలను వారెప్పుడూ ఖండన చెయ్యలేదు.

30 లక్షలమంది ప్రజల్ని మూకుమ్మడిగా చంపారు. దేశానికి ఎప్పుడూ లేని దారుణం దాపురించడంతో కోటిమంది భారతదేశం వెళ్ళిపోయారు. వారికి తిండి, బట్టా, నీడా, భద్రతా కల్పించడానికి భారత ప్రధానీ భారత ప్రజలూ ఎంతో శ్రమపడ్డారు. భారతదేశం నుండీ ప్రపంచం మొత్తం నుండీ జర్నలిస్టులు వచ్చి ఈ విషాదాన్ని చూశారు. కాని 3 కోట్ల 50 లక్షలమంది ఈజిప్టు ప్రజలతోపాటు 10 కోట్ల మంది అరబ్‌లలో ఒక్కరూ కదలలేదు. ఒక్క మనిషి కూడా రాలేదు. వాళ్ళేమీ పంపలేదు'

రెండున్నర కోట్ల ఇళ్ళు తగులబెట్టారని 2 లక్షల మంది స్త్రీలను చెరిచారని. వారిలో 95 శాతం ముస్లింలేనని చెప్పినప్పుడు ఆయన గొంతు విషాదంతో నిండిపోయింది. గద్గదంగా ఇలా చెప్పారు షేక్.

"మిమ్మల్ని బలపరిచింది మేము ముస్లింలం అయినందువల్లనే కాదు. మేము జాతీయవాదులం, విప్లవవాదులం అయినందున మిమ్మల్ని బలపరిచాం. ఒకవైపు 30 లక్షల మంది అమాయక ప్రజల్ని చంపుతుంటే మా ప్రక్కనున్నవాళ్ళు కనీసం చిటికెన వేలు కూడా ఎత్తలేదు

30 వేలు అంటే తక్కువా?

"ఈ ప్రాంతానికి గవర్నర్‌గా ఉండి ప్రస్తుతం పాకిస్తాన్‌ను పాలిస్తున్న జనరల్ టిక్కాఖాన్ తాను 30 వేల మంది కంటె ఎక్కువ మందిని చంపలేదన్నాడట. ఆ పాటి 30 వేల మందిని చంపడం మామూలు మాట అయినట్టు, అది పెద్ద లెక్కలోకి రానట్టు!! ఇది చిత్రంగా లేదూ!" అని అడిగారు.

ఇజ్రాయిల్‌కు సమాధానం ఇవ్వ లేదు

అరబ్‌లు కోరినంత మేరకు తమ వైఖరి అంతా తాము భారత ప్రధానితో ఇచ్చిన సంయుక్త ప్రకటనలో ఉందన్నారు.

"అన్నిరకాల దోపిడీ పీడనకు వ్యతిరేకంగా అరబ్ ప్రజల్ని బలపరుస్తాం, అరబ్ లక్ష్యంవైపే బంగ్లాదేశ్ నిలుస్తుంది. ఇజ్రాయిల్ తన గుర్తింపు పంపింది. మేము సమాధానం కూడా ఇవ్వలేదు. అయితే దాని పంపుతానని చెప్పారు. మేము నిరాకరించాం. అరబ్ భూభాగంలో ప్రతి అంగుళాన్ని ఇజ్రాయిల్ ఖాళీ చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం.

నూతన దేశం ప్రాతిపదిక ఏమిటని మహమ్మద్ ఓవా ప్రశ్నించగా ముజిబ్ ఇలా చెప్పారు.

అది నాలుగు ప్రాతిపదికలపై ఉంటుంది. జాతీయవాదం, ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సోషలిజం - మా మతాన్ని మేం వదులుకో బోవడంలేదు. కాని మతోన్మాదం పైన దేశాన్ని నిర్మించలేము

90 లక్షల కిలోల పుగాకు కొనుగోలు

యస్. టి. సి. చే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

గత మాసాంతానికి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు ప్రాంతంలో 4.29 కోట్ల రూపాయల విలువ చేసే 90 లక్షల కిలోల పుగాకును యస్. టి. సి. కొనుగోలు చేసింది.

"ప్రెస్టైజ్-ప్రీత్" ప్రదర్శన్

పయనీర్ టి.టి. (ప్రైవేట్) లిమిటెడ్, బెంగుళూరు వారిచే

10-4-72 నుండి 16-4-72 వరకు ఈ క్రింది ప్రాంతాలలో నిర్వహించబడుతున్నది

స్థలము	తేదీ	సమయము
పటమటలంక	10-4-1972	ఉ॥ 9-00
పెనమలూరు	10-4-1972	ఉ॥ 11-00
ఈడ్పుగల్లు	10-4-1972	సా॥ 3-00
గోసాల	10-4-1972	సా॥ 6-00
ఉణుకూరు	11-4-1972	ఉ॥ 9-00
కంకిపాడు	11-4-1972	ఉ॥ 11-30
పునాదిపాడు	11-4-1972	సా॥ 3-00
కోలవెన్ను	12-4-1972	ఉ॥ 9-00
బొడ్డపాడు	12-4-1972	ఉ॥ 11-30
బందరు	13-4-1972	ఉ॥ 10-00
పెడన	13-4-1972	సా॥ 5-00
గుడ్లవల్లేరు	14-4-1972	ఉ॥ 10-00
గుడివాడ	14-4-1972	సా॥ 5-00
నూజివీడు	15-4-1972	ఉ॥ 10-00
గన్నవరం	15-4-1972	సా॥ 5-00
విజయవాడ	16-4-1972	ఉ॥ 10-30
విజయవాడ	16-4-1972	సా॥ 4-30

నేడే చూడండి!
లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్
సంపూర్ణ రామాయణము
లక్ష్మీ ఫిలింస్ ఈస్ట్‌మన్ కలర్

నేడే చూడండి!
రైతుకుటుంబం
లక్ష్మీ ఫిలింస్

మన ధర్మం... వీర లక్షణం!

ఆర్థిక స్వాతంత్ర్యం లేని రాజకీయ స్వాతంత్ర్యం నిష్ప్రయోజనం, మన అవసరాల్లో నూరు పాళ్లూ స్వయం సమృద్ధి పొందిన నాడు మనకు బలం చేకూరుతుంది.
—శ్రీమతి ఇందిరా గాంధి

స్వశక్తి విధానం

స్వదేశీ విధానం అనే దృఢమైన పునాది మీదనే గోల్డెన్ టొబాకో కంపెనీ స్థాపించబడ్డది. స్వదేశీ విధానానికి వెన్నెముక స్వశక్తి, ఆ భావమే మమ్ములను ఎప్పుడూ ముందడుగు వేయిస్తున్నది. విదేశ గుత్త వ్యాపారుల ఆధిపత్యాన్ని ఎదుర్కొంటూ, పోరాడుతూ మా కంపెనీ భారతీయ సిగరెట్ల పరిశ్రమలో ప్రముఖ స్థానం చూరగొన్నది. ఇప్పుడు బాగా విస్తృతి చెందనున్న సమయంలో గోల్డెన్ టొబాకో వారు మన ధర్మం, వీర లక్షణం అయిన స్వశక్తి విధానానికి పునరాంకితం అయినారు.

ఇండియా స్వంతం, మీ స్వంతం కూడా!
నవరత్నాలు—ప్రతిదీ 100 పాళ్లు దేశీయం అలాకాక ఇండియాలో ఎక్కువగా విదేశ యాజమాన్యాల తయారయ్యే అత్యధిక సిగరెట్ల వల్ల అమూల్యమైన మన విదేశ మారక ద్రవ్యం నష్టమై పోతున్నది.

గోల్డెన్ టొబాకో కంపెనీ లిమిటెడ్

పూర్తిగా భారతీయమైనది—
● యాజమాన్యం ● అజమాయిషీ
● నిర్వహణ ● సాంకేతిక నైపుణ్యం

టొబాకో హౌస్, విల్ల పార్లె, బొంబాయి-56

CA (SP)-20-TEL

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ప్రింటర్ అండ్ పబ్లిషర్ టి. వెంకటేశ్వరరావు, ఎడిటర్ . పెమ్మలపల్లి శ్రీకృష్ణ ముద్రణ: స్వతంత్ర ఆర్టుప్రింటర్స్, విజయవాడ-4. R. No. 1138/57